1957, ఏప్రిల్ 25 వ తేదీ నుండి





ఆంధ్ర మహిళ

సంపుటి 13 :: మే '57 :: సంచిక 5

వ్యవస్థాపకురాలు

శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్

సంపాదకురాలు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ :

ఆంధ్ర మహిళా ప్రెస్

విషయ సూచిక

ఆంధ్రమహిళ

సంపుటి 13 :: మే '57 :: సంచిక 5

హేవిళంబి!

హేవిళంబి: కాలు గడపలో పెట్టీపెట్టకముందే రెండువందలమంది నిండు ప్రాణాలు గోదావరి పాలయినవి. ఈ సంవత్సరము ఏలా కొనసాగుతుందో! గాలిలో దీపము పెట్టి దేవుని మహత్మ్యము అంటే దీపము నిలుస్తుందా? ఓటి పడవలోకి మనుష్యులను ఎక్కించి మీ అదృష్టమని ప్రజా ప్రభుత్వము తప్పుకుంటే సరిపోతుందా?

ఎప్పుడుబడితే అప్పుడు ఇదివరలో మన రాష్ట్ర ప్రభుత్వము తను నిజమైన ప్రజాప్రభుత్వమని ప్రగల్భాలు కొట్టుకోవటము విని విని విసుగుబుట్టింది. ఈ అసలైన సిసలైన ఈ ప్రజా ప్రభుత్వము శ్రీరామ నవమినాడు భద్రాచలానికి వేలకువేలు యాత్రికులు వచ్చెదరని తెలిసీ చేసిన ఏర్పాట్లేవి? ప్రజా ప్రభుత్వమని మాటలలో చెప్పుకో గానే సరిపోయిందా? చేతలలో ఏది నిదర్శనము? ఈ ప్రజా ప్రభుత్వానికి ఈ నిర్భాగ్యయాత్రికులవిషయము శ్రద్ధ తీసికొనుటకు అసక్తి ఎక్కడుంది? హైదరాబాదు మహాపట్టణములో నాయకుని ఎన్నిక మంత్రిస్థానాల పంపకము, అధికారానికి పెనగులాటలలో నిమగ్నులై భద్రాద్రిలో శ్రీరామ నవమినాడు ఏర్పాట్లు చేయుట మరచారు. అట్లా మరచినవారు తమ తప్పు బహిరంగముగా వప్పుకుంటే ఎంతబాగుంటుంది? భద్రాద్రిలో ఏర్పాట్లు చెయ్యవలసిన వారెవ్వరు? వారెందుకు చెయ్యలేదు. పడవలవారిమీద పోలీసు ఉద్యోగిమీద చర్య తీసికొనటము ధర్మమేనా? పైనుండి వారికిచ్చిన ఉత్తర్వులేమి? వారు ఆ ఉత్తర్వులను ధిక్కరించారా లేక వారుల్లఘించ ఆర్డర్లేమి? అసలు భద్రాద్రిలో శ్రీరామనవమి యాత్రికులకు ఎటువంటి ఏర్పాట్లు జరుగకుండుటకు కారణమేమి?

మన ప్రభుత్వసారధులు నాస్తికులుకారని మాకు తెలుసు. తిరుపతిలో, శ్రీశైలములో చూపిన శ్రద్ధాసక్తులు భద్రాద్రిలో మృగ్యమగుటకు కారణము? సుమారు అరలక్ష యాత్రికుల మంచిచెడ్డలు చూచుటకు ముగ్గురు పోలీసులా? అదే ఏదైనా ఒక రాజకీయ సభైతే లారీలు లారీలు ఒక జిల్లానుండి ఇంకో జిల్లాకు దిగుమతయేవే! చివరకు మంత్రిసత్తముడైన ఒక జీవి బందోబస్తుకు కావలసిన పోలీసులైనా లేరే వేలాది భద్రాద్రి యాత్రికుల సంరక్షణ ఏర్పాట్లు పర్యవేక్షించుటకు! పాపము!

ఇంటిగుట్టు రట్టు చేసుకొనుట మాకు అలవాటులేదు. మన ప్రభుత్వాన్ని ఆక్షేపించుట మాకిష్టమైనపనికాదు. కాని రెండువందల నిండు ప్రాణాలు కేవలము ప్రభుత్వం అశ్రద్ధవల్ల పోతే చూచి వూరుకొనలేక తీవ్రముగా మా నిరసన తెలుపవలసి వచ్చినది. అందు ముఖ్యముగా అసహాయలైన స్త్రీలు బిడ్డలు ఎక్కువగా మరణించారని తెలుసుకొని మేము చాలా విచారించుచున్నాము. ఈ ప్రమాదమునకు కారణభూతులైనవారు తమ బాధ్యతలు, ధర్మాలు సరిగా నిర్వహించక ప్రజలకు ఎట్టి సబబైన సమాధానము చెప్పుకోలేకపోయినను మరో ప్రపంచములో ఈ స్త్రీ హత్యాపాతకమునకు జవాబు ఆ సృష్టికర్తకే చెప్పుకొనవలసియుండునేమో. ప్రజాప్రభుత్వము, ప్రజాక్షేమమునందు మరింత శ్రద్ధ చూపవలయునని మా హెచ్చరిక.

ప్రజాక్షేమము ద్వారా మంత్రిపదవులు సరిగా సరియైనవారికి ఇవ్వటము చాల ముఖ్యము. మన రాష్ట్రి మంత్రివర్గ విస్తరణ జూన్ నెలకు వాయిదా పడినట్లు ఇప్పుడే వార్తలు వచ్చినవి. ఈ మంత్రివర్గ విస్తరణలో ఒక స్త్రీకి కూడా స్థానముండగలదని ఊహాగానము జరుగుచున్నది. కొందరు, స్త్రీలకొక స్థానము ప్రత్యేకింప బడినట్టున్నా, మరి కొందరు స్త్రీలకివ్వకపోతే పేచీ వస్తుందనీ అంటున్నారు.

స్త్రీలకు ప్రత్యేకించుట డెమోక్రెసీ విధానము కానేరదు. పురుషులతోపాటు సమర్థతగల స్త్రీలుంటే వారి సహాయము మంత్రివర్గము ఆపేక్షించి వారికి మంత్రివర్గములో స్థానమిస్తే అది సముచితము. ఇచ్చేవారికి పుచ్చుకునే వారికీ గౌరవము, మర్యాద. పేచీ వస్తుందని స్త్రీలకివ్వటము హాస్యాస్పదము ! ఇచ్చేది గౌరవముగా ఇవ్వటము ఉభయులకు మంచిది.

త్వరలోనే మన రాష్ట్రిములో అప్పరు హౌసు ఏర్పాటు కానున్నట్లు అందు కేవలము కాంగ్రెసు కనీస సంఖ్యా బలమునకు కావలసిన ఆ పార్టీ మెంబర్లు వుందురనియు, మిగిలినవారు సమర్థులు, మేధాసంపన్నులు, పరిపాలనాదక్షత తెలసిన రాజకీయవేత్తలు కాని 'పెద్దమనుష్యులు' ఉండగలరని వార్తలు వచ్చుచున్నవి. ఈవిషయమునందును మన ప్రభుత్వ ధోరణి ప్రజలు అతి జాగ్రత్తగా పరిశీలించుచుందురు.

దైవము మన రాష్ట్రి ప్రభుత్వమునకు ధర్మము, న్యాయము చేయుటకు కావలసిన ధైర్యము,సాహసము సహృదయము కలిగించుగాక !

మహిళా పంచాయితీ

కృష్ణాజిల్లా విజయవాడ తాలూకా నందిగామ గ్రామానికి క్రొత్తగా పంచాయితీ ఏర్పాటుచేయబడింది. 20-3-57 తేదీన పంచాయతీకి ప్రప్రథమంగా ఎన్నికలు జరిగినాయి. ఈ ఎన్నికలలో పంచాయతీ సభ్యులుగా అందరూ స్త్రీలే ఎన్నుకోబడ్డారు.

ఎన్నుకోబడిన సభ్యులు :—

1. రాయల వెంకట రత్నమ్మ
2. వుప్పు రామతులశమ్మ
3. కొండపల్లి రాఘవమ్మ
4. షేక్ గాలేబుబి
5. మైల ఆనందము
6. నీలం ఆదెమ్మ
7. బండి మహాలక్ష్మమ్మ

లోగడ నెల్లూరు జిల్లా వవ్వేరు గ్రామంలో మొదటి సారిగా మహిళా పంచాయతీ ఏర్పడి జయప్రదంగా కృషి చేస్తోంది. వవ్వేరు స్త్రీలఆదర్శం నందిగామ ప్రజలనెంతో ఉత్సాహ పఱచింది. 20-3-57 తేదీన జరిగిన ఎన్నికలలో గ్రామస్తులంతా ఏక గ్రీవంగా స్త్రీలనే సభ్యులుగా ఎన్ను కున్నారు.



కుమారి లక్ష్మీపున్నమ్మ



ఆంధ్ర మహిళా సభ
ఉగాది ఉత్సవము

హేవిళంబి ఉగాది ఉత్సవము ఆంధ్రమహిళా సభా భవనములో జయప్రదముగా జరిగినది.

కుమారి పర్వతనేని లక్ష్మీపున్నమ్మ ధ్యానయ రంజకంగా నృత్యప్రదర్శన చేసినది. చిరంజీవులు సంధ్యారాణి, గిరిజారాణి, కుముద పాటలు పాడిరి. ఆంధ్ర మహిళా సభ తరపున శ్రీమతి వి. లక్ష్మీ పార్వతిగారు, కుమారి లక్ష్మీపున్నమ్మకు ఒక మందిరములోని దంతపు కృష్ణుని బహూకరించిరి. సభా కార్యదర్శిని శ్రీమతి లక్ష్మీరఘురామయ్యగారు సభ్యులందరికీ నూతన సంవత్సరమునకు శుభాభివందనములు, శుభాకాంక్షలు తెలిపిరి.

ఈ ఉగాది శుభ ముహూర్తమున మద్రాసు స్టేట్ వెల్ఫేర్ ఎడ్వైజరీబోర్డు అధ్యక్షురాలు శ్రీమతి అంబుజమ్మాళ్‌గారు ఆంధ్ర మహిళాసభ హాస్టలు కొత్త బ్లాకు ప్రారంభోత్సవము జరిపిరి.



గవర్నరు సతి జాన్ గారికి ఆంధ్ర మహిళా సభ వివిధ శాఖలతో ఎట్లు అభివృద్ధి అయినదీ అంచలి ఉపాధ్యాయిని విశదపరచు చున్నారు.

ఆంధ్ర మహిళా సభ

ఆంధ్ర మహిళా సభ వివిధ శాఖల కార్యక్రమములను పరిశీలించుటకుగాను మద్రాసు గవర్నరు శ్రీ ఎ. జె. జాన్‌గారి సతీమణి ఈనెల 9 వ తేదీని ఆంధ్ర మహిళా సభా భవనమునకు విచ్చేసినారు. ఆంధ్ర మహిళా సభ కార్యదర్శులునూ, కార్యనిర్వాహకవర్గ సభ్యురాండ్రును గవర్నరు సతీమణికి స్వాగతమిచ్చి సభలో జరుగుచున్న కార్యక్రమములన్నింటిని కనుపరచారు. గవర్నరు సతి సభా భవనమునుండి, నాగేశ్వర శిశువిహార్‌నకు, అక్కడినుండి ఆంధ్ర మహిళా నర్సింగ్ హోమునకు పిదుపరి ఆంధ్ర మహిళా ప్రెస్‌నకు ఆంధ్ర మహిళా సభ ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటరుకు వెళ్ళి వాని కార్యక్రమములను పరిశీలించారు.

ప్రపంచములో స్త్రీల జయాలు—అపజయాలు :

ఆంగ్లమహిళ సమస్య—అమెరికన్ వనిత జవాబు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

అప్పుడే అమెరికా దేశమంతా పర్యటించి వచ్చిన ఒక ఆంగ్లమహిళ ఒక అమెరికన్ వనిత లండనులో కలుసుకున్నారు. సహజముగా వారి సంభాషణ ఆంగ్ల మహిళ పర్యటనను గురించి ఆరంభ మయింది.

"ఆ మీ ఆతిధ్యము ఆ ఆనందము నేనెప్పటికి మరవజాలన"ని కేవలము లాంఛన ప్రాయంగా ఆంగ్ల స్త్రీ అన్నట్లు తోచింది. కాని వెంటనే.

"మీ అమెరికా స్త్రీలకేమొచ్చింది? నేను దేశము మొత్తముమీద ఎక్కడ స్త్రీలను కలుసుకొన్నా వారు అసంతృప్తులుగా వున్నారు. ఎదో అసంతృప్తితో ఏదో నిరాశతోనే ఎప్పుడూ మాట్లాడేవారు. వారికేం చక్కని దేహ సౌందర్యము తెలివి తేటలు, అనేక చక్కని అవకాశాలు. స్వాతంత్ర్యము ఇన్ని వున్నా వాటినన్నిటినీ ఉపయోగించుకోకుండా అసంతృప్తులుగా వుండటానికి కారణ మేమిటి? ఇవేమీలేని మా బ్రిటిష్ స్త్రీలే నయమే, వాళ్ళు మీ కన్నా తెలివితక్కువ వాళ్ళు, అందచందాలలో కూడా తక్కువే ననాలి. కాని వాళ్ళకు మీలోవలె నిరాశ లేదే. నాకు మీ అమెరికన్ మహిళలు వారివిధ్యుక్తధర్మములు సరిగా నిర్వహిస్తున్నట్లు తోచటంలేదు. ప్రపంచములో అమెరికా తన గొప్పతనము శాశ్వతముగా నిలబెట్టుకోవాలంటే అమెరికన్ మహిళలు వారి ధర్మాలను సరిగా నిర్వర్తించా లనుకుంటాను. ఏమంటారు మీరు? నేనుచెప్పేది నిజమా కాదా?" అనే ఆంగ్లయువతి నిక్కచ్చి ప్రశ్నకు చేస్‌సతి నిర్ఘాంత పడుతూ నిలబడి పోయింది.

ముప్పది నలుబది సంవత్సరాలు చేస్‌సతి ఉపాధ్యాయినిగా, కళాశాలలో లెక్చరరుగా. దేశమంతా నలుమూలలూ పర్యటిస్తూ పెక్కువేల మంది అమెరికన్ యువతులను. స్త్రీలను, వివాహితులను చదువుకొనే వారిని సంసారము చేసేవారిని. ఉద్యోగాలు చేసేవారిని కలుసుకొని వారితోసన్నిహిత సంబంధ బాంధవ్యాలుండటముచేత వెంటనే ఆంగ్లమహిళ ఆరోపణ "కాదు" అనలేక పోయింది. తలవంచుకుని "నిజమే" నన్నది.

"కారణము?" అన్న ఆంగ్ల మహిళ ప్రశ్నకు చేస్‌సతి సుదీర్ఘంగా ఆలోచించి ఇలా జవాబు చెప్పింది.

"నిజమే మా మహిళలకు ఈ ప్రపంచంలో ఎవ్వరికీ లేనన్ని సదవకాశాలున్నవి. అయినా వారు అసంతృప్తులుగానే వున్నారు. మీరన్నట్లే వారు వారిధర్మాలను సరిగా నిర్వహించటము లేదనే ఒప్పుకోవాలి.

కళాశాలలలో చదువుకునే యువతులు పిన్నవయస్సులోనే వివాహాలు చేసుకుంటున్నారు. కులాసాగా భర్తలతో కాపరాలు చేస్తున్నారు. పిల్లలను కని వారితో ముచ్చటగా ఆనందిస్తున్నారు. వివాహాలు చేసుకొనని వారి కాలమును దుర్వినియోగము చేసుకొనకుండా, గోళ్ళు కొరుక్కుంటూ కూర్చోకుండా అనేక వృత్తులలో ప్రవేశించి ప్రశంసనీయముగా పనిచేస్తున్నారు. అట్టిసంపాదన ద్వారా తాము హాయిగా కాలక్షేపముచేస్తున్నారు. ఇతరులకు సహాయము కూడా చేస్తున్నారు కాని—

కాని, మీరు చెప్పినట్లు అమెరికన్ స్త్రీలు తమ హక్కుల నన్నీ అవకాశాలనన్నీ సద్వినియోగము చెయ్యటము లేదు. పెద్దపెద్ద శాస్త్రవేత్తలు, గాయకులు, నాయకులు రచయితలు విద్వాంసులు అయే అవకాశము లేకపోవచ్చు, కాని అమెరికన్ స్త్రీలలో ఎక్కువమంది మంచి మేధాశక్తి గలవారే. వారు జాతీయ పురోభి వృద్ధిలో పాల్గొనుటలేదు. తమ బాధ్యతలు నెరవేర్చటము లేదు. కళాశాలలలో అత్యుత్తమ శ్రేణులలో పరీక్షలలో కృత

[illegible]

తరువాత ఎక్కడ వేశావే గొంగళీ అంటే వేసినచోటే వున్నా నన్నట్లు చడీ చప్పుడూ లేకుండా వుంటున్నారు. కారణము వారి భర్తలనుండి వారికి సహకారము లభించకపోవటము మాత్రము కాదు. వారి భార్యల తెలివి తేటలకు పనిపాటలకు అమెరికన్ భర్తలు ఎప్పుడూ గర్వపడుతూనే వుంటారు. కాని వివాహములు చేసుకొన్న తరువాత అమెరికన్ స్త్రీలకు వారి శాస్త్ర పరిశోధనలలో గాని, వారి కవిత్వములోగాని, గానములోగాని శ్రద్ధ సన్నగిల్లి పోవుచున్నది. నిజంగా ఎంతమంది గొప్ప స్త్రీ రచయితలు, గాయనీమణులు తయారు కావలసి యున్నది!

సాంఘికముగా, రాజకీయముగా, ఆధ్యాత్మికంగా స్త్రీలు అమెరికాలో ఎంతో పని చేయవలసి యున్నది. కానీ వీటిలో వేటిలోను అమెరికన్ స్త్రీలు ఉత్సాహకరంగా, నిర్మాణాత్మకంగా కృషిచేయటములేదు. కానిపెక్కుమంది ఏదో సంఘసేవ చేస్తున్నామని, రాజకీయాలలో పాల్గొంటున్నామని, అనేవారు ఎక్కడ బడితే అక్కడ కనబడుతూవుంటారు. వీరు సంఘసేవ చేస్తున్నామని మొక్కు చెల్లించుకుంటున్నట్లుంటుంది. వీరంతా ధర్మానికి, త్యాగానికి. ఆనరరీగాపనిచేస్తున్నామని గొప్పగాచెప్పుకుంటారు. వారు ఏదో మంచిపని చేస్తున్నామని అనుకొనటమే గాని, నిజంగా వారుచేస్తున్న మంచిపనిఏమీలేదు. వారు స్థిరంగా నిర్మాణాత్మకంగాచేస్తేకదా? ఏదోతమాషాగా విలాసంగా, క్రీడగా చేయటమువల్ల లాభముకన్న నష్టమే ఎక్కువ.

పైగా యువతులు వివాహము చేసుకున్న తరువాత గృహోపకరణముల సంపాదనలో పడిపోవుట చాలావిచారకరము. ప్రతి గృహిణి తనశక్తికి మించినదైనా ఒక ఫ్రిజిడేరు. టెలివిజను సెట్టు, కార్లు, ఇల్లువాడ్చే. బట్టలుతికే ఫనిముట్లకై తహతహ లాడుతారు. ఇన్‌స్టాలుమెంటు (ప్రతినెలా డబ్బుఇచ్చి వస్తువులనుకొనుక్కునే పద్ధతి) పద్ధతిలో గృహోపకరణములన్నీ సంపాదించటానికి ఒకరితో ఒకరు పోటీ పడ్డట్లు కొనుక్కుంటారు. ఆకొనటమువల్ల కలిగే ఆరాటము, అందోళన మనస్సును చికాకు కల్గించి శాంతి సుఖాలను నాశనము చేస్తుంది. ఆ వస్తువులు కొనుటవల్ల వాటికి వడ్డీ విధంగా ఎంతఎక్కువ కట్టవలసి వస్తున్నదీ ఎప్పుడూ అందోళనగానే వుంటుంది. అప్పుల బాధకు మించినబాధ వేరేలేదు కదా? ఎప్పుడు ఏదైనా వస్తువు ఘట్టిగా సంపాదించవలెనని కోరిక కలుగుతుందో అప్పుడు దానివల్ల దుఃఖము, నిరాశ కలగటము సహజమే!

కేవలము సాంసారిక వస్తుసేకరణలో అనాత్మక విధానమునబడి ఆధ్యాత్మిక ఆత్మవిధానములు మరచుచున్నారు.

పైగా అమెరికన్ స్త్రీలు శ్రేయస్సును ఆలోచించుకోకుండా ఎక్కువగా త్రాగుచున్నట్లు కనపడుచున్నది. దీనివల్ల ఇంటిగుట్టు రట్టు చేసుకొనటము ఆరోగ్యమును సంసార జీవితాన్ని నాశనము చేసుకొనటము జరుగుతూ వుంది.

భార్య ఎంతకష్టపడుతున్నదీ భర్త తెలుసుకొనక పోవటము ప్రపంచంలో ఎక్కువ దుఃఖానికి, అసంతృప్తికి కారణము.

అన్నిటికన్నా ఎక్కువ దుఃఖాన్ని అసంతృప్తిని ఇచ్చేవి ఆరాటన ఆందోళన, మొన్న ఒక అమెరికన్ యువకుడు తను. వివాహము చేసుకొనుటకు వెనకాడుతున్నట్లు చెప్పాడు. తన తల్లి, తనతండ్రి, తనూ తృప్తిగా లేనప్పుడు మరొక అసంతృప్తురాలైన సఖ్యురాలిని కుటుంబములో చేర్చుటకే ఆ యువకుడు ఆ వివాహమాడుటకు సందేహిస్తున్నాడట! ప్రతి అమెరికన్ స్త్రీ ఏదో చేతిలోనిది జారవిడచినట్లు, కర్తవ్యము అగోచరమైనట్లు, ఆదర్శము అదృశ్యమైనట్లు, దారితప్పినట్లు బాధపడుచున్నది. పూర్వము ఎప్పుడో వర్డ్స్‌వర్తుకవి చెప్పినట్లు అమెరికన్ స్త్రీలు తమ జీవితముల విధానములను బాగుగఆలోచించుకొనవలసి యున్నది. కావున అమెరికన్ స్త్రీలు తమ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక నైతికవిలువలు గుర్తించి తమ విధ్యుక్త ధర్మములను నిర్వర్తించిన నాడు, నిరాశా దుఃఖములు నశించి తృప్తి ఆనందములను పొందెదరు."

[లైఫ్ పత్రికలోని చేస్‌సతి వ్యాసమునకు ఆధారముగా ఆ పత్రికకు కృతజ్ఞతతో]

[మన జీవితాల్లోని ఘట్టాలని సమీక్షించుకొని గాని, ఇతరుల జీవిత విధానములు పరిశీలించుకొని గాని మనము మన జీవిత విధానములు నిర్ణయించుకొన వలయును. మన జయాపజయాలు, ఇతరుల జయాపజయాలే మన జీవితములలో సైను పోస్టులు. ఆంగ్ల అమెరికా సోదరీమణుల సంభాషణలను బట్టి మనము మన జీవితాలని మరియొక సారి పర్యవలోకించవలసి యున్నది. మనము రాజకీయముగా, సాంఘికముగా, నైతికముగా పురోగమిస్తున్నామా? మన స్త్రీలువారి వారి విధ్యుక్త ధర్మాలను నిర్వహిస్తున్నారా? మన దేశములో సంఘసేవ సక్రమముగా జరుగుచున్నదా? ఈ విషయముపై మూడు పేజీలకు మించకుండా సవిమర్శలు పంపిన పైసెల మహిళలో ప్రకటింప బడును.]

—సంపాదకురాలు.

స్కెచ్ :

నవ్వు

శ్రీమతి దాసరి శారద

నాకు చిన్న చిన్న విషయాలకే ఊరికే నవ్వు వస్తుంది నవ్వుతో పాటు నాలుగు చివాట్లుగూడ తింటుంటాను. ఎందు కంటారేమో ! నవ్వినందుకు.

కొందరు కారణం లేకుండానే నవ్వుతారు. మరి కొందరు ఎంత నవ్వువచ్చే విషయమైనా నవ్వ నేనవ్వరు. ఈ సందర్భములో షేక్సుపియరు మహాశయుడు ఈ విధముగా అంటాడు. "కొంతమంది మనుష్యులు దేన్ని చూసినా చిలకల్లా నవ్వుతారు. కొందరు ఎంత నవ్వు వచ్చే విషయాన్ని విన్నప్పటికి నవ్వనే నవ్వరు." ఈ రెండవ తెగకు చెందిన వాళ్ళను ఏమనాలో నాకు తెలియదు.

రవీంద్ర నాథఠాకూరు తన చిన్నతనంలో క్లాసులో కూర్చుని పాఠము వింటున్నాడట. ఉన్నట్లుండి ఆయన పక్కున నవ్వాడట. అందుకు మాష్టరుగారు ఠాకూరుని లేపి "క్యోంహస్తేహో?" — (ఎందుకు నవ్వుతున్నావు?) అని ప్రశ్నించారట. ఠాకూరు తడుము కోకుండా వెంటనే "హసీఆయా !" (నవ్వు వచ్చింది) అన్నాడట. ఇంక మాష్టరుగారికి ఏమి చేయాలో తోచక కూర్చోమని చెప్పారట.

ఈ సందర్భంలో మీకొక విషయము చెప్పాలి. ఒక సారి నా మిత్రురాలు బడినుండి యింటికి వస్తూ యిద్దరబ్బాయిలని చూచి నవ్విందట. వారిద్దరిలో వాదన బయలు దేరింది. ఏమంటే ఒకడంటాడు "ఆ అమ్మాయి మా పిన్నికూతురు. అందుకే నన్ను చూచి నవ్వింది" అని రెండవ వాడేమన్నా తక్కువ తిన్నాడా? "ఆ అమ్మాయి నా ఫ్రెండు గూడ. అసలు నన్ను చూచే నవ్వింది." అన్నాడు. ఇంకేం మొదట వాడికి అరికాలి మంట నడినెత్తి కెక్కింది. వెంటనే ఆ అమ్మాయి దగ్గరికి పరుగెత్తి కెళ్ళి "ఏమండీ ఆ అబ్బాయి మీ స్నేహితుడా? మీరతని చూచేనా నవ్వింది?" అని అడిగాడట. వెంటనే ఆ అమ్మాయి "నేను వాడిని చూచిగాని, నిన్ను చూచిగాని నవ్వలేదు. మీ రిద్దరూ గుడ్లు మిటకరించి గుడ్లగూబల్లా నావైపు చూస్తుంటే నవ్వువచ్చినవ్వాను. చాల్లే ! పోవయ్యా పెద్దమనిషి !" అన్నదట. వాళ్ళు చెరొకదారి పట్టారట.

సామాన్యంగా మనకు తెలిసిన వాళ్ళుగాని, బంధువులు గాని కనబడితే చిఱునవ్వు నవ్వుతాము. అంటే మనకు గల మిత్రత్వం, బాంధవ్యం చిఱునవ్వు ద్వారా తెలియజేస్తామన్న మాట. కొంతమంది మనుష్యు లుంటారు - వాళ్ళు మనకు తెలియక పోయినా వాళ్ళతో మనకెట్టి పరిచయమూ లేకపోయినా సరే మహాతెలిసినట్లు నవ్వుతారు. వీళ్ళని పిచ్చి వాళ్ళనాలో లేకపోతేయింకా ఏమనాలో నాకు తెలియదు. ఇలానవ్వే పిచ్చి వాళ్ళని తలచుకొని నేను ఒకటే నవ్వు కుంటుంటాను.

ఇంకా కొందఱు నవ్వవలసిన సమయములో గూడ నవ్వనే నవ్వరు. నవ్వితే నోట్లో ముత్యాలన్నీ రాలిపోతాయేమోనని భయమనుకుంటాను. ఆ విధముగా ఉంటే వీరికి గొప్ప అనుకుంటారు. నవ్వితే గౌరవాని కేమైనా భంగమేమో ! అంటే నా ఉద్దేశం పిచ్చినవ్వు నవ్వమని కాదు. నవ్వదగ్గ విషయానికిగూడ నవ్వకుండా ఉండటం వారి దౌర్బల్యాన్ని సూచిస్తుందేగాని వేరు కాదు.

జపాను దేశస్తులు ఏదైనా నవ్వువచ్చే విషయం విన్నప్పుడు వెంటనే నవ్వరట. ఇంటికిపోయి ఆలోచించుకొని అప్పుడు కడుపుబ్బ నవ్వుతారట. దీన్నే "జపాన్ విట్" అంటారు.

కొందఱు మందహాసం చేస్తారు. కొందఱు నవ్వుతుంటే ఇంటికప్పు లేచిపోతుందేమో ననిపిస్తుంది. దీనిని

అట్టహాసమంటే బాగుంటుందేమో ! వారు నవ్వేటప్పుడు ప్రక్కనున్న వారి వీపుగూడ పగిలి పోతుందనటములో అతిశయోక్తి లేదు. ఒకసారి నేనూ మా పిన్ని కూతురూ కలసి "సినిమా"కు వెళ్ళాం. ఆట జరుగుతూంది. మధ్యలో హాస్య సన్నివేశాలు కన్పించి నప్పుడల్లా మా పిన్ని కూతురు ఒకటే నవ్వటం, పోనీ నవ్వి ఊరుకున్నా బాగానేవుండు. ప్రక్కనున్న నావీపు మీద ఒకటే కొట్టటం మొదలు పెట్టింది. అంటే ఆమె నవ్వుతో తన్ను తాను మరచి పోయిందన్నమాట. ఆంత ఉద్రేకంలో ఆమె మైమరచి నన్నుగూడ నవ్వమని గాబోలు ఒకటేబాదింది. ఆమె నవ్వేట్లా వున్నా నా వీపు వాచిపోయి నాకు ఏడుపు వచ్చిందంటే నమ్మండి.


కొంతమంది, విషయము అర్థమయినాకాక పోయినా "రేగి చెట్టుక్రింద ముసలమ్మ"లాగ నవ్వుతారు.

ఏమన్నా కానీయండి. అసమయాల్లో నవ్వటము మాత్రం మంచిది కాదు. అందువల్ల అనేక నష్టాలు కలుగక మానవు. అలానవ్వబట్టే లక్ష్మణుడనేక మాటలు పడవలసి వచ్చింది.

పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యంలో సీతారాముల్ని కంటిరెప్పలా కాపాడాడు లక్ష్మణుడు. పధ్నాలుగు సంవత్సరాలు పూర్తయినతరువాత తిరిగి అయోధ్యకువచ్చారు. శ్రీరామ చంద్రుడికి పట్టాభిషేకము జరుగుతూంది. ఆ సమయంలో లక్ష్మణుడి కంటిమీదకి కూర్పు వచ్చిందట. ఇన్నాళ్ళులేని నిద్ర యిప్పుడు వచ్చి పడిందేమిటనుకొని లక్ష్మణుడు నవ్వుకున్నాడట. అంటే లక్ష్మణుడు పధ్నాలుగు సంవత్సరములు నిద్రను త్యజించాడన్నమాడ. కాని అయోధ్యకు తిరిగివచ్చి రాముని పట్టాభిషేకము జరుగుతున్న సమయములో అయనకు నిద్ర వచ్చిందట. అందుకు లక్ష్మణుడికి నవ్వువచ్చి నవ్వాడట. అదిచూచి నలుగురూ నాలుగు విధములుగ అనుకున్నారట. చివరకి శ్రీరాముడు గూడ తాను సీతను మళ్ళీ పరిగ్రహించినందుకు లక్ష్మణుడు నవ్వి వుంటాడను కొన్నాడట. ఈ విధంగా అందరూ అనేక విధాలుగా అనుకొన్నారట. అందుకే "నవ్వు నాలుగు విధాలచేటు" అన్నారు పెద్దలు.

ఒకసారి బ్రహ్మదేవుని సభలో దూర్వాస మహాముని మందపాలుడను మునితో పోటిబడి సామగానము చేస్తుండగా స్వరము తప్పినదట. అక్కడే బ్రహ్మదేవునికి వింజామరతో విసురుచున్న సరస్వతీదేవి పక్కున నవ్విందట. వెంటనే దూర్వాసునికి అరికాలిమంట నడినెత్తికెక్కింది. వెంటనే ఆయన సరస్వతిని శపించాడట. దాని ఫలితంగా ఆమె మర్త్యలోకానికి పోవలసి వచ్చింది. చూడండి ! దూర్వాసునికి స్వరము తప్పితే సరస్వతీ దేవి నవ్వింది. ఆమె చదువుల తల్లి గనుక తప్పిపోతే నవ్వు వచ్చి నవ్వింది. అది సహజము కాని "సులభ కోప మహర్షి" అయిన దూర్వాసుడు కోపముతో కన్ను కానక వాణినే శపించాడు.

ఈ విధంగా నవ్వు వలన అనేక నష్టాలు గూడా వున్నాయ్. ఈ వ్యాసంలో కొన్ని మాత్రమే చెప్పాను. వీలుంటే ఈసారి యింకా కొన్ని చెప్పుకొందాము. ఇప్పటికి సెలవు.



పుష్ప సంపద

శ్రీమతి సువేణికాశ్యప్

వసంత ఋతువు వచ్చింది. ప్రకృతి సౌందర్యము వర్ణింప నలవిగానిదిగా ఉంటుం దిప్పుడు. లేత చిగురులతోను వివిధ రకాల పుష్పాలతోను సుందర వంతముగా ఉంటుంది. దానికి మెరుగు పెడ్తూంటాయి కోయిల తియ్యని స్వరాలు. అన్నిటినీమించి పుష్పాలమధుర సువాసనలు ప్రకృతినంతా పులకరింప జేస్తుంటాయి ఇట్లా ప్రకృతిని సౌందర్య వంతముగాను. సుగంధ పూరితముగాను చేసే పుష్పాలు మనకెంతవరకు ఉపయోగిస్తున్నాయో చూదాము.

పుష్పాలంటే స్త్రీ పురుషుల కిద్దరికి యిష్టమే. కాకపోతే స్త్రీకి కొంచెమెక్కువ పాలుంటుంది. అందుకనే పుష్పాన్ని చూడగానే స్త్రీ వెంటనే తీసి తన వేణిలో ధరిస్తుంది. అయితే యిదికొంత అలవాటు కూడా అనుకొండి. ఎంత ఆలోచించి మనపూర్వులీ అలవాటును మనకుచేశారో! పుష్పములోని అందాన్ని మాత్రమే కాకుండా దానిలోని గుణగణాలను గూడ గ్రహించారు మన పూర్వులు. ఈ పుష్పాల రంగులలో, సువాసనలలో భేదమున్నట్లే అవి యిచ్చే ఫలితాలలోకూడ భేదముంది.

సామాన్యముగా పుష్పములు చల్లదనమిస్తాయి వంటికి. అవి తలలో పెట్టుకోవటం ద్వారా వాటిలోని సువాసననేగాక వాటిలోని చల్లదనముకూడ మనము పొందుతాము. నిజానికి పుష్పాలు మనకు చేస్తున్నసేవ కనిపించనట్టి త్యాగమనాలి. వాటి అందాన్ని, సువాసనలను మన మపహరిస్తున్నామనే కోపంలేకుండా వాటి చల్లదనాన్ని మనకిస్తున్నాయంటే అవియెంత ఉదార హృదయము కలవో కదా!

సామాన్యంగా మల్లె, జాజి, లిల్లి, చెంగల్వ, మొదలైనవి చల్లదనాన్ని కలుగజేస్తాయి. వీటినెక్కువగా ఉపయోగించటము వలన తలనొప్పి, వేడిచేత కలిగిన కండ్లపోటు, నొప్పి మొదలైనవి పోతాయి. కండ్లెఱ్ఱగా ఉన్నప్పుడు మల్లెపువ్వు లెక్కువగా తల్లో పెట్టుకోవటం మంచిది.

మందార, గోరింటపువ్వు మొదలైనవి తలవెంట్రుకలు నల్ల పడేందుకు తోడ్పడుతాయి. అయితే యీ రెండు పువ్వులుకూడా చాల చోట్లలో తల్లో పెట్టుకోరు తక్కిన

వాటివలె. అలాంటప్పుడు కదంబములో కట్టిపెట్టు కోవటం మంచిది. ఈ మందార పుష్పాన్నెక్కువగా వాడటం వలన కొన్ని కొన్ని జబ్బులుకూడ నయమవుతాయి.

ఇకపోతే పొగడ పువ్వు, చామంతి పువ్వు కొద్దిగ వేడిని కలుగ జేస్తాయి. అయితే యివి వచ్చేకాలం చలి కాలం కనుక అప్పుడు వాడినా అంతప్రమాదం ఉండదు.

దవనం, మరువం, మాచిపత్రి మొదలైన ఆకులు కూడ సువాసనను, అందాన్ని కలుగ జేస్తాయి. వీటిని పువ్వుల మధ్యలో కలిపిపెట్టుకొంటే పువ్వుల అందాన్ని ద్విగుణీకృతము చేస్తాయి. దవనము, మరువము బాగా ఆరనిచ్చి బట్టలమధ్య వేసి ఉంచుకొంటే బట్టలు చక్కటి వాసనను కలిగి ఉండటమే కాకుండా పురుగు కొట్టకుండా ఉంటాయి.

గులాబిపువ్వు అందమైనది. సుకుమారమైనది. దీనిని పెట్టుకోవటము వలన జుట్టు మెత్తగా ఉంటుందంటారు. ఎంత వరకు నిజమో మరి!

ఇకపోతే వీటినెలా ఉపయోగించాలో చూదాము. పువ్వులతో అలంకరణ అనేక విధములు. ఎలా అలంకరించుకొన్నా అవి మనకు లేని అందాన్నిచ్చేట్లుగా ఉండాలిగాని మనకున్న అందము పోగొట్టేట్టు చేసి వానికి అవమానం కలిగేలాగు ఉండకూడదు.

ఈ పుష్పాలతో అలంకరించు కోవటం అనాదినుండి ఆడవారి కలవాటు. కాళిదాసు కాలమందు స్త్రీలు ఈ పుష్పాల కెంతో ప్రాముఖ్యత యిచ్చినట్లు కనబడుతున్నది. కాళిదాసు శాకుంతలములో శకుంతలను ఆమె చెలికత్తెలు పొగడ పూల దండలతోను, చెఱకు చిగుళ్ళతోను అలంకరిస్తారు భర్తకడకు వెళ్ళేటప్పుడు. కుమార సంభవములో నవయౌవ్వని అయిన పార్వతి అశోక కర్ణికార సింధూవార పుష్పములతో చిగురుల తోడను అలంకరించు కొంటుంది. చివురులను చెవిసందునను. కొండగోగు పువ్వులను దన ముంగురుల ముందు పెట్టుకొంటుంది. ఆ పువ్వులు జారుతూండేట్లుగా పెట్టుకొనట మారోజులలో ఫాషనేమో! ముంగురులలో పెట్టుకొన్న పువ్వులు. చెవియందు ధరించిన చిగుర్లు శివునికి నమస్కరించేందుకు వంగగానే జారిపోతాయి. అట్లాగే ఆమె ధరించిన పొగడపూవుల దండకూడ ఆమె నడుస్తూంటే ఆ కదలికకు జారి పోతూంటుంది. అందులో వింత సౌందర్యము పొందుతుంది పార్వతి. అంతే కాకుండ ఆరోజులలో విలాసార్థము పువ్వులనుచేతులతో పట్టుకొంటున్నట్లు పార్వతి చేతితో పట్టుకొన్న పద్మము స్ఫురింప జేస్తుంది.

అంతే కాకుండా పూర్వము పువ్వులను దండలుగా కట్టి మెడలోకూడ ధరించేటుగా అనిపిస్తుంది. జయదేవుడి రాధ కృష్ణునిపై యుండే ప్రేమచేత కలిగిన విరహాగ్నికి ఆమె ధరించిన పుష్పములు కమిలిపోతాయి. ఇట్లా విలాసార్థము పువ్వులు చేతిలో వంటిమీద ధరించే అలవాటు మనలో యిప్పుడు లేదుగాని పాశ్చాత్యులలో ఉంది. గులాబి మొదలగు పుష్పాలు వాళ్ళు చేత్తో పట్టుకొంటూంటారు. అంతేకాకుండా వాళ్ళు దుస్తులందు ధరిస్తూంటారు.

ఈ నాడు మన మల్లా శరీరమంతా ధరించకపోయినా తల్లో పెట్టుకొంటూంటాము. ఈ పువ్వు లనేకవిధాలుగా పెట్టుకొంటూంటారు. వాలుజడమీద వాలుగాజారుతుండేట్లు బొత్తిగా పెట్టు కోవటము సామాన్యము. రెండు జడలమీద యిటునుంచి అటుపైపుకి ఆర్చీగా పెట్టుకోవటము మామూలు. అలాగే ఒకే జడమీద కూడ పెట్టుకొంటూంటారు.

అయితే ఈనాడు కొత్తగా పెట్టుకొనేవిధము భాయీ భాయీలోని నిరుపరాయిలాగ ఒకేపైపు చెవుల వెనకగా మెడమీద వరకు వాలుగా వేలాడేట్లు పువ్వుల దండ ముడిచి పెట్టుకోవటం. ఇకపోతే చుట్టమీద పువ్వులు పెట్టుకోవటం గమనించ దగినది. ఇది అనేక రకాలుగా పెట్టుకొంటారు. చుట్టకు చుట్టూ పెట్టుకొంటారు. కొన్ని చుటలకు చుట్టమధ్య మాత్రము పెట్టుకొంటారు. ఈ చుట్టలకొక ప్రక్కనే మెడమీదే వాలేట్లుగా పెట్టుకొంటారు. వీనినితియా ముఖానికి సరిపోయేట్లు అలంకరించుకోవటంలో అందము కల్పించుకోవచ్చు. అలాగే దుస్తుల కుసరిపోయేట్లు పెట్టు కోవటంలో అందముంది.

ఇట్లా పుష్పాలను అందము కోసమే కాకుండా ఆరోగ్యంకోసం. సువాసనల కోసం ఉపయోగిస్తూ వసంత ఋతువును పూర్తిగా అనుభవించండి.

కృతఘ్నుడు

కుమారి రేమణి స్వరాజ్యలక్ష్మి

"పోనీరా తమ్ముడూ! అది మరీ అంత యిదవుతుంటే, దాన్ని వదలి వెళ్ళగూడదూ! నాలుగు రోజులు పోయింతరువాత మన రాముడితో పంపిస్తాగా" అంది శాంతమ్మగారు తమ్ముడిని చూచి.

"అలా వీల్లేదక్కాయి! వుంచడానికి వీల్లేదంటుంటే వినవేం" అన్నాడు రాధాకృష్ణ కోపంతో.

"అయ్యో నాయనా! ఈమాత్రంవానికి విసుగెందుకురా! ఏమిటో చంటి సన్నాసికదా, యింకా నలుగురినీ విడిచి యెప్పుడూ వుండలేదు పోనీ బెరుకు తీరినతరువాత వస్తుందని అన్నానంతే. అంత వుంచడానికి వీల్లేకపోతే తీసుకెడుదువుగాన్లే! అయినా నాపిచ్చిగానీ మీచేతుల్లో పెట్టిన తరువాత పిల్ల మీదిగాక నా దవుతుందా. ఎంత తమ్ముడయినా అప్పయినా" అంటూ నిష్ఠూరంగా తమ్ముడితో అని, కూతుర్ని చూచి "పోనీలేవే అమ్మడూ! వాదంత పట్టు పడుతున్నప్పుడు వాడితో వెళ్ళడమే మంచిది. మళ్ళీ పది పదిహేను రోజుల్లో అన్నయ్యా వచ్చి చూస్తాడులే తల్లీ! దిగులుపడకు" అంటూ గుడ్లనీరు కక్కుకుంటూ గుమ్మాన్నానుకుని నుంచున్న అమ్మడుని అక్కున చేర్చుకుంది.

తన పంతం నెగ్గించన్న సంతోషంతో రాధాకృష్ణ పెట్టీ బెడ్డింగూ పట్టుకుని బండీవైపు నడిచాడు.

తల్లి వెళ్ళమని సంజ్ఞచేయగా యిక విధిలేదన్నట్టు అమ్మడు పంజరంలోకి పోయే పిట్టలాగా భర్తననుసరించింది. అప్పటికే బండీలో కూర్చున్న రాధాకృష్ణ పిల్లిలాగా వస్తున్న భార్యనుచూచి "తొందరగా! అవతల బండి టైం అయిపోతూంటే" అంటూ హుంకరించాడు అతని హుంకరింపులకు అదరిపోయిన అమ్మడు గుడ్లనీరు కక్కుకుంటూ తల్లి కేసిచూచింది. కను కొలకుల్లోకి వస్తున్న కన్నీటిని బలవంతముగా ఆపుకుంటూ రెండు పెదిమలు బిగపట్టటంచేత మాటరాకుండా వున్న శాంతమ్మగారు "తప్పు" అన్నట్టు ముక్కుమీద వేలు పెట్టుకుంది. మారుమాటాడకుండా అమ్మడు బండెక్కింది. "వెళ్ళివస్తానమ్మా" అమ్మడు బరువుగా అన్నమాటలు బండిరొదలో కలిసిపోయాయి.

బండి సాగింది పది గజాలు, ఇరవై గజాలు, చివరకు సందు మలుపు తిరిగిపోయింది. నిశ్చేష్టురాలై నిలబడిపోయిన శాంతమ్మగారికి యిరవై అయిదు సంవత్సరాల క్రిందట తన్ను అత్తారింటికి పంపేటప్పుడు తన తల్లి పడ్డ అవస్థ బోధపడింది. అప్పుడు తనకుకూడా అమ్మడిలాగే పట్టరానంత దుఃఖం వచ్చింది. అయితే బండి బయలుదేరగానే భర్త చెప్పిన అనునయ వాక్యాలవల్ల కొంత వుపశాంతి కలిగింది. అప్పటినుంచి యెప్పుడైనా ఏమైనా కాస్త ఘర్షణ తప్పితే తనూ తన భర్త ఏవిషయంలోనూ పోట్లాడుకుని యెరుగరు. సరే తను కాపరానికి రాగానే అకస్మాత్తుగా జబ్బుచేసి తన తల్లిపోయింది. అదే విచారంతో ఆర్నెల్లయినా తిరక్కుండా తండ్రిపోయాడు. అప్పటికి ఏడాదికూడా సరిగ్గా నిండని యీ తమ్ముని భారమంతా మీదవేసుకుని తల్లిలేని కొరతలేకుండా పెంచింది. తన గారాబంవల్ల రాధాకృష్ణ బొత్తిగా పెంకివాడుగా తయారయ్యాడు. కాస్త పెద్దయితే అదే పోతుందిలే అని సర్దుకుపోయింది. పెద్దవాడయినప్పటికీ పెంకితనం ఎక్కువయిందిగాని ఎంతమాత్రం తగ్గలేదు. అప్పటికీ వాడిమీదవుండే పెంచిన మమకారంకొద్దీ ఒక్కగా ఒక్కకూతురయిన అమ్మణ్ణి— అతిగారాబంగా పెంచుతున్న అమ్మణ్ణి— వాడిచేతుల్లో పెట్టింది. ఆఖరికి ఆయనబ్రతికుండగా వాడికిమాత్రం "నాబంగారాన్నివ్వను" అంటూండే మాటలుకూడా లెక్కచెయ్యలేదు. సరే! వివాహం చేసింది. దేశంకాని దేశంలో—భాష తెలియని బస్తీలో వుద్యోగం సంపాదించాడు. తనకు కలుపులేదని తన భార్యనుకూడా తనతో అప్పుడే పంపెయ్యమని పట్టుపట్టి కూర్చున్నాడు. తను చెప్పి చూచింది. కొడుకుచేత చెప్పించింది. కానిరాతి హృదయం కరగలా. "వీల్లేదంటే వీల్లే" దన్నాడు. పోనీ ఆయనమాటైనా విని అమ్మడికి పరాయి సంబంధం చేసినా బాగుండేది. ఏదో తమ్ముడు, తను చిన్నప్పటినుంచి పెంచి పెద్దచేసింది. తన కూతుర్ని కూడా అతగాడికే యిస్తే, తన పిల్ల తన యింట్లోనే వుంటుందని పిచ్చి అభిప్రాయం పడింది. కాని ఈ తమ్ముడు యింత కొరకరాని కొయ్యవుతాడని పాపం ఆ పిచ్చి యిల్లాలు ఊహించలా. ఒక్కసారి వెనక్కు తిరిగి యింటిని చూచింది. అంతా ఎక్కడ చూచినా బావురు మన్నట్టుంది. అది చూడగానే శాంతమ్మగారికి దుఃఖం ఆగలేదు. ఒక్కసారిగా బావురుమంది. కాస్సేప

టికి తన్ను తనే పూరడించుకుని సావిట్లో వున్న వెంకటేశ్వరస్వామి ఫోటో దగ్గర నిలబడి భక్తి పురస్స రంగా చేతులుజోడించి "ఓ ఏడుకొండలవాడా! వెంకట రమణా! ఎక్కడున్నా ఆ పసికందు లిద్దర్నీ కాపాడే భారం నీదే" అని నమస్కారం పెట్టింది.

• • •

కాలగర్భంలో నాలుగు మాసాలు గడిచిపోయాయి. ఈ నాలుగు నెలలకి అమ్మడి దగ్గరనుంచి ఒక్క వుత్తరం మాత్రం—అదికూడా తాము కులాసాగా చేరినట్లువ్రాసింది. అంతే. మళ్ళీ వుత్తరాలు లేవు. ఆ తల్లిప్రాణం తల్లడిల్లి పోయింది. వుండబట్టలేక కొడుకుతో "పోనీరా రాముడూ మావయ్యా వుత్తరం రాయకపోయినా ఒకసారి వెళ్ళి చెల్లాయిని చూచిరా" అంది. తల్లిబాధ గ్రహించిన రాముడు అతి జాలిగా "ఇప్పుడెట్లాగమ్మా! కాలేజీకి శలవులు యివ్వగానే నువ్వూ నేనూ యిద్దరం కలిసి వెడదాము" అన్నాడు.

ఇంకో రెండు మాసాలు గడిచిపోయాయి. అకస్మా త్తుగా ఒకరోజు ఎర్ర సైకిలు యింటిముందు ఆగింది. ఆసైకిలు చూడగానే శాంతమ్మగారికి దడ బయలుదేరింది. రాముడు వణికే చేతులతో కవరు చించాడు. "అమ్మడు— సీరియస్- స్టార్ట్ ఇమిడియెట్లీ— రాధాకృష్ణ" అతి దీనంగా తల్లినిచూచి రాముడు "అమ్మా! ఈపూట బండికే బయలుదేరుదాం. అమ్మడుకేదో సుస్తీగా వుందిట." అన్నాడు. మరోగంటకల్లా యిద్దరూ రైల్లో పడ్డారు.

• • •

మంచంమీద శల్యావశిష్టంగా పడివున్న అమ్మడ్ని చూడగానే శాంతమ్మగారు తన కళ్ళని తానే నమ్మలేక పోయింది. వచ్చే ప్రాణం, పోయేప్రాణం. ఆదశలో వున్న కూతుర్ని చూచి బావురుమంటూ ఒక అంగలో మంచంమీద వాలిపోయింది. అంతవరకూ మంచానికి కొంచెం దూరంతో తల పట్టుకు కూర్చున్న రాధాకృష్ణ వీళ్ళను చూచి గదిలోకి పోయాడు. తల్లినీ, సోదరుణ్ణీ చూడగానే ఆ ఆరిపోయే జ్యోతిలో కాంతి వచ్చింది. పాలిపోయిన ఆ పెదిమల్లోంచి జీవంలేని నవ్వు బయట పడ్డది. అతి ఆయాసంతో తల్లినిచూచి "అమ్మా! నా కోసం విచారించవద్దు. ఈమాత్రం అయినా మిమ్మల్ని చూడగలిగినందుకు సంతోషించు నేను నీతో ఎక్కువ మాట్లాడలేను. నా పెట్టి తెరిచి చూడు. అందులో ఒక వుత్తరం వుంది. అది చదువుకో. అన్ని సంగతులు నీకే తెలుస్తాయి. ఇక మాట్లాడలేను అమ్మా!" అంటూ కళ్ళు మూసింది అమ్మడు. అంతే. అనంతాకాశంలోంచి ఒక నక్షత్రం రాలిపోయింది—

కర్మకాండయావత్తూ పూర్తయిన తరువాత శాంతమ్మ గారు పెట్టె తెరిచి ఉత్తరం తీసి చదివింది.

నా ప్రియమైన అమ్మా!

నువ్వు ఈ వుత్తరం చదివేటప్పటికి నా భౌతికశరీరం యీ ప్రపంచంలో వుండదు. అయినా నా మనస్సులో వున్న బాధనంతనీ యీ వుత్తరం రూపంలో పొందు పరుస్తున్నాను. జాగ్రత్తగా చదువుకో—

ఆరోజు నిన్ను వదలి వచ్చిన తరువాత యిక్కడికి చేరాము. మామయ్యా ఒక్కమాట కూడా ప్రేమతో మాట్లాడి ఎరుగడు. అలవాటు ప్రకారం "మామయ్యా" అంటే మండిపడేవాడు. ఎంతో ప్రయత్నంమీద అలవాటు మానుకున్నాను. నీకు వుత్తరం వ్రాయడానికి వీలు లేద న్నాడు. నీదగ్గరనుంచి వచ్చే ఉత్తరాలు నాకు చూపించే వాడు కాదు. వీటన్నిటికీ ఎలాగో సహించినా నిన్ను నాన్నని అనవసరమైన మాటలు అంటుంటే పూరుకోలేక పోయేదాన్ని. నువ్వు యితరులకు కట్నం యివ్వవలసి వస్తుందని నన్ను తనకిచ్చి కట్టినట్టు లేకపోతే ఏనాలుగు అయిదు వేలో కట్నం పెట్టి యితరులు తనకు పిల్లనిచ్చి వుండేవారనీ- యిట్లాగే యింకా ఎన్నో అనేవాడు. వుక్రోషంవచ్చి ఏమయినా సమాధానం చెప్పానా- యిక వీపు చిట్లిపోయిందన్నమాట- ఈవరసని యీ ఆరు నెలలనుంచి నేపడ్డ బాధలు ఆ భగవంతుడికే తెలియాలి.

అమ్మా! నా యీకష్టాలకు నిన్నుగాని, మావయ్యాను గానీ ఏమీ అనదలుచుకోలేదు. అయినా ఒకమాట మాత్రం వ్రాయదలుచుకున్నాను. నాకు జబ్బుచేసింతరువాత ఆయన నాకు మందిప్పించటానికి ఎందుకు ప్రయత్నించలేదో నాకర్థం కావటంలేదు— చూడగా వాటి చాటున స్వార్థం ఏదో వుందని మాత్రం అనుమానం తగులుతుంది. ఆఖరిమాట. అమ్మా! యీవిధంగా తల్లి దండ్రుల అవివే కాలవల్ల వారి మనస్సుల్లోవున్న తియ్యని కోరికలు తీరకుండా నావంటి జీవరాసులు రోజుకి ఎన్ని ఈ అనంత విశ్వంలో కలసిపోతున్నాయో. అందులో నేనొక పరమా ణువును. ఇక కలం వణుకుతోంది. వ్రాయలేను. ఇవే నా తుది నమస్కారాలు.

శలవు,

అమ్మడు.

వుత్తరం చదివి "హారి కృతఘ్నుడా!" అంటూ కొయ్యబారిపోయింది శాంతమ్మగారు. ★

అన్నా - చెల్లెలు

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీ నరసింహశాస్త్రి

"బొత్తిగా నామాటే చెవిని పెట్టకుండా పోతున్నావు. ఏమిటే అమ్మాయి యీవేషం. ఎవరైనా చూస్తే యేమను కుంటారు" లోపలికి వస్తున్న వసంతనుచూసి, శాంతమ్మ అంటోంది.

"ఎప్పటి కప్పుడు యెవరో అనుకుని పోతారేమో అనే ఆదుర్దాయే తప్ప, నువ్వేమి అనుకుంటున్నావో చెప్ప వేమే...."వసంతనవ్వుతూ, తల్లి మొహంలోకి చూసింది.

"నీకీ మాత్రం తెలియద్దుటే యీడొచ్చిన పిల్లవి....

"నాకేం తెలియాలో నువ్వు చెప్పవే అమ్మ ...."

"నేనేమంటుంటే యేంలాభం? నువ్వు చెయ్యదలచు కున్నదేమిటో చేస్తూనే వుంటేను.... !"

"అదీతప్పులేదమ్మా...."

"నీతో యెందుకొచ్చిన వితండవాదన కాని నీళ్ళు పోసుకో....ఇంత అన్నం తిందుకాని ....ఎక్కడెక్కడ తిరిగి యేమేమి ఆడివచ్చావో...."

"నీకు యేమి మాట్లాడాలో కూడా తెలీదమ్మా. ఏమాట వస్తే, ఆమాట అనేశేస్తావు మంచి అమ్మవి...."

"అవునుకాని అమ్మాయి! నామాటవినవు....అషాఢం వెళ్ళిపోయింది కదా...."

'శ్రావణం వచ్చేసింది...."

"మాటకు మాట సమాధానం చెప్పటం నేర్చుకున్న దానివి, యింతమాత్రం గ్రహించుకోలేవేమంట. నీయీడు పిల్లలందరికి పెళ్ళిళ్ళు అయిపోతున్నాయి. నువ్వు యిట్లాగేవుంటే లోకం యేమను కుంటుంది...."

"నువ్వేమి అనుకుంటున్నావో చెప్పవే అమ్మా నిజంగా..."

"నీకు కూడా పెళ్ళి అయితే బాగుంటుందను కుంటున్నా...." అంతే. అంతకంటే నేను కోరుకునే దేముంది...."

"నేను చెప్పనా నేను అనుకుంటున్న దేమిటో ...."

"ఇంకా సందేహం యెందుకు....చెప్పు...."

"నేను కూడా పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నా..."

"మంచిదానివమ్మ....నేను చెప్పినట్లు చేస్తావు ....ఈ మాటకాస్తాచెప్పటానికి యింతమధన పెట్టావెందుకే ...."

"ఈమాట చెప్పటం యెందుకమ్మ. నేనెపుడైనా పెళ్ళి చేసుకోను అని చెప్పాను కనకనా...."

"ఏమిటోనే, నీ మాటలధోరణి నాకసలు అర్థంకాదు. ఇంతకీ తేల్చి చెప్పేసెయ్యి .... యీ శ్రావణ మాసంలో పెళ్ళికి వప్పుకుంటావా లేదా చెప్పు..."

"అడుగోనే అన్నయ్య వస్తున్నాడు ....నువ్వు కూడా సమయానికి వచ్చావు, అమ్మ ఓ ప్రశ్న అడుగుతోంది.... సమాధానం చెపుతావా...."

"నిన్ను అడుగుతుంటే. నేను సమాధానం చెప్పట మేమిటి. మీ గొడవలు మీరు చూసుకోండి ...." మధు నిర్లక్ష్యంగా గదిలోకి వెళ్ళిపోయాడు.

"ఏమిటే అమ్మాయిమరీను! వాడితోకూడా యెందుకు యీ రభస...."

"రభసేముంది దీంట్లో....ఇంత వరకు యెంతమంది వచ్చి పోతున్నారు. ఏదైనాసమాధానం చెప్పారే. ఇట్లాగే వుంటుంది యేదైనా....అన్నయ్య పెళ్ళిచేసు కున్నతర్వాతే నామాట...."

"అయ్యో! అయ్యో! నీకేమన్నా పిచ్చి పట్టిందా యేమిటి మగవాళ్ళతో పంతు పెట్టు కుంటారుటే, వాడు

స్వతంత్రుడు. వాడు యిష్టం వచ్చినప్పుడు పెళ్ళి చేసుకుంటాడు. అయినా నేను చెపితే వింటాడు కనకనా....” శాంతమ్మ విడ్డూరంగా చూసింది.

“అవున్లే....తల్లివి పెద్దదానివి అని నీమాటవింటుంటే అదినీకు చులకన అయిపోయింది అంతేనా ....” వసంత గబగబా అనేసింది.

“ఏమిటా మాటలు....నా పెద్దరికం నిన్నేం చేసింది నీమంచి కోసమేనా నేను చెప్పేది. పెద్దవాళ్ళ మాటలు. వింటే చెడిపోయిన వాళ్ళని యెవ్వర్నీ చూడలా.” శాంతమ్మ కూడా కొంచెం కోపంగానే అన్నది.

“నీకంత బరువవుతే నాదారి నేను చూసుకుంటాగాని నువ్వు మాత్రం నాకోసం కంటతడి పెట్టక ....నాన్న. గాని, నువ్వుగాని అన్నయ్యను పల్లెత్తుమాట అనటానికి సాహసించలేదు. గాని, నేను యీ చదువుకాస్త పూర్తి చేసుకుని, నాదారిని నేను పోతానంటుంటే, ...నాకోసం మీరు బాధపడకండి ....” వసంత వుక్రోషం పట్టలేకపోయింది.

“నువ్వనటం, వాడుచేస్తున్న పనులన్నింటినిహర్షించి వూరుకుంటున్నా మనుకుంటున్నావా ....” శాంతమ్మ ఎదురు ప్రశ్న వేసింది.

“అయితే నేను నలుగురితో క్లబ్బులో వుంటే మీ బుర్రలు తిరిగిపోతాయెందుకు....” వసంత యింకావుద్రేకంగానే మాట్లాడుతోంది.

“నీసంగతి నాకుతెలీదుటే. ఇరుగు పొరుగు అంటారు. నలుగురు, పెళ్ళికాని పిల్ల అట్లా తిరుగుతూవుంటే యేమనుకుంటారు చెప్పు....”

“ఎప్పటి కప్పుడు నలుగురు యేమనుకుంటారో అనే గోలతప్ప. నీకు తెలుసుగదా నా సంగతి, ఆసంగతే మిటో ఖచ్చితంగా వాళ్ళమొహాన చెప్పేసే ధైర్యంలేదు నీకు. ఒక్కసారి నువ్వుచెపితే, వాత పెట్టినట్లుంటుందే, మళ్ళావాళ్ళనోరెత్తుతారా...అసలు నీకే అనుమానంలే నా మీద.... కన్న తల్లే కూతురి విషయం తెలుసుకోకపోతే. నేను యింకెవ్వరితో మొర పెట్టుకోను .... “వసంత దుఃఖము. ఆపుకోలేకపోయింది.

“అహా... సంగీతం మొదలు పెట్టావు .... ఏమిటా యింతిసేపటి నుంచి లేదనుకుంటున్నా.... పాత పాటేనా ఏదైనా కొత్తది వచ్చిందా...” మధు పకపక నవ్వాడు.

“నవ్వగానే సరికాదు ... నలుగురు యేమను కుంటున్నారోతెలుస్తోందా...”వసంత తీవ్రంగా అన్నదిమధుతో,

“నువ్వు అమ్మతో వాదిస్తూ వుంటావుగా. జ్ఞాపకం రాలేదా....” మధు నవ్వుతూనే వున్నాడు.

“అవును .. నేను అనుకుంటున్నదీ, నలుగురూ అనుకుంటున్నదే....అందువల్లనే అట్లాచెప్పాను....అంత మాత్రం తెలుసుకోలేకపోలే ....” వసంతసేన లేచి నుంచుంది.

“ఏమిటే నీకు తెలిసింది. ఆట్టేవాగక .... నీ గొడవ నువ్వు చూసుకో ...శేఖర్‌కు నాకు పరిచయం లేదనుకుంటున్నావేమొ ...” మధు విసురుగా వాకిట్లోకి వెళ్ళిపోయాడు. శాంతమ్మ ఆశ్చర్యంగా వసంత మొహంలోకి చూసింది

వసంతకు పట్టుదల యింకా యెక్కువయింది. ధైర్యం వచ్చినట్లనిపించింది. మామూలుగా తన గదిలోకి వెళ్ళిపోయింది. శాంతమ్మకు కాళ్ళు చేతులు ఆడటంలేదు. తత్తర బిత్తరగా అటుయిటు తిరుగుతోంది. ఒకటి రెండు సార్లు వసంతగదిదాకా వెళ్ళిమళ్ళీ ధైర్యంచాలక వెనక్కు వెళ్ళి పోయింది.

వీధి తలుపు తీసుకుని, శంకరం ఆదరా బాదరాగా యింట్లోకి వచ్చేశాడు. శాంతమ్మకు గుండెబరువు తగ్గినట్లనిపించింది. గబగబ శంకరం దగ్గరకువచ్చి, విన్నారా అని మొదలుపెట్ట పోతోంది శాంతమ్మ.

“వింటావుగాని....రామనాధంగారి అబ్బాయి యివ్వాళ సాయంత్రమే మన అమ్మాయిని చూడటానికి వస్తాడు. ఏర్పాట్లన్నీ చెయ్యాలి ఇంట్లోచూసి యేంకావాలో చెప్పు తొందరగా....” శంకరానికి యింట్లోకాలు నిలవటం లేదు.

“అన్నట్టు అమ్మాయి యెక్కడ....” శంకరం మళ్ళీ అడిగాడు

“అదిగో....ఆ గదిలోవుంది....” శాంతమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

శంకరం, వుత్తరీయాన్ని, చిలక్కొయ్యకు తగిలించి చొక్కా విప్పుకుంటూ. మెల్లిగా గది దగ్గరకు వెళ్ళాడు. “అమ్మాయి” అంటూ గట్టిగా పిలిచాడు శంకరం.

“ఎవరూ ....” అంటూ సన్నగా వసంత గొంతుక వినిపించింది.

“ఇప్పుడేం నిద్రే ...” శంకరం వసంత వైపుకు చూస్తూ అన్నాడు.

“ఏమిటో. పడుకుంటే నిద్రపట్టినట్లుంది ...” కళ్ళు నులుపుకుంటూ సావిట్లోకి వచ్చేసింది వసంత.

శంకరం తడబడు తున్నాడు వసంతతో. సాయంత్రం వాళ్ళు వస్తారని చెప్పటానికి. కాసేపు ఆగినట్లు ఆగి, "అమ్మాయి....నీకోసారి అదివరకు చెప్పినట్లున్నాను.... ఆ....ఏంలేదు శేషగిరిరావని, రామనాధంగారి అబ్బాయి. మంచి అస్తుంది. చదువు ఓమాదిరి అయినా యీరోజుల్లో చదువుకున్న వాళ్ళకి యేమాత్రం వుద్యోగం వస్తోందిలే ఆయన యీ సాయంత్రమే యిక్కడికి వస్తాడుట.... లాంఛనంగా పిల్లా, పిల్లాడు, ఒకర్నొకరు చూసుకోవాలిగా. అందుకని...." నీళ్ళునములుతూ శంకరం యెంతో ఆదుర్దాగా వసంతవైపుకు చూస్తూ నిలబడ్డాడు.

"అట్లాగే నాన్న ...."

శంకరం వుక్కిరిబిక్కిరి ఆయిపోయాడు. ఇట్లాసమాధానం వస్తుందని శంకరం వూహించలేదు. శంకరం యేమిమాట్లాడటానికి పాలుపోవటం లేదు. కొంచెం కంగారుగా అటు యిటు తిరిగి దొడ్లోకి వెళ్ళాడు.

"విన్నావా...." శంకరం చెప్పబోతున్నాడు. "వింటానుగానీండి....ఇదిగో చీటి యీ వస్తువులన్నీ తీసుకురండి యెక్కువ వ్యవధిలేదు...." శాంతమ్మ చీటి అందిచ్చింది.

శంకరం తెచ్చిన వస్తువులతో కావలసినవన్నీ తయారయి పోయినాయి.

"అమ్మాయితో చెప్పాను. అట్లాగే నాన్న ..." అన్నది. అని మెల్లిగా శంకరం శాంతమ్మతో సంతోషంగా చెప్పాడు.

"అనకేం చేస్తుంది ..." ఎంతో తేలికగా అనేసింది శాంతమ్మ.

వాకిట్లో గుర్రపుబండీ ఆగింది. మధు ముందరదిగాడు ఎదురుగా శంకరం. చెంబునీళ్ళు తీసుకు వెళ్ళాడు.

"ఏయ్....వసంతా....నిన్నే....బావ వచ్చాడు".మధు. వసంత దగ్గరకు వెళ్ళి, చెవులో అన్నాడు.

వసంతకు చర్రున కోపం వచ్చింది. ఆ పట్టున మధు చెంప పగిలిపోయేదే. ఎందుకనో పస్తాయించింది.

ఇంకా వులిడికించటానికి యేవేవో అనేస్తున్నాడు మధు. వసంత సహించి వూరుకుంటోంది.

"శేఖర్‌కు నాసానుభూతి...."అంటూ మధు లోపలికి వెళ్ళిపోయాడు.

వసంతకు పట్టరాని దుఃఖము వచ్చేసింది కాని ఆ సమయంలో యేమీ ఆనేటట్లు కనిపించ లేదు.

సావిట్లోకి అంతా వచ్చేశారు. శేషగిరిరావు, రామనాథం. శారదమ్మ ఒక లైనులో కూర్చున్నారు. శాంతమ్మ వసంత, యింకొంచెం దూరంగాకూర్చున్నారు. వసంతకు యెదురుగా మధుకూర్చున్నాడు. శంకరాన్నికూడా కూర్చోమని అంటున్నారు.

"శేషు....అటువైపుకు తిరుగు .... మావాడికి మహా సిగ్గండి....ఆడపిల్లకంటె ... యెక్కువ ...." శారదమ్మ నవ్వుతూ అన్నది.

శంకరం నవ్వాలనుకుని నవ్వాడు. మధు నవ్వాలని నవ్వాడు. శాంతమ్మ నవ్వకూడదేమో అనుకుంటూనే ఆపుకోలేక పోయింది. శారదమ్మ యేమనుకుని పోతుందో అని రామనాథం నవ్వాడు. శేషు, వసంతను నవ్వించాలని నవ్వాడు. అంతమందిలో తాను యింకో విధంగా వుండటానికి వీల్లేక వసంతా నవ్వింది.

"అమ్మాయి సంగీతం యేమన్నా పాడుతుందా ...." సాగదీసుకుంటూ శారదమ్మ అన్నది.

"మొదట్లో సంగీతం బాగానే చెప్పించాం.... అయితే యీ కాలేజీచదువులకు దానికీకుదరక ఆపేసింది. ఆయినా పదిపదిహేను కీర్తనలు నేర్చుకుందిలెండి ....అమ్మాయి" వసంత వైపుకు చూసి పాడమంది శాంతమ్మ.

వసంత ముభావంగా వూరుకుంది. కాని శాంతమ్మ రెండు మూడుసార్లు హెచ్చరిస్తోంది.

"ఏమిటి అమ్మాయి మరీ అంతపెంకెతనమా మీఅమ్మ అన్నిసార్లు చెపుతుంటే. ఓ పాటపాడరాదు...." శారదమ్మ అత్తగారి పెత్తనం చెలాయిద్దా మనుకుంది.

"నాకు డాన్సు కూడా వచ్చు ఆడమంటారా ...." అంటూ చివాలునలేచి నుంచుంది వసంత.

శేషు నిర్ఘాంత పోయాడు. శంకరం గుండె ఝల్లుమన్నది. శారదమ్మ నివ్వెరపోయింది. రామనాథం భయపడి పోతున్నాడు. శాంతమ్మకు యేమనాలో తోచటంలేదు

"అట్లాగే చెయ్యి. నలుగురూ చూసి సంతోషిస్తారు" మధు తీవ్రంగా లేచి వాకిట్లోకి వెళ్ళి పోయాడు.

ఎక్కడి వాళ్ళు అక్కడికి గుట్టుచప్పుడు కాకుండా వెళ్ళి పోయారు.

"అమ్మాయి నువ్వేదో మనవంశ గౌరవాన్ని నిలబెడతావని, మేంచెప్పిన మాటవింటావని యెంతో ఆశపడ్డాం. నలుగుర్లో మమ్మల్ని నగుబాట్లు చేస్తావని మేము

యెప్పుడూ అనుకోనేలేదు...." శంకరం యెంతో బాధ పడుతూ అన్నాడు.

"ఇంక మనం తలెత్తుకు తిరగ గలమా! ఇన్నాళ్ళ నుంచి యెంతో గుంభనగా పట్టుకు వస్తున్న మన గౌరవ మర్యాదలు కాస్త మంటకలిసినాయి...."శాంతమ్మ కూడా యెంతో క్రోధంగా అన్నది.

"విషయాలు తెలుసుకోక పోవటం వలన, లేని గౌర వాలు వున్నాయను కోవటంవలన, మనవంశ మర్యాదలు దెబ్బతింటున్నాయిగాని, నిజం చెప్పటం వలన మనగౌర వానికి యెప్పుడూ దెబ్బకాదు..."

"మాకు తెలియని విషయాలు, నువ్వు తెలుసుకున్న విషయాలు యేమిటో చెప్పు...." మధు అందుకున్నాడు.

"ఇంట్లో ఆడపిల్లని ఏవగింపుగాను, అనుమానంగాను చూడటం, మగవాడు యేంచేస్తున్నా హర్షించి వూరుకుం టూ. మన గౌరవమంతా నాశనం అయి పోతోందనీ నా మీద పడి యేడవటం....ఇంతకంటె విడదీసి చెప్పాలా" వసంత రౌద్రంగా మధు వైపుకు చూసింది.

మధు కొంచెం ముందుకు తూగాడు.

శంకరం మధును విసురుగా నెట్టేశాడు.

'నాన్నా.... మీమనస్సుకు కష్టంగా వుంటే, యీ క్షణంలో నన్ను యేది చెయ్యమన్నా అది చేస్తాను. నేను పెళ్ళిచేసుకోకపోవడం వలన మన వంశానికి కళంకం వస్తుందని అనుకోకండి. నేను మీయింట్లో వుండేది చాలా కొద్దిరోజులే. తర్వాత నేను యెన్నడూ చూడని ఒక వ్యక్తిని భర్తగా స్వీకరించి మీకు యెంతో దూరంలో వుండిపోతాను. ఫలానావారి అమ్మాయి అని మీకు యెంతోగౌరవాన్ని, సంతోషాన్నియిస్తాను. నన్నుగురించి మీరు బాధపడకండి. మిమల్ని అంటిపెట్టుకు వుంటూ మీసేవ చేస్తూ దగ్గరవుండే కొడుకు విషయం ఆలోచించు కోండి. అన్నయ్య గౌరవం, మీ గౌరవం, మీ వంశ గౌరవం....నలుగురు ఏమనుకుంటున్నారో కాస్తవినండి. మా అన్నయ్య అంటే నాకువుండే బాధకంటె, మీ కొడుకు అంటే మీకువుండే మానసికబాధ యేమిటో నాకు తెలుసు....అన్నయ్యా! మనవంశ గౌరవం నిలబెట్టు. నువ్వు పెళ్ళిచేసుకో...కళంకం తెచ్చిపెట్టక...."

శాంతమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వసంత జుట్టు నిమురుతోంది. శంకరం శరీరం గజగజ వణికిపోతోంది.

మధు మధనపడిపోతున్నాడు. ఒళ్ళంతా కంపరం యెత్తిపోతోంది. తనచెల్లెలికి తన విషయం పూర్తిగా తెలిసిందని భయపడిపోతున్నాడు. మధుకు ఆలోచన పాలుపోవడంలేదు. బింకంగా ఇన్నాళ్ళనుంచి నెట్టుకు వస్తున్నాడు. ఈనాటితో ఇంట్లో వాళ్ళకికూడా తెలిసిపో యింది. పోనీ పెళ్ళిచేసుకోవటానికి యిష్టంగావున్నట్లు తల్లిదండ్రులకు చెపుదామా అంటే, ఇన్నాళ్ళనుంచి పెళ్ళి చేసుకోను అంటూవచ్చి, గభాలున పెళ్ళికి యిష్టపడ్డట్లు చెపితే యేవిధంగా అనుమానిస్తారో అనే భయం. వసంతకు తన అభిప్రాయాన్ని యేదోవిధంగా తెలియ చేద్దామాఅంటే, ధైర్యం చాలటంలేదు, వసంత చెప్పింది అక్షరాలా నిజమని తనమనస్సుకుతోస్తోంది. అనవసరంగా వసంత మనస్సు బాధపెట్టానే అని పశ్చాత్తాప పడు తున్నాడు. కంగారుగాఒక్కసారి లేచినించున్నాడు మధు.

ఇంతలో యిద్దరు హఠాత్తుగా యింట్లోకి వచ్చేశారు. మధు ఆశ్చర్యంగావాళ్ళవంక చూస్తున్నాడు.

"శంకరంగారు....మీరు మాత్రం ఆడపిల్లలు కనలేదు టండీ, మీకు మాత్రం వంశగౌరవాలు లేవుటండీ, మమ్మల్ని యీవిధంగా అవమానిస్తారా ... యీనాడు యీపిల్ల యెక్కడికిపోతుంది మీరుచెప్పండి...."యాజులు కంఠంలో గీర వచ్చేసింది.

"ఎందుకు అంత ఆవేశపడతారు? మా అన్నయ్య మీ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటాడుగా...." వసంత మధు ముఖంలోకి తీవ్రంగా చూసింది.

మధువంక, శంకరం కొరకొర చూశాడు.

"ఈ అమ్మాయినా.... మనమధు ...." శాంతమ్మ మధ్యలోనే ఆపెయ్యాలసి వచ్చింది.


"మనం తెచ్చిపెట్టుకున్న వంశగౌరవాలకంటె, ఒక ఆడదాని జీవితం యెన్నోరెట్లు ఎక్కువ. మెత్తగావుంటే అధోగతి పాలుచేద్దామని, ఆడపిల్లల్ని అన్యాయం చెయ్య కండి...."వసంత వుద్రేకంలో యింకా అంటోంది.

శంకరం మారు మాటాడకుండా అట్లాగేచూస్తూ నిలబడిపోయాడు.

"అమ్మాయి ...మా అమ్మాయి జీవితం నిలబెట్టా వమ్మా...." వణుక్కుంటూ యాజులు వసంత దగ్గరగా వచ్చాడు.

"వసంతా నీ మనస్సు కనుక్కోలేక పోయాను.... నిన్ను ఏవేమిటో అంటూవచ్చాను....నిన్ను చాలా బాధ పెట్టాను. నీకు అన్నగా వుండటానికి నేను తగినవాణ్ణి కాదు" అంటూ వసంత రెండు చేతులూ గట్టిగా పట్టు కున్నాడు మధు.

"ఎంతైనా నేను నీకు చెల్లెల్నే అన్నయ్యా" కళ్ళనీళ్లు ఆపుకుంటూ ఎంతో నిబ్బరంగా అన్నది వసంత. ★



శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్‌గారు ఆంధ్ర మహిళా సభ సంయుక్త కార్యదర్శి పదవినుండి విరమించు సందర్భ
మున ఆంధ్ర మహిళా ప్రెస్ పరివారము వారి గౌరవార్థం ఏప్రిల్ 27 వ తేదీన ఇచ్చిన
తేనీటి విందు సమయమున వీడ్కోలు పత్రమును సమర్పించుట.



..........ఇది నా రాజీనామాగా పరిగణించి నన్ను ఏప్రిల్ 1 వ తేదీనుంచి సంయుక్త కార్యదర్శిని పదవినుంచి విడుదల చేయవలసినదిగా కోరుచున్నాను.

మీరూ, కార్యనిర్వాహక వర్గమూ, ఇతర ఉద్యోగులూ నాకు ఎంతో సహృదయంతో సహకరించారు. ఈ కొలది సంవత్సరాలలోనూ మీతో కలిసి ఈ సంస్థలోని బాధ్యతాయుతమైన కార్యములను నిర్వహించుట ఎంతో ఆనందదాయకముగానున్నది. ఇవి ఎన్నడు నాహృదయంలో సంతోషంగా మెరుస్తూనే ఉంటాయి.

—కె. లక్ష్మీరఘురామ్.

"...............ఆంధ్ర మహిళా సభకు సంయుక్త కార్యదర్శినిగా అమోఘముగా పనిచేసి ఇప్పుడు మీరు ఆ పదవిని విరమించుచున్నందులకు నాకు చాలా కష్టముగానున్నది. ఆంధ్ర మహిళా సభకు సంయుక్త కార్యదర్శినిగానూ, 'ఆంధ్రమహిళ'కు సంపాదకురాలుగాను చేసిన మీ అమూల్యమైన కృషి ఆంధ్ర మహిళా సభ కార్యకలాపముల విలువలను ఉత్తేజపరచినవి.

మహిళా ఉద్యమమునందు ఆసక్తిగల అందరి ప్రశంసలకు పాత్రమౌనట్లు ఉత్తమ ప్రమాణముగల పత్రికగా 'ఆంధ్రమహిళ'కు కీర్తి సంపాదించారు. మీ కృషిఫలితముగా రెండు వార్షిక సంచికలు అత్యంతాకర్షణీయంగానూ అత్యుపయోగకరముగానూ వెలువడినవి. ఇప్పుడు మద్రాసు విడిచి ఢిల్లీకి వచ్చే కారణంచేత విరమించుచు ఏప్రిల్ 15 వ తేదీనుంచి విడుదలచేయమని కోరుటచేత ఇక నాకు వేరే విధములేక మీ కోరిక అనుమతించవలసిందని కార్యనిర్వాహక వర్గమునకు సలహా ఇచ్చుచున్నారు.

ఈ ఒకటిన్నర దశాబ్దములనుండి - ముఖ్యంగా గత మూడు నాలుగు సంవత్సరములలోనూ - మీరు ఎంత ఉత్సాహముతోపనిచేయుచున్నారో ఆ విధముగానే ఏపదవిలోనైనను, ఎక్కడ ఉన్ననూ, అంతటి ఉత్సాహముతోనూ కృషిచెయ్యగలరని నా దృఢ విశ్వాసము. అందుచేత అత్యంత శ్రద్ధాసక్తులతో మీరు నిర్వహించు కార్యములనుండి మిమ్ములను విడిచిపెట్టుటకు ఎంతో విచారించుచూ తప్పనిసరిగా ఆమోదించవలసివచ్చినది.

మీ కార్యములయందు విజయాభివృద్ధులుకలుగవలెనని కోరుచున్నాను. మీ వలన ఆంధ్ర మహిళా సభ కోల్పోయిన మీ సహకారము ఢిల్లీలోని ఆంధ్ర సంస్థలకున్ను, ఢిల్లీకిన్నీ లభించగలవని ఆశిస్తున్నాను."

—దుర్గాబాయి దేశ్ ముఖ్.

ఆంధ్ర మహిళా సభ సంయుక్త కార్యదర్శిని

శ్రీమతి కొత్త లక్ష్మీరఘురామ్‌గారికి

ఆంధ్ర మహిళా ప్రెస్ పరివారము సమర్పించు

వీడ్కోలు పత్రము

అమ్మా :

అరమరికలులేని మీ అనన్య ప్రేమానురాగాలతో ఇంతకాలమూ మమ్ములను ఆదరించిన మీ అభిమానానికి మా కృతజ్ఞతాపూర్వక వందనములు.

మన ప్రెస్ మీ అధ్వర్యంలో, మీ నిరంతర కృషివలన రూపురేఖలు దిద్దుకొని నూతన అలంకారములు గావించుకొని, సంపన్నమై మాకు స్థిరత్వమేర్పరచుటయే గాక మద్రాసు నగరమందలి ఉత్తమ ముద్రణ సంస్థలలో ఒకటిగా పేరెన్నికగన్నది. దీనికి ముఖ్యంగా మీరు మాకిచ్చిన ప్రోత్సాహ ప్రోద్బలాలే కారణం.

ఉన్నతవిద్యకు, విజ్ఞానమునకుతోడు సంప్రదాయ సంస్కృతులను మేళవించి తీయని పలుకులతో, మందహాసముతో, పనులుగొను మీ ప్రతిభా విశేషమునకు మా జోహారులు.

మీ మొగలిపొట్లములోని చురుకుదనము, పరిమళము, రక్తిమలను మనలోమనమాటలతో, దారీతెన్నూ లేని లోకంపోకడగా, సింగినాదముగా పరిణమింపజేయు మీ రచనా చమత్కృతి ఆంధ్రనారికి మార్గదర్శకము.


శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గారు పవిత్రాశయంతో స్థాపించిన యీ సంస్థను ఫలవంతముచేసి వారి ఉన్నతాశయసిద్ధికి మీరు ఎనలేని సహాయంచేశారు.

సర్వతోముఖప్రజ్ఞ కలిగిన మీ అధ్వర్యంలో పనిచేసే సదవకాశం లభించటం నిజంగా మా అదృష్టం. ఈనాడు మీరు మమ్ములను తాత్కాలికంగా వదలి వెళ్ళినా తిరిగి త్వరలోనే మీ అధ్వర్యంలో పనిచేసే భాగ్యం లభించగలదని ఆశిస్తున్నాం.

సర్వశక్తివంతుడైన భగవంతుడు మీకు సర్వదా ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధులు కలుగచేయాలని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాం.

మద్రాసు
27-4-1957

ఇట్లు
ఆంధ్ర మహిళాముద్రణాలయ పరివారము.



ఆంధ్ర మహిళా ముద్రణాలయమునకు శ్రీ దేశ్‌ముఖ్ దంపతులు విచ్చేసినప్పుడు తీసిన ఫొటో. ఇందు ఆంధ్ర మహిళాసభ
సంయుక్త కార్యదర్శినులు, శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, శ్రీ చింతామణి దేశ్‌ముఖ్, శ్రీమతి చెన్నమంబమ్మ.
ముద్రణాలయ పరివారమూ కలరు.



రాజకీయాలు

శ్రీమతి కె. రామలక్ష్మీ ఆరుద్ర

నూటికి తొంభైమంది వ్యవసాయి దారులుగా వున్న మన దేశంలో ఎంత సంస్కరించినా యింకా సంస్కరణని కోరేది భూసమస్యగా వుండడం వింతే. అయితే అది అక్షరాల నిజం. కౌలుదారీ గొడవలసంగతి అటుంచి అసలుభూమే ఒక సమస్యగావుంది. పండించే విధానాలలో బాగోగులు పరిశీలించటానికి కమిటీలు రిసెర్చి కేంద్రాలూ కావలసి వస్తున్నాయి. పంట పరిమితిని హెచ్చించడానికి ఎరువులేంవేస్తే మంచివన్న రిసెర్చీలు సాగిస్తూనేవున్నారు. దున్నే పరికరాలలో దరిదాపు విప్లవాత్మకం అయిన మార్పులే వచ్చేస్తాయి. ఇన్నిజరిగినా బక్కరైతులు బాగుపడ్డమూలేదు. ధనిక భూస్వాములు చిక్కిపోవడమూ లేదు. బక్కరైతు ఎంత కష్టపడి పండిస్తే సొంతదారునికి అంత లాభం. "అంబటేరు వచ్చింది అత్తగారు అంటే కొలబుర్ర నాచేత వుంది కోడలా" అన్నట్లు వుంది. రైతు కెంత పండించినా ఫలితాలు పెత్తందార్ల చేతుల్లోనే వుంటాయి.

భూ సమస్య ప్రాముఖ్యం తెలుసుకునే రాజకీయపెత్తనం దార్లు కూడా ఎన్నికల సమయంలో యీ సమస్యా పరిష్కారమే తమ ధ్యేయం అన్నట్లు మాట్లాడుతారు. అలాగే కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలుకూడా యీ సమస్యా పరిష్కారానికి పూనుకోవడం ఆనవాయితీ.

కేరళ ప్రభుత్వం యీ విషయంలో ఒక నిర్ణీతమైన పథకాన్ని తయారుచేసి శీఘ్రకాలంలోనే అమలులోకి తేవడానికి ప్రయత్నించడంలో వింతలేదు. అసలు కమ్యూనిస్టుల ముఖ్య జీవనాధార సమస్యే కాదు యీ సమస్య !

భూదానోద్యమ కర్త భావే యీ సమయంలో కేరళలో ప్రవేసించడం సమయానుకూలంగావుంది. కమ్యూనిస్టులు కౌలుదారీ పద్ధతులకీ, భూదానోద్యమ లక్ష్యాలకీ న్యాయంగా చాలా దగ్గిర పోలికలుండాలి కదా, యిద్దరి లక్ష్యం: భూమిలేని వాళ్ళకి భూమి యివ్వడం. అయినా "మీరు వ్యక్తిని గుర్తుంచుకోరు" అంటూ కోప్పడ్డారు భావేగారు. నిజమేకదా ! వ్యక్తిగతయాజమాన్యంకాక సమిష్టియాజమాన్యం కమ్యూనిస్టులు కోరేది. మొత్తానికి భావేగారికి తగినంత ప్రోత్సాహం కేరళలో లభించకపోదు.

కేరళ ప్రభుత్వం, అప్పుడే ప్రభుత్వపు "పోరంబోకు" భూము లెక్కడెక్కడ ఎన్నెన్ని ఉన్నాయో అంచనా వేయించి, ప్రభుత్వాని కవసరం వున్న వాటిని తప్పించి మిగతా వాటిని భూములులేని రైతులకి పంచాలని చూస్తూంది.

కొత్తగా అధికారంలోకి వచ్చి అందరి దృష్టినీ ఆకర్షించే పరిస్థితిలో కేరళ కమ్యూనిస్టు ప్రభ్యుత్వం సత్వరితంగా ప్రజోపయోగకరం అయిన కార్యక్రమాలని అమలులో పెట్టవలసిన అవసరంవుంది. వీరి చేతల మీదనే దేశపు కమూనిస్టుల గౌరవం ఆధారపడి వుంది. కేరళ కమ్యూనిస్టులు ప్రజల అభిమానాన్ని చూరగొంటారన్నది నిస్సందేహం. ఎటొచ్చీ, పంథా సవ్యంగా వుండాలి. అప్పుడే కొంతకాలం మనే అవకాశం వుంటుంది.

ఏది ఏమైనా, దేశం మొత్తంమీద ఒక్క కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడ్డంతో కాంగ్రెసు వారికి ఆత్మ శోధనకి అవకాశం చిక్కింది. దేశం మొత్తంమీద చిన్న అలజడి బయలుదేరి, మన లోటేమిటి? మన సంస్థ పటిష్టం కావాలంటే ఏం చెయ్యాలి? అన్న ఆలోచనలు బయలుదేరి క్రియారూపం దాల్చే స్థితికివచ్చాయి.

అటువంటి ఆలోచనల ఫలితాలలో ఒకటి : ప్రదేశ్ కాంగ్రెసు కమిటీల నిర్మాణంలో తలపెట్ట బడిన మార్పు రాష్ట్రానికొక ప్రదేశ్ సంస్థ వుండేవాలు నని కాంగ్రెసు హైకమాండు తుదినిర్ణయంచేసింది. అప్పుడేప్రారంభింపబడిన యీపని వచ్చే అక్టోబరు నాటికి పూర్తికావచ్చు. అప్పటికి అన్ని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీలు పునర్నిర్మింప బడుతాయి.

తెలంగాణా, ఆంధ్ర కమిటీలు ఇప్పుడు ఒకే సంస్థగా రూపందుతాయి. జిల్లాలవారీగా సభ్యులని యీ కమిటిలో

వుండేలా చూడాలని ప్రయత్నం జరుగుతూంది. లెజిస్లేచరు పార్టీకూడా సజావుగా ప్రాతినిధ్యంకల్గి వుండడానికి ముఖ్యమంత్రి మంతనాలు సాగిస్తున్నారు.

సంస్థ పటిష్టతకి యీ విలీనీకరణ ఉపయోగిస్తుంది. పొరిపొచ్చాలు లేకుండా కాంగ్రెసును పరిశుద్ధంచేసి తిరిగి ప్రజానీకంలో నమ్మకని పొందడానికి సహకరిస్తుంది. ఏమైన కాంగ్రెసు తన లోపాలను దిద్దుకొని ప్రజా విశ్వాసాన్ని తిరిగి చూరగొన వలసిన అవసరం ఎంతైనా వుంది.

ప్రపంచం మొత్తంమీద శాంతియుత వాతావరణం గురించిన కబుర్లు తప్పించి శాంతి ఎక్కడ కన్పించడం లేదు. అల్జీరియాలో గొడవలు. జోర్డాన్‌లో గొడవ. సూయజ్ కాల్వ గొడవ. ఒకటేమిటి ఎక్కడ పడితే అక్కడే కల్లోలిత వాతావరణం పొరుగింటి పాకిస్థాన్‌తో సహా!

అల్జీరియాలోని పరిణామాలను గురించి ఫిర్యాదుచేస్తూ మిత్రరాజ్య సమితిలోని ఆఫ్రేషియన్ రాజ్యకూట సమితి సెక్రటరీ ఒక సందేశం పంపింది. అల్జీరియాపై జనరల్ అసంబ్లీ ఆమోదించిన తీర్మానాలు నెరవేర్చడానికి సర్వ విధాలా ప్రయత్నం జరగాలనీ. అదిజరక్కపోతే విషమ పరిస్థితి ఏర్పడ వచ్చుననీ యీ సందేశ పాఠం ఈ సందేశంపై ఇండియా. ఇండొనీసియా. పర్షియా. ఇరాన్. జోర్డాన్ మురాకో, మొదలైన పథ్నాల్గు దేశాలు సంతకం చేశాయి.

జోర్డాన్‌లో కల్లోల పరిస్థితి తరువాత మిశ్రమ మంత్రి వర్గం స్థాపింప బడింది. యిలా కొత్త మంత్రివర్గం ఏర్పడిన తరుశాత జోర్డాన్‌లో ప్రశాంత పరిస్థితి ఏర్పడినట్లు ప్రకటింప బడింది. జోర్డాన్ రాజు హుస్సేన్ ప్రజలను సంబోధిస్తూ; దేశ విద్రోహకశక్తులకు లోబడరాదని హెచ్చరించారు. తమ రాజ్యాన్ని పరిత్యజించినట్లుయితే ప్రజలకి లాభం అంటే తాను తప్పక అలాచేస్తా నన్నారు. మొత్తానికి జోర్డాన్‌లో ప్రశాంతం ఏర్పడినట్లే. రాజు కెదురు తిరిగి తిరుగుబాటు జరిపినందుకు దరిదాపు ముప్ఫయి ఎనిమిది మంది జోర్డాన్ నాయకులని అరెస్టు చేశారు. డెమాస్కస్‌లోని జోర్డాన్ లెగేషను ఒక ప్రకటనచేస్తూ, జోర్డాన్‌లో ప్రశాంత పరిస్థితి ఏర్పడినదనీ, అల్లరులు జరిగాయంటూ వచ్చిన వార్తలు, పుకార్లు అనీ, వాటివల్ల రాజు విధానం మారబోదనీ తెలియ చేసింది.

ఇక సూయజ్ ప్రాంతంలో చిలికి చిలికి గాలివాన అన్నది సూయజ్ కాల్వ విషయంలో నిజం అయింది. ఎంతో సవ్యంగా పరిష్కారం అయిపోయేలా కన్పించిన యీ సమస్య తిరిగి ప్రపంచాన్నే మూడవప్రపంచ యుద్ధానికి సంసిద్ధం చేస్తుందా అనిపించింది. కాని ఆ ప్రమాదకర పరిస్థితి తప్పి, అనేక సమావేశాల ఫలితంగా ఒక ఒప్పందం అనేది జరిగింది. తిరిగి సూయజ్ నౌకలకు తెరువబడింది.

అనధికారంగా సూయజ్ కాల్వని బాయ్‌కాట్ చేసిన పాశ్చాత్య రాజ్యాల వాళ్ళుకూడా తమ నౌకలని కాల్వలోనికి పోనిచ్చారు. సూయజ్ కాల్వ నిర్వహణ విషయంలో సూచనలూ మొదలైనవి చేయడానికి గత అక్టోబరులో శ్రీ వి. కె. కృష్ణమీనన్‌గారు సూచించినట్లు ఒక "కెనాల్ యూసర్సు" సంఘాన్ని స్థాపించడానికి ఈజిప్టు ఒప్పుకొంది. ప్రస్తుతం ఈ "యూసర్సు" రిప్రెజంటేషన్ ఎలా వుండాలో నిర్ణయాలు జరుగుతున్నాయి. ఈజిప్టు మటుకు రాజ్యాల నౌకల సంఖ్యను పట్టికాక, భౌగోళిక స్థితినిపట్టే యీ ప్రతినిధి వర్గం వుండాలని సూచించింది. మొత్తానికి సూయజ్ సమస్య ఉధృతం తగ్గిందని అనుకోవచ్చు.

ఇండియాలోనే కూర్చుని ఏదోవిధంగా నడిపిస్తున్న విదేశం పోర్చుగల్, పోర్చుగీసు పరిపాలన క్రిందనున్న ప్రాంతాలని ఎంత శాంతయుతంగా రాబట్టాలని ఇండియా కోరుతూందో. పోర్చుగల్ అంత అయిష్టతనీ కనబరుస్తోంది. ఈ ప్రభుత్వ పోకడల ఫలితంగా కష్టాలకి గురి అవుతున్నది ప్రజలు. స్వాతంత్ర్య సిద్ధి తరువాత యింత తలనొప్పి కల్గించే పరిస్థితులు భారత ప్రభుత్వానికి ఎదురు పడలేదు. ప్రజల ఉత్సాహం కూడా కాదని పోర్చుగల్ తన నియంతృత్వ పరిపాలనని ఎంతకాలమో సాగించలేదన్న సంగతి తెలుస్తూనేవుంది. ప్రస్తుతం భారత స్థావరాలమీద నుంచి పోయే హక్కు తమ కున్నదంటూ అంతర్జాతీయ న్యాయస్థానంలో పోర్చుగల్ దాఖలుచేసిన ఫిర్యాదులకు యిండియా ప్రభుత్వం సమాధానం యిచ్చిందట. సాధారణంగా యిటువంటి ప్రాథమిక వివరాల విషయాలు యీ కోర్టు ముందుగా బయట పెట్టదు. కనుక ఇండియా సమాధానపు వివరాలు తెలియవు. ఇండియాకూడా మొత్తానికి "వెన్నులేదన్న" తనాన్ని వదలి తీవ్రమైన చర్యలు తీసుకుంటుం దనుకోవచ్చు. పోర్చుగల్ వంటి ముందుచూపు లేని ప్రభుత్వాలతో మెల్లిగానూ, అతి డిప్లొమేటిక్‌గానూ మాట్లాడి లాభం లేదు. కుండ బద్దలు కొట్టినట్టు చెప్పి తన దారి సవ్యం చేసుకోవాలి తప్పించి వేరు మార్గం లేదు. ఎంత త్వరగా యీ పోర్చుగీసు స్థావరాలని స్వాధీనం చేసుకుంటే,

అంత మంచిది. దేశంలో ఉన్న యీ కాస్త 'బానిసత్వ' చిహ్నం కూడా పటాపంచల మవుతుంది.

* * *

హరిజన సంక్షేమ నిధుల వినియోగంపట్ల ప్రభుత్వ లక్ష్యాన్ని వివరిస్తూ శ్రీ సంజీవ రెడ్డిగారు, వీరికై కేటాయించిన సొమ్ము పూర్తిగా వినియోగం చెయ్యాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వంకూడా శ్రద్ధ వహిస్తుందనీ అన్నారు. అస్పృశ్యతా నివారణనిగురించి జరుగుతూన్న విద్వద్గోష్ఠిలో మాట్లాడుతూ సంజీవ రెడ్డిగారు, హరిజన నిధికి రెండు మూడు కోట్లు ప్రత్యేకించడానికి అంగీకరించినా, ఆర్థికమైన యిబ్బందులు అటుంచి వీలైనంత సొమ్ము ప్రభుత్వం వీరికై ప్రత్యేకిస్తుందన్నారు. విద్యావంతులైన హరిజనులు, జీవితంలో ఉన్నస్థాయిలో నున్నవారూ, తమకంటె తక్కువగా వున్నవారిపట్ల శ్రద్ధ వహించకపోవడం అన్యాయం అనీ, చివరకి హరిజనుల లోనే శాఖా సంబంధమైన భేదాలుండడం శోచనీయం అనీ అన్నారు. అస్పృశ్యతా నివారణ అంటూ మనం హరిజనులంటూ తేడా చూపించకూడ దనుకుంటూంటే, హరిజనులలోనే యీ తేడాలు చూపించుకోవడం నిజంగా హాస్యాస్పదం.


హరిజనులకి "సంక్షేమం" అనేది జరగాలంటే రాజకీయాలతో వీరి సమస్యలని ముడిపెట్టడం మానెయ్యాలి. రాజకీయపు టవసరాలకి వీరిని ఎరగా చేసుకుంటున్నది. నిజానికి- హరిజన నాయకులే—వీరినీ వీరి సంక్షేమం కోసం కేటాయించబడ్డ నిధులనీ కూడా రాజకీయాలకి అతీతం చేసిన నాడు- ఏ కొంచెం అయినా యీ హరిజనుల వెనుకబడ్డ తనం పోతుందేమో.

★

అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము

1893 నుంచి లక్షలాది ప్రజలు అమృతాంజనం వాడి, ఎంత అమోఘమైన శక్తి కలదో తెలుసుకుంటున్నారు. అమృతాంజనంలో వాడే ఔషధాలన్నీ అతి శీఘ్రంగా బాధను పశమింప చేయుటయేగాక చాలా హాయిని కూడా కలిగిస్తాయి. హాని కలిగించే పదార్థాలేమీ లేవు కూడా. దగ్గు, జలుబు మొదలైనవి కూడా శీఘ్రంగా ఉపశమిస్తవి. అమృతాంజనం దగ్గర ఉంటే మీ రెటువంటి బాధనైనా జయించవచ్చు:



అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు - 4
బొంబాయి - 1.
కలకత్తా - 7

AL-57-1 TELUGU

రాక్షసులు

"ఉపేంద్ర"

వీధిలో పెద్దగా ఏడుపులు విని సరళ ఉలిక్కిపడి నిద్ర లేచింది. మేడమెట్లవైపు అలికిడైనట్లు వినిపిస్తే అటు చూసింది. చిన్న తమ్ముడు మేడ మీదికి పరుగెత్తుకు వచ్చాడు.

"ఏమిటిరా అది వాసూ!" అంది సరళ ఆదుర్దాగా.

"వదిన బావిలోపడి చచ్చిపోయిందే అక్కా"

"వదిన పోయిందా!" సరళ పెద్దకేక పెట్టింది.

సరళ గుండె గబగబా కొట్టుకొన్నది. తొందరగా మేడమెట్లు దిగి క్రిందికి వెళ్ళింది. అప్పుడే బావిలోనుంచి తీసిన శవాన్ని చాపమీద గుడ్డవేసి పడుకోబెట్టారు. పక్కన జానకమ్మ, కూతురు రత్తమ్మ కూర్చుని పెద్ద పెట్టున ఏడుస్తున్నారు. బ్రతికున్నన్నాళ్ళు వదినను బాధలు పెట్టిన అమ్మ, అక్కయ్య నేడు ఆమె మరణించగానే అమితంగాదుఃఖించటం సరళకు వింతగాతోచింది. సరళలో వారంటే వొకవిధమైన ద్వేషంరేకెత్తింది. వదిన పోయిందనే దుఃఖము ఎక్కువయి సరళ గొల్లుమని ఏడ్చింది. అప్పటికే పక్కయిళ్ళవాళ్ళు నలుగురూ పోగయినారు. జానకమ్మగారు వాళ్ళనుచూసి మరింత ఏడుస్తున్నది.

సరళ శవం వంక చూసింది. అస్తమించిన వదిన ముఖంలో అమాయికత్వము మూర్తీభవించి వుంది. పాపం! బ్రతికున్నన్నాళ్ళు సుఖం ఎరుగని ప్రాణి! సుకుమారమయిన ఆమె దేహం ఎంత మొద్దుబారి పోయిందో!

సరళలో మనోవేదన ఎక్కువయింది. వదిన ఆత్మహత్య చేసుకున్నదా! అవును! ఎందుకు చేసుకోదు? రాక్షసుల్లాగా పీడించుకుతినే అమ్మ, అక్కయ్య లాంటి వాళ్ళు యింట్లో వుండగా ఆమెకు మనశ్శాంతి ఎట్లా వుంటుంది. వాళ్ళలో మానవత్వంలేదు.

"దాన్ని కన్నకూతురులాగా చూసుకునే దాన్నమ్మా!" అంటోంది అమ్మ మరింత ఏడుస్తూ.

ఎంత అబద్ధం! సరళయింక అక్కడ వుండలేక పోయింది. గబగబా మేడమెట్లెక్కి తనగదిలోకి వెళ్ళి పోయింది. దిండులో ముఖం పెట్టుకుని అమితంగా ఏడ్చింది.

2

సుశీలకు పెళ్ళిఅయేటప్పటికి పదహారేళ్ళుంటాయి. పెద్ద కట్నాలు భరించలేక ఆమెతండ్రి పరంధామయ్యగారు సుశీల పెళ్ళి విషయంలో అశ్రద్ధచేశారు. చివరికి తను తూగలేక పోయినా అయిదువేల కట్నంతో మంచి సంబంధమే చేశాడు. పిల్లవాడు బి. ఏ. చదువుతున్నాడు. ఆస్థికూడా అంతా కలుపుకుని పదిహేను ఎకరాలదాకా వుంది. బెజవాడలో స్వంత ఇల్లుకూడా వుంది. పిల్లవాడి తండ్రి శివరామయ్యగారు పెద్ద ఉద్యోగం చేసి రిటైరయి నలుగురిలోనూ గౌరవంగా బ్రతికిన మర్యాదస్తుడు.

పెళ్ళి సక్రమంగా జరిగిపోయింది. వెంటనే సుశీల కాపురానికి వెళ్ళింది. వెళ్ళిన నెలరోజులకే వాసుకి జబ్బు చేసింది. డాక్టర్లు టైఫాయిడ్ అని తేల్చారు. కోడలు వచ్చిన వేళా విశేషం ఎలాంటిదోకాని చక్కగా తిరుగుతున్న పిల్లవాడు మంచం పట్టాడని జానకమ్మ దిగులు పడింది. ఆమెలో కోడలంటే వొకవిధమైన ద్వేషం అంకురించింది. కోడలే జబ్బుకు కారణమని నమ్మింది.

పిల్లవాడి పరిస్థితి ప్రమాదకరంగా వుంది. డాక్టరు రోజూవచ్చి ఇంజక్షన్ ఇచ్చి వెడుతున్నాడు. సుశీల వాసు పోషణ భారం తనమీద వేసుకుంది. రాత్రిపూట అత్తగారు నిద్రపోయినా తాను మేల్కొనివుండి వాసుకు అన్ని ఉపచారాలు తానే స్వయంగా చేస్తున్నది.

నెలరోజులలో జబ్బు తగ్గుముఖం పట్టింది. డాక్టరు ఆరోజు పత్యం పెట్టమన్నాడు. వాసును దగ్గర కూర్చోపెట్టుకొని సుశీల జావ తాగిస్తున్నది. ఇంతలో శివరామయ్యగారు లోపలికి వస్తూ—

"వాసును మళ్ళీ బ్రతికించావమ్మా నువ్వు" అన్నారు.

"నాదేముంది మామయ్యా! డాక్టర్లే వాసుప్రాణం నిలిపారు" అంది సుశీల గ్లాసు కింద పెడ్తూ.

"వదినకు ఆ క్రెడిట్ అక్కర్లేదల్లేవుంది నాన్నా" అంది సరళ చదువుతున్న పుస్తకం మూసివేస్తూ.

"ఏమిటి క్రెడిట్ అంటున్నారు. ఎవరికి?" అంటూ చలపతిరావు ముఖం తుడుచుకుంటూ లోపలకు వచ్చాడు.

"ఇంకెవరికి! నీ భార్యకేరా! సుశీల లక్ష్మివంటిదిరా. ఆ అమ్మాయి చేతి చలువ వలన వాసుకు జబ్బు తొందరగా నయమయింది"

"నన్నుమరీ పొగిడేస్తున్నారే" సుశీల నవ్వుతూ దొడ్లోకి వెళ్ళి పోయింది.

3

ఆయేడు సరళ స్కూలుఫైనలు ప్యాసయ్యింది. వెంటనే కాలేజీలో చేరింది. వాసును హైస్కూలులో ఫస్టుఫారంలో చేర్చారు. చలపతిరావు కూడా ఆయేడే బి. ఏ. ప్యాసయి వుద్యోగంలో చేరాడు.

భర్త ఆఫీసు వేళకు సుశీల ప్రత్యేకంగా వంట చేసి పెడ్తోంది. అందులోనే సరళ, వాసూ నాలుగు మెతుకులు తిని ఎవరి దోవన వాళ్ళు వెళ్తారు. ఇక మధ్యాహ్నం ఏకంగా అత్తగారే మడికట్టుకుని వండుతుంది. రాత్రి పూట అందరికీ సుశీలే ఉడకేసి పెట్తోంది. పిల్లా పీచూ లేని రత్తమ్మ యింట్లో ఖాళీగావున్నా ఎప్పుడూ వంట జోలికి పోయేది కాదు.

రత్తమ్మ చలపతిరావుకు అక్కయ్యవుతుంది. అతనికంటే ఆవిడ వయస్సులో రెండేళ్ళు పెద్ద. ఆవిడ మొగుడుపోయిన దగ్గరనుంచీ పుట్టింట్లోనే వుంటోంది. చిన్నప్పటి నుంచి బాగా గారాబంగా పెరిగిన రకం! ఆ గారాబానికి సహజంగా వున్న గయ్యాళి తనం తోడయి యింటిపని పట్టనట్లుండేది.

సుశీలకు ఊపిరాడ కుండా పని సరిపోతున్నది. ఎంత పనిచేసినా అత్తగారెప్పుడూ మెచ్చుకున్న పాపానపోలేదు. పైపెచ్చు ఆ తల్లీ కూతుళ్ళిద్దరూ అష్టకష్టాలు పెట్టారు. ఆమెకు సరిగా నిద్రాహారా లుండేవికావు. సుశీల వండిన అన్నం కడుపునిండా భోజనం చేసిన ఆ తల్లీ కూతుళ్ళు మిగిలిన అన్నంలో నీళ్ళు పోసేవారు. సుశీల మారుమాట చెప్పకుండా నీళ్ళు పిండేసి ఆ అన్నం తినేది. ఈవిధంగా వారు ఆమెను పెట్టని కష్టం అంటూ లేదు. కాని సుశీల మాత్రం మారు మాటాడకుండా అన్నీ సహించేది.

సంక్రాంతి పండుగ నాలుగురోజులుందనగా సుశీల తండ్రి దగ్గరనుంచి, పండక్కి కూతుర్నీ, అల్లుడినీ పంపించమని ఉత్తరం వచ్చింది. శివరామయ్యగారు ఉత్తరం చూసుకున్నారు.

"వియ్యంకుడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందే! కూతురినీ, అల్లుడినీ పండుగకి అక్కడికి పంపించమని వ్రాశాడు" అన్నాడాయన భోజనంచేస్తూ.

"ఇప్పుడు పంపించటానికి వీలులేదని వ్రాయండి మనం మాత్రం ఇక్కడ పండుగ చేసుకోమటండీ! ఆవిడ పుట్టింటికిపోయి కూర్చుంటే నేను ఇంటిల్లిపాదిచాకిరీ చేసుకోలేను" అంది జానకమ్మ పులుసు వడ్డిస్తూ.

"అందుకని పంపించటం మానుకుంటామా! అయినా ఆపిల్లకు ఎప్పుడూ ఈ ఇంటి చాకిరీయేనా! పండగవస్తే పుట్టింటికి వెళ్ళడం తప్పా! నీకూతురే అత్తారింట్లోఉంటే పండగకి యిక్కడకి రావాలని నీకు వుండదూ? అలాగే వాళ్ళకీ ఉంటుంది. పోనీ పంపిస్తే మాత్రమేం?"

"పంపిస్తే పంపించుకోండి! మధ్య నేనెందుకు?"

శివరామయ్యగారు మాట్లాడకుండా వూరుకున్నారు. తలుపు చాటునుంచి యిదంతా వింటూన్న సుశీల ఇవతలకు వచ్చి—

"నేను ఇప్పుడు మావాళ్ళింటికి వెళ్ళను మామయ్యా! నాకూ వెళ్లాలని లేదు. సరళకు నాలుగు రోజులనుంచి జ్వరం తగులుతున్నదాయెను. ఆపిల్లను వదిలిపెట్టి వెళ్ళటానికి మనసొప్పటంలేదు. పైగా నేను వెడితే అత్తయ్యా చేసుకోలేను. అందుకని నేను రానని వుత్తరం రాయండి.

"సరే నీయిష్టం" అన్నాడు శివరామయ్య తన నిస్సహాయతకు లోలోన దిగులు పడుతూ.

4

శివరామయ్యగారికి పక్షవాతం వచ్చి మంచం పట్టాడు. అయనకు జబ్బుచేసినదగ్గరనుంచీ సుశీలే ఆయనకు ఉపచారాలు చేస్తున్నది.

చలపతిరావు ఆందోళన పడుతున్నా, జానకమ్మకు చీమకుట్టినట్లయినా లేదు. భర్తకు జబ్బు ఆదేనయమవుతుందిలే అనే నిర్లక్ష్య భావం ఆమెలో కలిగింది.

శివరామయ్యగారి పరిస్థితి బాగా విషమించింది. జబ్బు బాగా ఎక్కువయి మనిషి క్షీణించిపోయాడు. ఆరోజు డాక్టరు వచ్చి చూచివెళ్ళాడు.

"డాక్టరు ఏమన్నాడమ్మా ?" అన్నారు శివరామయ్యగారు నీరసంగా.

"డాక్టరుగారా! మీకు త్వరలోనే నయమౌతుందని చెప్పారు" అంది యథాలాపంగా. అబద్ధం చెప్పినందుకు సుశీల మనస్సులో నొచ్చుకుంది. కానీ నిజం చెపితే ఆయన ఇప్పుడే దిగులుపడి కూర్చుంటాడు.

ముసలాయన మూలుగు తగ్గలేదు. చలపతిరావు ఆదుర్దాపడి డాక్టరును పిలుచుకువచ్చాడు. ఆయన రావటం చూసి పక్కభాగంలోవున్న ప్లీడరుగారు కూడా వచ్చారు. అంతా గదిలోకి చేరారు. డాక్టరు పరీక్ష చేసి యింజక్షన్ యిచ్చాడు. కొద్దిగా తెలివి వచ్చింది. అప్పుడే శివరామయ్యగారు స్వయంగా ఆర్జించిన యావదాస్తినీ పెద్దకొడుకు పేరున వీలునామా వ్రాయించాడు.

5

శివరామయ్యగారు పోయి రెండేళ్ళవుతున్నది. సరళకింకా పెళ్ళి కాలేదు. ఇంటర్మీడియెట్ ప్యాసుకాగానే, చదువు మానేయకుండా బి. ఏ. లో చేరింది.

జానకమ్మగారి మనస్తత్వంలో మార్పేమీలేదు. భర్త పోయిన తరువాత ఆవిడపని పిచ్చలవిడిగా వుంది. ప్రతి విషయములోనూ ఆవిడమాటే చెలామణి అవుతున్నది. చలపతిరావు మాట ఇంట్లో సాగడంలేదు.

ప్రొద్దున్న సుశీల చాటలో బియ్యంపోసుకొని గడ్డలు ఏరుతున్నది. జానకమ్మ దొడ్లో పనిచేసుకుంటున్నది.

సరళ నవ్వుతూవచ్చి "వదినా! నువ్వు, అన్నయ్యా యివాళ మా కాలేజీకి రావాలి. ఈరోజు మా కాలేజీ వార్షికోత్సవం. మంచి మంచి ప్రోగ్రాములు వుంటాయి. నేను లైటుసాంగ్సు పాడుతున్నాను. ఇంకా నాటకాలు, ఉపన్యాసాలు అవీ కూడా వుంటాయ్. ఒకటేమిటి, తప్పకుండా రావాలి. సరేనా ?" అంది.

"నీదంతా మరీ చోద్యమమ్మా! నేనెట్లా వస్తాను. వస్తే మీ అన్నయ్య వస్తారులే" అంది సుశీల.

"ఏం అలా అన్నావు ?"

"నే వస్తే యిక్కడ వంటెవరు చేస్తారనుకున్నావు. పగటిపూట అత్తయ్యేవండుతున్నదాయెను. రాత్రిపూటన్నా నేను చేయకపోతే ఏలా ?"

అమ్మంటే వదినకు ఎటువంటి భయభక్తులువున్నాయో ఆమాటలో అర్థమైంది. వదినకు స్వేచ్ఛలేదు.

నెలరోజులు గడిచినాయి. చలపతిరావు వొకసారి ఆఫీసు పనిమీద అర్జంటుగా గుంటూరు వెళ్ళవలసివచ్చింది. రైలు అందదేమోనని ఆదుర్దాపడుతూనే ఇంటికివచ్చాడు. దారిన పోతున్న రిక్షాను ఆపి అందులో ఎక్కి త్వరగా స్టేషను చేరుకున్నాడు. ఇక రైలు బయలుదేరటానికి ఎంతో టైములేదు. చలపతిరావు తొందరగా టిక్కెట్టు తీసుకొని ప్లాటుఫారం వైపుకు పరుగెత్తాడు. అప్పటికే రైలు కూతవేసి బయలుదేరింది. ఆ బండి అందితేనేకాని సాయంత్రానికి తను తిరిగి రాలేనని మనస్సులో బాధపడుతూ మరింత త్వరగా పరుగెత్తాడు. రైలు వేగం హెచ్చింది. చలపతిరావు లెక్కచెయ్యకుండా అలాగే రొప్పుతూ వెళ్ళి ఒక పెట్టిదగ్గరవున్న కడ్డీ పుచ్చుకున్నాడు. కాని పట్టు తప్పిపోయింది. అంతే! చలపతిరావు జారి చక్రాలక్రింద పడిపోయాడు. అదిచూసి బండిలోనివాళ్ళు గొలుసు లాగారు. రైలు ఆగిపోయింది. పట్టాలమీదనుంచి అతనిని బయటకు తీశారు. అప్పటికే ప్రాణంపోయింది.

అనుకోకుండా వచ్చిన ఈ ఘోరవిపత్తు ఆ కుటుంబాన్ని దుఃఖముతో క్రుంగతీసింది. సుశీల దుఃఖానికి మితిలేకుండా వుంది. టెలిగ్రాం చూచుకుని సుశీల తల్లి, దండ్రులు గుండెలు బాదుకుంటూవచ్చారు. చిన్నవయస్సులోనే తన కూతురుకు వైధవ్యం ప్రాప్తించిందని పరంధామయ్యగారు విలవిలా ఏడ్చాడు.

సుశీల మనస్సును దిట్టపరచుకొంది. తనకు ఆనందం లేనప్పుడు ఇతరులను కూడా బాధపెట్టడం దేనికి. లేని ఆనందం తెచ్చి పెట్టుకొని చిరునవ్వుతో విధి వ్రాతకు తలవంచింది.

జానకమ్మ మనస్సును రాయి చేసుకుంది. కొడుకు కర్మ బాగుండక పోయాడని నమ్మింది. అలా అనుకొని మనస్సును తృప్తి పరచుకొంది. కాని మరుక్షణంలోనే కొడుకు అకాల మరణము మనస్సుకుక్షోభ కలిగిస్తున్నది.

జానకమ్మకు నూతన పరిస్థితులు చికాకును కలిగిస్తున్నాయి. వాటితో పరిపెట్టుకోలేక ఆవిడ తన ఇంటికి ఏదో పీడ పట్టుకుందని నమ్మింది. ఈ భావం ఆమెకు కలిగినప్పుడు మనస్సు పరిపరి విధాలపోతున్నది బహుశ కోడలు జాతకం మంచిది కాదేమో! అందువలనే తమకీ ఇక్కట్లు కలిగివుంటాయి. లేకపోతే ఉద్యోగం చేస్తూ చేస్తూ వున్న పాతికేళ్ళ కొడుకు ఏజబ్బూలేకుండా యిట్లా మాయమౌతాడా! ఇందులో ఏదో రహస్యముంది.

ఈ అనుమానానికి తగ్గట్టు సుశీల ఆ ఇంట్లో అడుగు పెట్టిన వేళావిశేషం ఎలాంటిదో కాని, నాలుగేళ్ళలోనే జానకమ్మ భర్త, కొడుకు పోయినారు. ఇది ఆవిడకు దృష్టాంతరంగా తోచి మనస్సులో రకరకాల ఆలోచనలు బయలు దేరినాయి. సుశీలమూలంగానే తమ ఇంటికి పీడ పట్టుకుందని ఆమె నిశ్చయించింది.

జానకమ్మకు ముఖ్యంగా తన ప్రాణంమీద భయము పట్టుకొంది. సుశీల మూలంగా ఇంట్లో ఇద్దరు పోయిన పుడు, తను మాత్రం సరిగా వుంటానని నమ్మకమేది? ఈ భావం ఆమెలో కలిగి సుశీలను చూచినపుడు మృత్యు వును చూసినట్లు లోలోన భయపడుతున్నది. ఇలా ఆవిడ కుఎందు భయపడుతున్నదో ఇంకొకరికి అర్థం చేసుకొన టం కష్టం. వృద్ధాప్యం వచ్చిపోయిన శివరామయ్యగారి మరణానికి, కర్మవశాత్తు పోయిన చలపతిరావు మరణా నికి సుశీల కారణమెలా అవుతుందో ఆమెకే బోధపడాలి కాని, ఆమె వూహించిన దానిలోనే ఆమెకు సత్యం గోచ రించింది. సుశీల బెడద తప్పించుకుంటేనే, తనకు మనశ్శాంతి చేకూరుతుంది.

తమ్ముడు రాఘవయ్యను చాటుగాపిలిచి జానకమ్మ తన మనస్సులోని బాధ బయటపెట్టింది. ఆయనకూడా ఆమె నమ్మకం నిజమని నమ్మాడు. ఆమె వూహలకు ప్రోత్సా హం కలిగించాడు. అంతేకాదు! ఆయన మనస్సుకు మరో ఆలోచన తోచింది. సుశీల బెడద తప్పించుకుంటే చలపతిరావు పేరనున్న ఆస్థి అంతా కుటుంబానికి చెందు తుంది. ఇక అప్పుడు సుశీల దయాభిక్షపై జానకమ్మ ఆధారపడి ఉండనక్కరలేదు. ఈ సలహా జానకమ్మకు బాగా నచ్చింది. ఆవిడకు బ్రహ్మానందమైంది. ఆమె దృష్టిలో ప్రాణంకంటే ఆస్తికి విలువ ఎక్కువైంది.

ఆ రాత్రి సుశీల మామూలుగా తానే వంట చేసింది. రాత్రి ఎనిమిది గంటలవేళ రాఘవయ్య వొక పొట్లం తీసుకువచ్చి జానకమ్మకు ఎవరూ చూడకుండాయిచ్చాడు.

రాఘవయ్య భోజనంచేసి వెళ్ళి పడుకున్నాడు. ఆయన అటు వెళ్ళగానే సుశీలను మేడమీదికిపోయి సరళను పిలుచుకురమ్మని జానకమ్మ పంపించింది. వాళ్ళు వచ్చే లోపుగా జానకమ్మ తనే స్వయంగా అందరికీ వడ్డించింది. సుశీల పెట్టుకునే కంచంలో రాఘవయ్య తెచ్చినది కాస్తా కలిపి తిరిగి వచ్చి తన యధాస్థానములో కూర్చుంది. అంతా భోజనంచేసి వెళ్ళిపడుకున్నారు. సరళ మేడమీదికి వెళ్ళిపోయింది. సుశీల వెళ్ళి తన గదిలో పడుకున్నది.

"తెల్లవారిన తరువాత సుశీల ఎలా పోయిందని అడుగుతారేమో! నాకు తెలియదని చెప్పు! అంతగా మరీ అడిగితే ఆ పిల్ల మొగుడుపోయిన దగ్గరనుంచీ దిగులుగా వుంటోంది. అందుకని ప్రాణం తీసుకుందేమో నని చెప్పు! సరేనా!" అని రాఘవయ్య ఆమె చెవిలో చెప్పాడు.

రాత్రి పన్నెండవుతుందేమో! సుశీలకు విపరీతమైన బాధ కలిగింది. పిలిచినా పలికే దిక్కులేకుండా ఆ గది లోనే బాధపడింది. మృత్యువుతో పోరాడి తెల్లవారకట్ల ప్రాణం విడిచింది.

జానకమ్మ తెల్లవారు ఝామున రాఘవయ్యను లేపింది. ఆయన గబగబాలేచి సుశీలను ఎత్తికెళ్ళి ఎవరూ చూడ కుండా భావిలో పడేశాడు.

తెల్లవారగానే జానకమ్మ గొల్లుమన్నది. సుశీల కనపడటం లేదని ఏడ్చింది. నలుగురూ పరుగెత్తుకు వచ్చి అన్నిచోట్లా వెతికారు. చివరికి దొడ్లో భావిలో శవం కనపడింది. రాఘవయ్య తనే భావిలోకి దిగి అందరూ చూస్తూవుండగానే శవాన్ని బయటకు తీశాడు.

6

పదిగంటలు కావస్తున్నది. రాఘవయ్య అటూ యిటూ హడావుడిగా తిరుగుతున్నాడు. సుశీల తల్లి దండ్రులు రాలేదు. ఎండ తీక్షణత ఎక్కువయిపోతున్నది. శవాన్ని తీసుకువెళ్ళటానికి అన్ని ఏర్పాట్లుచేసి బయలుదేరారు.

సరళ అప్పటికి మేడదిగి కిందికి వచ్చింది. శవం గేటుదాటి వెళ్ళిపోయింది. సరళ గేటుదాకావచ్చి, వది నను ఆఖరిసారిగాచూసి మనస్సులో శ్రద్ధాంజలినర్పించింది. కంటికి శవం కనపడేంతవరకూ అలాగే నుంచుండి పోయింది.

మహిళా సమాజాలు

ఉచిత ప్రసూతి వైద్యాలయము

రాజమండ్రి

శ్రీ దంగేటి నారాయణస్వామిగారిచే 1947 లో రాజమండ్రిలో స్థాపింపబడి, శ్రీ సప్పా సూర్యనారాయణ గారిచే నిర్వహింప బడుచున్న ఈ ప్రసూతి వైద్యాలయము దినాదినాభి వృద్ధి చెందుచున్నది. ఫెయిర్ ప్రైసెస్ డిపో, ఉచిత ప్రసూతి వైద్యాలయమునకు, సోషల్ వెల్ ఫేరుబోర్డువారి వద్దనుండి, కేంద్ర ఆరోగ్యశాఖ నుండి కూడ గ్రాంటులు బొంది అనేకమంది స్త్రీల ఆపదలను కాచుచున్నది. ఈ సంస్థ చేయుచున్న సంఘసేవకు ప్రజాదరణ, ప్రజాసహకారము దైవ సహాయము మునపటి కన్న ఇతోధికముగా కలిగి నిరంతరసేవ చేయగలదని ఆశిస్తున్నాము.

భారత సేవాసమాజము

సంగం జాగర్లమూడి

(మహిళా శాఖ)

మార్చి 30, 31 తేదీలలో ఈ గ్రామమున భారత సేవా సమాజమువారి యాజమాన్యమున అస్పృశ్యతానివారణ, హరిజనోద్ధరణ, దినోత్సవములు జరుపబడెను. భారత సేవాసమాజ కార్యాలయమునుండి గ్రామములోని వారు, భారత సమాజ సేవికలు, పాఠశాలల విద్యార్థులు అందరు చేరి గాంధి మహాత్ముని పటముతో "సర్వమానవ సమానత్వం వర్ధిల్లాలి" మొదలైన నినాదాలతో ఊరేగుతూ, గ్రామ హరిజన వాడకువెళ్ళి పల్లె వీధులలో గ్రామ పారిశుద్ధ్యమును గురించి ప్రబోధించుచూ ఉత్సవమును జరిపిరి. పల్లెలో స్థానిక వైద్యశాలాధి పతులు డాక్టర్ శ్రీ యన్. రంగాచారి యం. బి. బి. యస్ గారి అధ్యక్షతన బహిరంగసభ జరుపబడినది సభలో శ్రీ ఎద్దు చింపరయ్య శ్రీ కొత్త భావయ్య చౌదరి శ్రీమతి యస్. హనుమాయమ్మ, శ్రీ కూచిపూడి ప్రేమయ్య, స్థానికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కొత్త రాజ బాబయ్య గారలు గాంధీజీ హరిజనోద్ధరణకు చేసినకృషిని గురించీ అంటరాని తనమును నిర్మూలించుటకై అనుసరించ వలసిన విధానములను గురించీ, ఆరోగ్య విధులు, శుచిని గురించీ, గ్రామపారి శుధ్యమును గురించీ, ప్రభుత్వ సంక్షేమ శాఖవారు చేస్తున్న కృషిని గురించీ, హరిజన వెల్ ఫేర్ బోర్డువారి కృషిని గురించి, భారత సమాజ లక్ష్యములను, వారి కృషిని గురించి వుపన్యసించిరి. హరిజన వాడ విద్యార్థినుల "వందేమాతరం" ప్రార్థనతో సభా కార్యక్రమం ప్రారంభింపబడి "జనగణమన" గేయముతో శ్రీ వీరమాసునేని సంగమేశ్వరరావుగారి అభివందనములతో సభ ముగించ బడినది.

సభానంతరము అందరకు స్వీట్స్ పంచ బడినవి. రాత్రి 8 గంటలకు భారత సేవా సమాజ కార్యాలయ భవనమున, ప్రెసిడెంట్ అయిన శ్రీమతి జంపాల పద్మావతీ దేవిగారి ఆధ్వర్యమున గ్రామములోని అన్ని వర్ణముల వారి ప్రాతినిధ్యము కలిగిన 120 మందికి "సమిష్టి ప్రీతి భోజనము" పెట్టబడెను.

31 వ. తేదీన స్థానికోన్నత పాఠశాల ఆవరణలో తెలుగు పండితులు శ్రీ సుంకర వెంకట రత్నంగారి అధ్యక్షతన బహిరంగ సభజరిగినది. సభలో శ్రీ యన్. వి. సుబ్బారావుగారు శ్రీ పరుచూరి లక్ష్మీనరసింహరావు గారు, హరిజన విద్యార్థుల అభివృద్ధికై ప్రభుత్వం చేస్తున్న కృషిని, విద్య, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు తీసుకొనవలసిన శ్రద్ధను గురించి, విద్యార్థుల వసతి గృహ నిర్వహణ విధానములను గురించి వుపన్యసించిరి. భారతసేవా సమాజసేవికల "వందేమాతరం" ప్రార్థనతో సభా కార్యక్రమం ప్రారంభింపబడి, శ్రీయుతులు ప్రసాదరావు, ఘంటా నారాయణ రావుగారల "జనగణమన" గేయముతో సభా కార్యక్రమం పూర్తికావింప బడింది. శ్రీ వీరమాసు నేని సంగమేశ్వరరావు గారు భారత సేవాసమాజము తరపున, గ్రామపౌరులతరపున అభినందనములు తెలపిరి. పిల్లలకు స్వీట్స్ పంచిపెట్ట బడెను. రాత్రి 8 గంటలకు హైస్కూలు ఆవరణమున భారత సేవాసమాజము కార్యదర్శిని అయిన శ్రీమతి దేవభక్తిని వెంకటనరసమ్మగారి ఆధ్వర్యమున చుట్టుపట్ల గ్రామముల పల్లెలనుండి హరి

జన ప్రతినిధులను, ఇతరపక్షముల వారిని ఆహ్వానించి 130 మందికి "సమిష్టి ప్రీతి భోజనము" జరిపించారు.

వెముళ్ళపల్లి మాతాశిశు సంరక్షణాలయం

సెమినార్ మహోత్సవం

సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డువారి ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా ప్రాజెక్టు యింప్లిమెంటింగు కమిటీ అధ్యక్షులు శ్రీ ముర్తంగి అయ్యన్న బి. ఎ. ఎల్. ఎల్. బి. గారి అధ్యక్షతన చిన్న వెముళ్ళపల్లి మాతా శిశు సంరక్షణాలయములో "సెమినార్" ఉత్సవం జరిగింది.

సెమినార్ కార్యక్రమం కుమారి కె. సూర్యమాస్ గారి నాయకత్వాన సుమారు 50 మంది బాలబాలికలు జాతీయ గీతములు, హరికీర్తనలతో వెముళ్ళపల్లి గ్రామ వీధుల గుండా తిరుగుటతో ప్రారంభమైనది.

ఉదయం గం. 7 లకు శ్రీ పెండుర్తి అచ్యుత రామారావుగారు జెండా ప్రతిష్టించారు.

శ్రీ పెండుర్తి అచ్యుత రామారావుగారి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో, ప్రథమ ద్వితీయ పంచవర్ష ప్రణాళికలలో జరిగిన అభివృద్ధి, కేంద్రసాంఘిక సంక్షేమ బోర్డువారి కార్య కలాపములకు ప్రజా సహకారము మున్నగు విషయములపై ప్రసంగములు జరిగాయి.

రాత్రి 9 గంటలకు శ్రీ టి. కనకరాజు గారి [సర్జన్ రాజమండ్రి] అధ్యక్షత క్రింద ఒకసభ జరిగినది.



వెముళ్ళపల్లి సెమినార్

అనంతపురం డిస్ట్రిక్టు ప్రాజెక్టు యింప్లిమెంటింగు కమిటీ,

హరిజన సర్వోదయదిన మహోత్సవము

30-3-1957

అనంతపురం జిల్లా కలెక్టరుగారు శ్రీ కె. కొండల రావుగారు, ఎమ్.ఎ. వీరి ప్రోత్సాహమువల్లను, ధన సహాయమువల్లను జిల్లా అంతటను హరిజన సర్వోదయ దిన మహోత్సవము 30-3-'57 తేదీన అతివైభవముగా జరుపబడెను. మా కమిటీకి చేరిన 15 సకలారాధన కేంద్రములకును ఒక్కొక్క కేంద్రమునకు—హరిజను లకు గుడ్డలు పంచుటకు రూ 100-0-0 యున్ను, సహ పంక్తి భోజనమునకు రూ 25-0-0 యున్ను విరాళము నిచ్చిరి. కలెక్టరుగారు యిచ్చిన విరాళమునకు తోడుగా కొంతమొత్తమును గ్రామ ప్రజలుకూడ చందాలు యిచ్చిరి. ప్రతి సెంటరును శుభ్రపరచి రంగుకాగితముల తోరణ ములతోను, పచ్చని ఆకుల తోరణములతోను వివిధ ముగ్గులతోను పిల్లలు అలంకరించిరి. ఆ దినము ప్రాతః కాలముననే పిల్లలందరు స్నానములుచేసి, అలంకృతులై ప్రభాతభేరి కావించి గ్రామ పెద్దలవల్ల పతాకావిష్కరణము జరిపించి జాతీయగీతములు పాడిరి. మహాత్మాగాంధీ మరియు యితర దేశ నాయకులపటములను పూలతో అలంకరించి గ్రామమంతటను ఊరేగించిరి. 10 గంటల వరకు హరిజనవాడలో సాంఘికసేవ, హరిజన బాలబాలి కలకు అభ్యంగన స్నానము, గుడ్డల పంపకము జరుప బడెను. చాలాచోట్లను ప్రతిసెంటరు గ్రామములోను హరి జనులు దేవాలయములను ప్రవేశించిరి. ఊరి బావియందు నీరు చేదిరి. మధ్యాహ్నము 12 గంటలకు సకలజాతుల వారు సహపంక్తి భోజనముచేసి ఆనం దించిరి. సాయంకాలము పిల్లలకు ఆట పాటలు, ఆటపోటీలు జరుపబడెను: పిల్లలందరు అతిఉత్సాహముతో పాల్గొనిరి. సాయంత్రం 6 గంటలకు సభలు జరుపబడెను. ఆ సభకు ఆ గ్రామపంచా యితీ బోర్డు ప్రెసిడెంటుగారు లేక గ్రామ ములో పేరెన్నికగన్న పెద్ద మనిషి ప్రెసిడెంటుగానుండెను. గ్రామ ప్రజలు అతి ఉత్సాహముతో పాల్గొనిరి. ఆట పాటల పోటీలయందు గెలుపొందిన

బాల బాలికలకు బహుమానములు యివ్వబడెను. స్త్రీలు, కీర్తనలతో భజనలు చేసిరి. పిల్లలుకూడ పాల్గొనిరి. కేంద్రములలో బాలబాలికలు వినోద ప్రదర్శనములుచేసి జనులకు ఎంతో ఆనందము కలుగ చేసిరి. హరిజన సర్వోదయ దిన మహోత్సవము ప్రతి సెంటరునందును, అతిఉత్సాహముతో జయప్రదముగా జరుపబడెను. కొన్ని సెంటర్లలో కమిటీ మెంబర్ల ఆధిపత్యమున జరుపబడెను.



"శ్రీరామ లీలా మహోత్సవ సందర్భమునందు శ్రీరామనవమి దినమున కల్యాణ మహోత్సవము జరుపుచున్న విశాఖపట్నం ఆకెళ్ళ సూర్యనారాయణరాయ మహిళా భవన సభ్యురాండ్రు."

ఇరకం ద్వీప గ్రామంలో ఉగాది దిన మహోత్సవము

నెల్లూరు జిల్లా సూళూరుపేట తాలూకా ఇరకం ద్వీప గ్రామంలో యీరోజు ఉదయం 9 గంటలకు బాల సంఘమువారు ఉగాది పండుగ మహోత్సవము అతి వైభవముగా జరిపించిరి.

సభకు సుమారు 300 మంది గ్రామస్థులు సమావేశమైరి. బాల సంఘ అధ్యక్షుడు డాక్టరు జీ. ఆర్. కన్నయ్య నాయుడుగారు అధ్యక్షత వహించి ఉగాది పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. బాలసంఘ కార్యదర్శి శ్రీ కె మోసస్‌గారి ఆధ్వర్యాన బాలసంఘ సభ్యులు "త్రాగుడు రామయ్య" అను చిన్న నాటకమును ప్రదర్శించారు. బాగా నటించిన బాలబాలికలకు గ్రామాధికారి శ్రీ ఉ. పొన్నువేలు మొదలిగారు బహుమతులు యిచ్చారు. గ్రామ సేవిక శ్రీమతి రాజలక్ష్మిగారి వందన సమర్పణతో సభ ముగిసెను.

ఆకెళ్ళ సూర్యనారాయణరాయ మహిళా భవనం

శ్రీరామనవమి మహోత్సవ నివేదిక :

ఏప్రియల్ 1 వ తేదీనుండి 8 వ తేదీవరకూ శ్రీరామ నవమీ మహోత్సవము జరుపబడెను. ప్రతిదినము సంగీత కాలక్షేపములతో పూజలు జరిపించబడెను. సంగీత కాలక్షేపములందు కుమారి కె. గోపాలరత్నం (రేడియో ఆర్టిస్టు), శ్రీమతి రంపా సుభద్రమ్మగారు పాటకచేరి, శ్రీమతి పువ్వుల రాజామణిగారు, వీణాగానము, శ్రీమతి ఆత్మకూరి మంగళగౌరిదేవిగారు గాత్ర పాటకచేరీలు ఉచితముగా విన్పింపచేసి సదస్యురాండ్రను రంజింపచేసిరి. కల్యాణ మహోత్సవము 9 దినములూ జయప్రదముగా జరిపింపబడెను.

"విజయ గీతం"

ధవళ మూర్తికుమార్

మ్రోగించు విజయభేరీ
పూరించు పాంచజన్యం
వినిపించు విశ్వమంతా
వైభవోన్నత జాతిగీతం

సింధు లోయల్లోని నగరం
చరిత కందిన నవ్యవిభవం
వెల్లి విరిసిన కాంతి పుంజం
వెన్ను చఱిచెను తిమిరపటలం

సన్నుతించే శిల్ప నైపుణి
వన్నెగాంచిన చిత్రకళలే
హంసతూలిక తల్పతలములు
భావిభారత భాగ్య గరిమకు.

వీరవనితల కాలవాలం
వీరవరులకు దివ్య భవనం
వెలయు చుండిన వజ్రపీఠం
రత్నగర్భర "భరతదేశం"

అభ్యంతరం

శ్రీ పణతుల రామచంద్రయ్య

చెరుపబోకు మీ వినూత్న
చిత్ర రంగవల్లికలను
జగన్మంగళోత్సవ శుభ
సమయాలంకరణ మ్మిది

పెరికి వేయకురా మీ చి
గురుటాకుల మావి మొక్క-
సుభగ వసంత ప్రభాత
సురభిళమున కిదిచిహ్నము

చిదిమి వేయబోకుమీ మ
స్రృణ మల్లికలను-స్వతంత్ర
దేవీ మృదు మందహాస
ధావళ్యపు దీధితు లివి

ఆర్పి వేయ వలదీ ఆ
హవనీయసిత జ్యోతుల
యుగయుగాల చీకటిపాగ
తగులబెట్టు దీపిక లివి.

సంక్షేమం

5



ANDHRA MAHILA
MAY '57 (SAMKSHEMAM

దారిచూపిన దీపకలికలు:

ఏనీ బెసెంట్

(1874—1933)

దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షురాలు, సంస్కరణ కర్త, రాజకీయవేత్త, వక్తయైన డాక్టరు అనీ బెసెంటు 1867 వ సంవత్సరం అక్టోబరు ఒకటవ తేదీన జన్మించారు. ఈమె ఇరవై ఏడవ సంవత్సరమున ఛార్లెస్ బ్రాడ్‌లా ఎమ్.పి. చే నడుపబడిన ఫ్రీథాట్ అండ్ రేడికల్ మువ్‌మెంట్స్‌లో పని చేసి నేషనల్ సెక్యులర్ సొసైటీ ఆఫ్ గ్రేట్‌బ్రిటన్‌లో ప్రవేశించారు.

హిందూదేశానికి రాక పూర్వం బెసెంటుసతి. కార్మిక, సాంఘిక వుద్యమాల్లో ప్రముఖురాలుగా వుంటూ, ఫేబియన్ సొసైటీలోను. సోషల్‌డెమాక్రటిక్ ఫెడరేషన్‌లోను మెంబరుగావుంటూవుండేది. రేవుక్లిపనివారు. శిక్షిత కూలీల విషయాలలో ఈమె ఎక్కువ కష్టపడి ట్రేడ్‌యూనియనులతో పని చేసేవారు.

1889 నాటికి ఈమె అందుకొనని. పనిచేయని. వ్రాయని. మాటాడని కష్టపడని ఆధునిక సంస్కరణ వుందనడమే అరుదైంది. స్త్రీలకష్టాలు స్త్రీలకు సమాన హక్కులు, మంచి గృహవసతి పేద విద్యార్థులకు బడి భోజనాలు మొదలైన వ్యాసంగాలన్నిటా ఈమె పనిచేశారు.

అఖిల భారత బాలభట సంఘం ఆనరరీ కమిషనర్‌గా లార్డ్ బేడెన్ పవెల్‌చే నియమింపబడి ఈమె 1918 లో హిందూ దేశంలో బాలభట వుద్యమాన్ని ఆర్గనైజు చేసింది. కో- మేసనిక్ ఉద్యమాన్ని ఈమె ప్రారంభించినది.

ఇండియాలో ఈమె చేసిన సాంఘిక సంక్షేమం బహుళరూపాలు దాల్చింది. కలనల్ హెచ్. ఎస్. ఆల్కాట్ చే హరిజనులను ఉద్ధరించటానికి ప్రారంభించిన బాలాబడులు ఈమెచే అభివృద్ధిపరుపబడ్డాయి. ఈమె హిందువులలో బాల్య వివాహాలను ఎదుర్కొని బాలవితంతూత్వాన్ని అరికట్టడానికి పాటు పడింది.

ఈమె జాతిమత వ్యత్యాసాలను గూర్చి ఎదిరించి మాట్లాడి. వ్రాసి, శారీరకంగానూ, ఉద్రేకపూరితంగానూ, మానసికంగానూ, ఆముష్మికంగానూ కూడా ప్రతివ్యక్తి పూర్తి వ్యక్తిత్వాన్ని పొందుట కావాలని వాదించింది. 1998—99 లో కాశీలో స్థాపింప బడిన సెంట్రల్ హిందూ కాలేజీ, 1904 లో ప్రారంభింప బడిన సెంట్రల్ హిందూ గరల్స్‌స్కూల్—పద్ధతుల ననుసరించి ఈమె సలహాలపైనను. ఇన్స్పిరేషన్‌తోడను బాలురకు బాలికలకు దేశంలో వివిధస్థలాలలో బాలాబడులు స్థాపింపబడ్డాయి. స్త్రీలఅభ్యుదయానికి. స్త్రీలఓటింగుహక్కుకు కష్టపడ్డఅనేకమైనసంస్థలనుఈమెసమర్థించినది.

సాంఘిక సంక్షేమ పరిధిలో ఈమె చేసిన సేవవల్ల సంఘసంస్కర్తల కోవలో ఈమెకు ప్రముఖ స్థానం లభిస్తుంది. ఈమె తరువాత దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షుడుగా వచ్చిన శ్రీయుత సి. జినరాజదాస ఈమెను గూర్చి ఈ విధంగా చెప్పారు. "ఈమె జీవితమంతా అణచివేయ బడ్డ వారికి అధమ స్థితిలో నున్నవారికి చేయూతగా, అన్యాయానికి గురియైన వారికి న్యాయం కోసం. అలసట చెందని పోరాటం చేస్తూ, ఓటులేని స్త్రీలకోసం. రక్షణలేని జంతువుల కోసం పోరాడుతూనే వుంది." 1933 సెప్టెంబరు 23 వ తేదీన ఈమె స్వర్గస్థురాలైంది.

ఆటవికులకు సంఘ సేవ

శ్రీ ఎల్. ఎమ్. శ్రీకాంత్

(షెడ్యూల్డు తరగతులు, షెడ్యూల్డు జాతుల కమీషనర్)

మన దేశంలో సర్వసాధారణంగా వుపయోగింపబడుతూన్న మాటలు 'సాంఘికం' గాని 'విధి' గాని, సంస్కృతంలో చెప్పబడే 'సేవ' గాని 'ధర్మం' గాని అర్థయుతమైన, సరియైన మాటలు గావు. 'సేవ' 'ధర్మం' అనే మాటలకి సరియైన అర్థం చెప్పబూనితే,ఆమాటల అర్థాలతో వచ్చిన మార్పిడులు చాలావస్తాయి. రాజకీయాలతో సంబంధం అట్టేలేకుండా అనేకరంగాలలోఅనేక విధాలుగా సంక్షేమ కార్యక్రమాలను అమలులో పెట్టడం మాత్రమే నా వుద్దేశ్యంలో సంఘ సేవకిసరియైన అర్థం.

బ్రిటిష్ పరిపాలనా కాలంలో మెకాలే వంటి మేధావులచే ప్రారంభించబడిన విద్యాబోధన, వారిచే మంచి వుద్దేశ్యంతోనే ప్రారంభించబడినా, కేవలం నిర్వహణశాఖలో గుమాస్తాలను తయారుచేయడానికే పనికివచ్చింది. హిందూ సంఘానికి నిదర్శనాలైన సమిష్టికుటుంబాలునెమ్మది నెమ్మదిగా మాయమైపోయాయి. ట్రేడ్ యూనియన్లవంటి సంస్థలు బయలుదేరి వ్యక్తిగతంగానేకాక సంస్థలుకూడా సంఘ సేవకు పూనుకోవాలని పట్టుబట్టాయి.

ఈవ్యాసంలో ఆటవికులకు కావలసిన సంఘసేవనుమాత్రమే చర్చిద్దాం. 'సేవ, ధర్మం' మొదలైన వాటిని తరువాత తీరుబడిగా చర్చించవచ్చు. ఎందుకంటే వాటికిచాలా విస్తరణ, అవుసరం కనుక.


బహు జాగ్రతతోను, జాలితోను, విజ్ఞానప్రజ్ఞతోను పరిష్కరించవలసిన సమస్యలు ఆటవికులకు ఎన్నో వున్నాయి. లేటిన్ అమెరికాలో వీరిని దేశీయులని (ఇండో జీనస్) పిలుస్తారు. ఆంత్రోపాలజీ, అందులోనూ సాంఘిక ఆంత్రోపాలజీలో రిసెర్చి చేసేవారు. రకరకాల ఆటవికులను గూర్చి వారికి చేయదగ్గ సంఘ సంక్షేమం గురించీ విపులంగా వ్రాశారు. వీరు ముఖ్యంగా రకరకాల మనుష్యులు, వారి సంప్రదాయాలు, అలవాట్లూ, గుణగణాలను గూర్చి పరిశోధనలు జరిపారు. కాని వారిని ఎలా వుద్ధరించడం అనేది తెలుసుకుందుకు పరిశోధనలు జరిపించలేదు. అధ్యక్షుని ఆజ్ఞప్రకారం, సరిదిద్దబడిన లెక్కప్రకారం ఆటవిక జాతులవారు 22,511,854 గురు వున్నారు. మనదేశంలో దరిదాపు 572 మంది వెనుకబడిన జాతులవారు లేక ఆటవిక జాతులవా రున్నారు. సంస్కారంలోనూ వాటిల్లోను ఒక్కొక్క జాతి ఒక్కొక్క విధంగా అభివృద్ధి పొందుతూంది, ఈ జాతుల అభివృద్ధి, సంక్షేమాలలో కూడా రకరకాల మార్గాలూ, పథకాలు తయారుచేయాలి. ఒక్కొక్కజాతి అభివృద్ధినిబట్టి ఆజాతి సంక్షేమ పథకం మారుతూ వుండాలి. ఉదాహరణకి ఒక్క అస్సాములోని ఆటవికజాతుల వారే రకరకాల కోవలకి చెందినవారు, రకరకాల జాతుల వారున్నారు. నాగాలలో ఒక డజనుకంటె ఎక్కువ వుప జాతులవారున్నారు. మికిరీలకీ, మీజోలకీ తేడా. గోరాలకీ, ఖాసీలకీ వీరందరికంటె తేడాలు వున్నాయి, ఇల్లాగే బీహారులో ఓలోనులు, ముండాలు వారి వారి భాషలు మాట్లాడుకుంటారు. సింగ్‌భమ్‌లోని 'హో'లు వారికి వారే ఒకజాతి. మధ్యప్రదేశ్‌లో గాండులు, మురియాలు, భుజియాలు వున్నారు.

అధమపక్షం నూరేండ్లనుండి క్రైస్తవ మిషనరీలు సంక్షేమ కలాపాలలో ప్రవేశించి తలమానికంగా వున్నారంటే అతిశయోక్తిలేదు. వీరి కృషిఫలితంగానే బీహారులోను, ఛోటానాగపూరులోను ట్రైబల్ క్రైస్తవులు వున్నతవిద్యల నభ్యసించిన కొందరు ఇంకా పైచదువులకు పరదేశాలకు కూడా పంపబడ్డారు. క్రైస్తవ మిషనరీలు ఇంతకష్టపడి కొండలపైకి, భయంకరమైన అడవులలోకి

వెళ్ళి ఆటవికజాతులను వుద్ధరించారంటే వారికి కేవలం మతవ్యాప్తి అనే స్వార్థం వుండబట్టే, కొందరు మిషనరీలు కుటుంబాలతోసహా ఆటవికులమధ్య నివసించి సంఘసేవ అంటే అభిరుచిలేని మనకందరకు మార్గదర్శకులయ్యారు. ఒక మత విషయాలను తప్పించితే రామకృష్ణమిషన్‌వారు చేసే సేవ చెప్పుకోతగ్గది. స్థాపకుల ముందుచూపు కారణంగా ఎన్నోసంవత్సరాల క్రితం ప్రారంభించబడినా, కీర్తిశేషుడు గోఖేల్‌చే స్థాపించబడిన 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ' ఇప్పటికీకూడా వుత్సాహపూరితంగా ప్రజాసేవ చేస్తూనేవుంది. ఇదే మార్గంలో నడుస్తూన్న 'సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటీ' కీ॥ శే॥ లాలా లజపతిరాయ్‌చే స్థాపింపబడినది, ఈ రెండు సంస్థలూకూడా రాజకీయాలతో సంబంధంలేకుండా పనిచేయలేకపోయాయి. మహాత్మాగాంధీ హరిజనసేవక సంఘం అనే సంఘాన్ని రాజకీయాలతో, జాతిమతాలతోను సంబంధం లేకుండా స్థాపించాడు. ఈసంఘంలోని సభ్యులు ఎసెంబ్లీ మెంబర్లుగాగాని, పార్లమెంటు మెంబర్లుగాగాని ఏవిధంగాను రాజకీయరంగంలో ప్రవేశించకూడదని నిషేధించారు. మొదటి రెండు సంస్థలలో వలెనే ఈ సంఘంలోకి కూడా మెంబర్లు ఎన్నుకోడం లేదు. సంఘంలో సభ్యులను నామినేషన్లద్వారా చేర్చుకొనేవారు.

మనం ఈరోజు చూస్తున్నట్టుగానే సంఘసేవ కోసం ప్రారంభించబడ్డ అన్ని సంస్థలూ తలోరకంగా ప్రారంభించబడి తలోమార్గంలోను అభివృద్ధి పొందాయి. రామకృష్ణమఠంవారు, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీవారూ ఆటవిక ప్రదేశాలలో సంక్షేమ కార్యక్రమాలు కొంతవరకూ ప్రవేశపెట్టారు. 35 ఏండ్ల క్రిందట గుజరాత్‌లోని ఆటవిక భిల్లు ప్రదేశంలో, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీకి సంబంధించిన కీ॥ శే॥ ఠక్కర్ బాపా అనే ఆయన మార్గదర్శిలాటి పథకాన్ని ప్రారంభించి వెనుకబడ్డ ఆటవికుల సమస్యలను, వాటిపరిష్కార మార్గాన్ని దేశానికి చూపించారు.

ఆటవిక ప్రదేశాలలో సంఘసేవ చేయడానికి పూనుకొనే ఏసేవకుడైనా రకరకాల సంస్థల కార్యక్రమాలను విపులంగా పరిశీలించటమేగాక, అశ్రద్ధచేయబడిన ఆటవికజాతులవారి జీవితాలను సక్రమమార్గాలలో ప్రవేశపెట్టకల్గిన పనిపాటలు, చేతిపనులు, నేర్చుకొని వానిని ఏవిధంగా వారికి నేర్పాలో, ఏవిధంగా వారితో మసులుకోవాలో కూడా తెలుసుకోవాలి. మనలను వారు నమ్మి మనమీద సరియైన నమ్మకముంచడానికి అధమం ఐదేండ్లు పడుతుంది. దీర్ఘకాల అశ్రద్ధవలన ఇప్పుడు ప్రభుత్వం గాని, ఆటవికులు కానివారుగాని ఏమైనా కార్యక్రమాన్ని ప్రారంభిస్తే వారునమ్మలేనిపరిస్థితిలోనున్నారు. ఎక్కడైతే కార్యక్రమాలు అమలు జరగాలో అక్కడి పరిస్థితులు పరీక్షించకుండానే ఇప్పుడు రకరకాల పథకాలు ప్రారంభించబడుతున్నాయంటే చాలా విచారించవలసిన విషయం. ఆటవికులకు స్నేహితుడిగా ఒక సేవకుడు పనిచేయాలంటే, ఆ సేవకుడు ముందుగానే ప్రాంతాల పరిస్థితులు, అచటి మనుష్యుల స్థితిగతులు బాగా తెలుసుకొనివుండాలి. పట్నవాస సౌకర్యాలను చాలా భాగం పొందకుండా జీవించాలి. అందుచేత వెంటనే కాకపోయినా ఒకటి రెండు సంవత్సరాల తరువాత అయినా కుటుంబాన్నికూడా తీసుకొని వెళ్ళాలి. ఒంటి మనిషి కంటె ఎప్పుడూ వివాహితులు అయితే అక్కడి వారిలో అనుమానాలకు తావులేక నమ్మకం బాగా కుదురుతుంది. ఒంటరిగా సేవజేయడానికి వెళ్ళినవారిలో చాలామంది అక్కడివారి స్వేచ్ఛా జీవితానికి ఆహారమైపోయారు. అందుచే సంఘసేవకు లుండవలసిన నమ్మకం పోగొట్టుకున్నారు. దాంతో అక్కడ సంఘసేవకే చోటు లేకుండాపోయింది. ఇటువంటి అవకాశాలు లేకుండా వుండాలంటే వివాహితులు కుటుంబాలతో వెళ్ళడం అనేది సమంజసంగా వుంటుంది. కాయకష్టం చేయగల్గితే ఆటవికులతో కలిసిపోవడం సులభం. ఈవిధంగా వారిని గూర్చి తెలుసుకొందుకు, తగినట్టు సంక్షేమ కార్యక్రమాన్ని జరిపించడంకూడా సులభమౌతుంది. అధమపక్షం పదేండ్లపాటు వారితో నిర్విరామంగా కలిసి జీవిస్తే వారిని మన అలవాట్లకు, జీవితంలో వున్నతపద్ధతులు నేర్పడానికి, వారితో స్నేహం చేయడానికి వీలవుతుంది. ఆటవికజీవితం, సంస్కృతి, గురించి తెలుసుకునే వుత్సాహం వున్న సేవకునికి వీరితో పదేండ్లు జీవించడం అంటే ఏమంత కష్టమైన పనికాదు. ఈరోజుల్లో జీవనదానం గురించి చాలా మాట్లాడుతున్నాం. జీవనదానమంటే ఒకవ్యక్తి పూర్తి జీవితాన్నే సేవకర్పించడం అని అర్థం— కాని ఇది మర్చిపోయి సేవకులు రాజకీయాలలో మరుగుపడి పోతున్నారు. సంఘ సేవకులంటే అహాన్ని వదలగల్గిన వారుండాలి. కేవలం సన్యాసులు కావాలని కాదు కాని అన్ని కష్టసుఖాలకు సిద్ధపడి, నగరాలలరద్దీ జీవితాలను పొందలేకున్నామని బాధపడని వారు కావాలి. ఈ వ్యక్తి ఒక సంస్థలో శిక్షణపొంది సంస్థచే నమ్మకంగా పనిచేయగల వాడని హామీగల్గిన వాడైయుం



డాలి. తన జీవనోపాధికి కష్టపడ నవుసరము లేకుండా సంస్థ తగిన ధనసహాయం చేయాలి. అటువంటి నిశ్చింతుడైన వ్యక్తి సంఘసేవకు అర్హుడు. ఏ విధంగానూ ధనసహాయం చేయలేని ఆటవికుల చందాల పై అతడు ఆధార పడరాదు. అందుచేతనే అతనిని, అతనికుటుంబమును పోషించే భారము ఒకసంస్థపై నుండవలెను.

కొన్ని ఆటవిక ప్రదేశాలలో ఆటవికుల ఇండ్లు విసిరి వేసినట్లుండి ఒక పల్లెఅని తోచునట్లుండవు. ఇలావుంటే రకరకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు పర్చడంకష్టతరం అవుతుంది. మూడు, నాల్గుమైళ్ళ ప్రదేశములో దూరదూరముగా ఇండ్లుగల్గిన పల్లెలు అవి. దారులు చాలా కష్టంగా వుంటాయి. చిన్నచిన్న కాలిబాటలు, పుంతలు తప్ప ఇంకేమీ వుండవు. కుండలలో పోసుకుని తాగడానికి తగిన మంచినీళ్ళు దొరకడం చాలా కష్టం. ఈ ఆటవిక ప్రదేశాల సమస్యలు ప్రత్యేకమైనవి. అనునయముతో కూడిన ఓర్పుతో ఈ ప్రత్యేక సమస్యలను సంఘసేవకులు కాలక్రమేణ బహునేర్పుతో. పరిష్కరించాలి. ప్రథమంలోనే దాటవలసిన పెద్దకష్టం. వారితో మాట్లాడడానికి భాష తెలియక పోవడం.

నేను చెప్పినదాని కంతకీ విరుద్ధంగా విశ్వవిద్యాలయాలనుండి ఇప్పుడిప్పుడే బయటకు వస్తూన్న ఆంత్రోపాలజీ విద్యార్థులు- ఎంఏలు కానీ పి. హెచ్‌డీలు కానీ, ప్రత్యక్షమైన అనుభవంతో కూడిన శిక్షణ లేకుండా ఆటవిక ప్రాంతాలలో వీరు ఏమిసేవ జేయగలరు, అనేదే నాఅనుమానం. సర్వసాధారణంగా యూనివర్సిటీ నుండి పట్టా పొందిన విద్యార్థులు వెతికేది వుద్యోగం కాని సంఘసేవ కాదు. విద్యార్థులకు సంఘసేవ జేయవలెనని వుంటే వారితోకలిసి జీవించి పైనజెప్పిన విధంగా వారి జీవితాలు, అలవాట్లు మొదలైనవి తెలుసుకొని సంఘసేవ జేయవచ్చు. కాని వారికి బాగాధనంవచ్చే ప్రభుత్వపు వుద్యోగం వుండదుకాని జీవితావసరాలకు లోటులేని ధన సహాయం దొరకకపోదు. ఆటవికులతో మిషనరీలు జీవించినట్లు వీరు కూడా జీవించవచ్చు. ఆటవికుల వివిధ సమస్యలను పరిష్కరించడానికి డాక్టర్లు, నర్సులు, మొదలైన నిత్యజీవితానికి అత్యావసర వ్యక్తుల అవసరం ఎంతైనా వుంది. ఆ ప్రాంతాలలో ఉద్యోగాలకీ ప్రత్యేక తరగతులు, ప్రత్యేక జీతాలు ఏర్పాటు చేసినాకూడా ఎన్.ఇ.ఎఫ్.ఎ. ప్రదేశంలో డాక్టర్ల వుద్యోగాల్లో తగినంత మంది డాక్టర్లు దొరకడం లేదు. గాంధీజీ మార్గాల్లో, ఆటవికుల సంక్షేమ కార్యక్రమాలు నడపడానికి, ఒరిస్సారాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలో ఈ మధ్యనే జరిగిన ఒక ప్రయోగం ఇక్కడ తెల్పుతున్నాను. శ్రీ వినోబాభావేగారి భూదానోద్యమ పరిణామంవల్ల ఇక్కడి పల్లెలలోని భూములు అందరికి సమంగా పంచవలసిందని వారి వారి భూములను ఇచ్చివేశారు. యావద్భారత దేశంలోను భూదాన వుద్యమంలో అద్భుతమైన ఫలితాల నిచ్చినది. ఇండియాలో ఆటవికుల అధిక జనాభాకలిగిన ఎనిమిది వందల పల్లెలు కోరాపుట్ జిల్లాలో నున్నాయి. ఇక్కడ సర్వసేవా సంఘం వారిచే సరియైన ప్రాతిపదికపై అనేక విధాలైన సంక్షేమ కార్యక్రమాలు ఆరంభింప బడ్డాయి. ప్రయోగం ఇంకా ప్రారంభ దశలోనే వుండడంచేత దాని అభివృద్ధినిగురించి ఇంకా నేనేమీ చెప్పలేను. కాని, ప్రారంభంలో చూపిన అపరిమిత వుత్సాహం, అభిలాష ఆ పథకాల సక్రమ విజయాన్ని సూచిస్తున్నాయి. ఈ సంఘం కొంతమంది, నిష్కామ సేవకులను పొందగలిగింది. వారికి సేవయందభిలాష ఆత్మబలి, పనిలో నిమగ్నత తగినంతగావుంది. ప్రభుత్వము వారు, గాంధీస్మారక నిధివారు కూడా ధన సహాయం చేస్తున్నారు.

భారతదేశంలో వివిధ రాష్ట్రాలలో నివసిస్తున్న ఆట

వికులతో జీవించి వారికి స్వంతలాభం లేని సేవచేస్తూ 1948 లో కీర్తిశేషులైన శ్రీ ఠక్కర్‌బాపాచే స్థాపింప బడిన ది సెంట్రల్ ఇన్‌స్టిట్యూషన్, భారతీయఆదిమజాతి సేవకసంఘము ఏడు సంవత్సరములు పూర్తి చేసు కున్నాయి. ఈ సెంట్రల్ ఇన్‌స్టిట్యూషన్‌కు సంబంధించిన ముప్ఫైఎనిమిది సంస్థలు ఆటవిక ప్రదేశాలలో సంఘసేవ చేస్తున్నాయి. ఇంతవరకు ఏ ప్రభుత్వానికిచెందని సంస్థలు పనిచేయని ప్రదేశాలలో ఇవే మొట్టమొదట రంగంలోనికి ప్రవేశించాయి. ఈ సంక్షేమ కలాపాలు రాష్ట్రాల వారీ గానూ లేక ప్రాంతాల వారీగాను విభజింప బడాలి. లేక పోతే, పనిజరిగే స్థలానికి బహుదూరంలో నున్న కేంద్ర అధిపతులకు ఏ ఏ చోటులలో ఏ ఏ విధంగా పని జరుగు తుందో, సక్రమంగా జరుగుతుందో లేదో తెలుసుకోవడం చాలా కష్టతర మౌతుంది. ప్రభుత్వం నుండి ధన సహా యం దొరకడం దినదినానికీ కష్టతరమౌతూండడం వల ననూ, ఆధమం ఒకటి రెండేండ్ల వరకైనా సేవకులకు జీవితావుసరాలకు ధనసహాయంచేసే హామీ సంస్థలు ఇవ్వ లేకపోవడం వల్లనూ, ఈ ముప్ఫై ఎనిమిది సంస్థలలోను బహుకొద్ది మంది మాత్రమే జీవిత సేవకులు వున్నారు. ప్రభుత్వపు పంచవర్ష ప్రణాళికవలెనే సంఘ సేవకులకు ఐదేండ్లుకాని ఆంతకన్న ఎక్కువ సంవత్సరాలుకానిహామీ నిచ్చేఒక ఆర్గనైజేషనుప్రారంభించితే చాలాబాగుంటుంది. కేంద్రసంస్థ ఒక ప్రత్యక్ష శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి ఇతర సంస్థలకు శిక్షిత సేవకులను ప్రసాదించాలని చూచుచున్నది. వారుసభలను, సమ్మేళనములను జరిపించి అందులో ఒక్క సంఘసేవకులేకాక, నిపుణులు, ఆంత్రో పోలజిస్టులు, ప్రభుత్వపు కార్యాలయాల్లో ఆటవిక శాఖా విషయాలలో పనిచేసే ఉన్నత ఉద్యోగులు మొదలైన వారు, వివిధ విషయాలను చర్చించి, అందరికీ విజ్ఞానా న్నందజేయుటకు ప్రయత్నించు చున్నారు. అది ఒక త్రైమాసిక పత్రికను కూడ నడుపుచున్నది. అందులో ఆట వికుల సంస్కృతి, జీవితాలు, మొదలైన విషయాలను ప్రకటిస్తుంది. ఇందులో చాలామంది నిపుణులు, విద్యా ర్థులూ, వ్రాసినవ్యాసాలు ప్రచురింప బడుతూ వుంటాయి ఈ విషయాలు బాగుగా తెలిసిన నిపుణులచే వ్రాయబడిన పుస్తకాలను ప్రచురించుటకు ధనసహాయంచేసి, ప్రోత్సా హంకూడాఇస్తుంది. ఢిల్లీలోని ప్రధానకార్యాలయంలో ఒక గ్రంథాలయం, ఒక వివిధ వస్తుప్రదర్శనశాల నిర్మిస్తూంది. ఇండియాలోని వెనుకబడిన ఆటవిక జాతుల సంక్షేమ కలాపాలకు ఇది మూలస్థానంగా వుంది. అన్ని అనాగ రిక జాతుల జీవితాలను సమాన పరిధిలోనికి తేవడానికి, వున్న సమస్యలను పరిష్కారాలకి మార్గాలను వెదకుచూ నలుదిశలా పనిచేస్తోంది. వారి మంచి సంస్కృతి, అల వాట్లు దెబ్బతినకుండా చూస్తూ వారుకూడా జీవితానికి కావలసిన అన్ని సదుపాయాలూ సౌకర్యాలూ అనుభ విస్తూ భారత ప్రజానీకంగా జీవించాలని ఈ కేంద్ర సంస్థ సర్వతోముఖంగా చేస్తూన్నకృషి సఫలీకృతం కావాలని ఆశిద్దాం.

"ఒంటరిగా కూర్చుంటూ ఒంటరిగా విశ్రమిస్తూ
ఒంటరిగా నడుస్తూ ఒంటరిగా కష్టిస్తూ
ఒంటరిగానే స్వార్థాన్ని అణచుకొనేవాడు,
చిట్టడవిలో ఆనందాన్ని ఆస్వాదిస్తాడు."

—ధమ్మపద.

ఈ చిత్ర ప్రపంచం

నాకు అర్థంకాదు

శ్రీ సి. ఇ. డిసి. బిలెన్‌డెన్

(ప్రిన్సిపాలు, ఫ్లారెన్సు స్వాయిన్‌సన్ డెఫ్ స్కూలు, పలమ్‌కోట)

"మనుష్యులు వింతగాలేరా ? వారు నాలాగ ఎంత మాత్రము లేరు. ఒకరి నొకరు కలుసు కొన్నప్పుడు పెదవులను కదుపుచున్నారు. ఒకరు ఒకరి పెదవుల కదలికను కనిపెట్టి చూడక పోయినాకూడా నవ్వడం, సంతృప్తికరమైన దృష్టిని ముఖంలో వ్యక్తం చెయ్యడం లాంటివి చేస్తూవున్నారు.

"ఒక్కొక్కప్పుడు పొలంలో ఒంటరిగా నిలబడి దవడలను ఒకవిధంగా కదలిస్తూండడం చూచాను. ఇదంతా ఏదో వింతగా వుండడం మూలాన్ని వాళ్ళనే పరీకించడం జరిగింది. దీని పరిణామం వాళ్ళు తరుచు కోపం తెచ్చుకొని నేను ఒక మూర్ఖుణ్ణనుకునేవారు. ఇది నన్ను చాలా భయపడేటట్టుచేసి పారిపోదామా అనిపించేది. మనుష్యులు రకరకాలుగా పెదవులు కలిపి మధ్య మధ్య బెదిరించినట్లు ముఖాలు పెట్టడం చూస్తే నాకు అరవాలనిపించి ఏమికానున్నదో అనే ఆశ్చర్యం కలిగించేది. ఇవన్నీకూడా నాకు బాధాకరంగా వుండేవి.

ప్రతిరోజూ జరిగే ఈ పరిస్థితి నన్ను నా నెమ్మదిని కోల్పోయేటట్లు చేసింది. నే జీవిస్తూన్న ఈ విచిత్ర ప్రపంచంగురించి నేనేమీ అర్థంచేసుకోలేను."

నువ్వు చదువుకొనని పుట్టు చెమిటివానితో పరిచయం కల్గివుండడం మూలాని వానికేమైనా సహాయం చేయాలని తోస్తుంది. ఇండియా మొత్తంమీద ఇటువంటి దురదృష్ట వంతులు మూడు లక్షలకుపైగా వున్నారు. వారందరి ఆక్రందన వారిని సరిగా అర్థం చేసుకోమని. దానికి సమాధానమే ప్రత్యేక విద్యా బోధన. ఇందులోని నిజం మనకు ప్రతిదినం కండ్లకు కట్టినట్లుగా ఫ్లారెన్సు స్వాయిన్‌సన్‌చెమిటివారి బడిలో కనుపిస్తుంది. ఇది దక్షిణ భారత దేశంలోని పలమ్‌కోటలో వుంది.

ఇందులో డిండిగల్ స్టేషన్‌లో పోలీసుచే పట్టుబడిన ఒక పిల్లవాడున్నాడు. అతనికి ఐదేండ్ల వయసుండి తలిదండ్రుల వివరాలను ఏమీ చెప్పలేక పోయాడు. అందుచేత అతని పుట్టుపూర్వోత్తరాలేమీ తెలియలేదు. అతన్ని ఒక మేజిస్ట్రేటు వద్దకు తీసుకువెళ్ళితే ఆయనే 'ముత్తు' అని పేరుపెట్టి బాగుపడ్డానికిగాను ఏదైన సంరక్షణ సంస్థకు పంపమని సలహా చెప్పారు. ఏబడి వుంచుకొనుటకు కష్టతరమై ఆబాలుని ఈ బడిలో చేర్పించారు. చేర్పించినప్పుడు అతని పరిస్థితి జాలిగొల్పుతూ మొదట ఆస్పత్రిచికిత్స అవసరంగా తోచింది. ఆరోజుల్లో చిన్నముత్తుకు జీవితం దుర్భరంగా వుండేది. పది సంవత్సరాల అనంతరం ఇప్పుడు అతన్ని కలుసుకోవడం అంటేనే ఎంతో సరదాగా వుంటుంది. అత నిప్పుడు చురుకైన మనస్సుతో, చిరునవ్వు చిందే ముఖముతో హాస్యంతోకూడిన స్నేహపూరితుడు. ఆదీ అతన్ని సీనియర్ క్లాసులో అందరితోనూ కలసిమెలసి వుండేలా చేస్తూంది. అచ్చుపనికూడా చేతిపనుల సిలబసులో చేర్పబడడంచేత ముత్తు కంపోజిటరు కావాలని ఆశపడ్తున్నాడు.

ఇంతకు ముందొక వివాహ ఆహ్వాన పత్రిక మాకు వచ్చింది, మరియొక పాతవిద్యార్థి సాధారణ సంపూర్ణ జీవితం వైపునకు మరియొక అడుగు వేశాడని తెలుసుకుందుకు ఎంతో సంతోషమైంది. ధనికులైన తలిదండ్రు

లకు పుట్టి సకల సదుపాయాలూ పొందినా పుట్టుకతోటే చెమిటివాడగుటచే మూగవానిగను, ఏమీ తెలియనివానిగనూ వుండిపోయాడు. ఈబడి జీవితం అతని జీవితంలోని శూన్యతని చాలా భాగం కమ్మివేసింది. పెదవుల కదలికవల్ల తమిళం అర్థం చేసుకోవడం వీలైనంతవరకు ఎదటివారికి తెలియజెప్పి కలిగినంతమాట్లాడడం ఎంతో కష్టపడి నేర్చుకోవడంవల్ల అతనికి అతని తండ్రి వ్యాపారంలో బాధ్యతాయుతమైన స్థానం లభించింది. అతని తమ్ముడు అతన్నిగూర్చి ఎంతో గర్వపడి పెండ్లిపిలుపును బడిసహాధ్యాయులందరికి చూపించి సంతోషించాడంటే ఆశ్చర్యమేమీలేదు.

బాల బాలికల బడినిగూర్చి ఆలోచించినప్పుడు బాలురను మాత్రము చెప్పుకొని వారితో సమానమైన అవసరాలు కలిగిన బాలికలను వదలివేయడం సమంజసంకాదు. ఒక చెమిటి పిల్లవాడు పల్లెలోని ఇతర బాలుర వేళాకోళాలకు గురియైనట్లే, పల్లెలోని మూగ, చెమిటి బాలిక బావివద్ద నీళ్ళుతోడుకునేటప్పుడు కష్టానికి గురియౌతుంది.

ప్రత్యేకంగా చూడబడకుండా అందరు పిల్లలు ఒక్క-చెమిటివారి బడిలోనే చూడబడి వారి విలువలు గుర్తించబడుతాయి. స్వతంత్రానికి, సౌఖ్యానికి ముఖ్యమైన ద్వారం అయిన, ఇతరులను తను అర్థం చేసుకోవడం, తనను ఇతరులు అర్థంచేసుకొనేటట్లు చేయగల్గడం ప్రతి చెమిటి, మూగి బాలికా నేర్చుకోకల్గుతుంది. ఇది ఒక అనాథ బాలిక తెలుసుకున్న నిజం. కొసని నడుపబడు పరీక్షలలో వున్నతస్థానం రాకపోయినా పసిపిల్లలను షికారు తిప్పడానికి వెళ్ళవలసినప్పుడు ఆమె సంతోషానికి అంతువుండదు. చిన్న చిన్న సంభాషణలు, వార్తలందించడానికి గబగబా వెళ్ళడం ఇప్పుడామెకి భయంకరమైన కలలుకావు. పైగా ఆనందదాయకములు. ఆమె ప్రీతిపూర్వకమైన ఆదరణ, ఆటతోకూడిన హాస్యము ఆమెని "బంగారుతల్లి"ని చేశాయి.

ఇటువంటి ఫలితాలు క్లాసులో కొద్దిమంది మాత్రం వుంటేనే వీలవుతాయి. క్లాసులో పదిమంది మాత్రమే వుండడాన్ని చూచి సాధారణంగా సందర్శించడానికి వచ్చే వారికి ఆశ్చర్యాన్ని కలిగించినా, మాట్లాడుట నేర్పేక్లాసులో ఐదుగురు మాత్రముంటే చాలునని ఉపాధ్యాయుని అభిప్రాయం. ప్రతివొక్క-పిల్లవానిని అన్నివిషయాలలోను ప్రత్యేకంగా పరిశీలించే అవకాశం టీచరుకు ఇవ్వబడాలి. అందులోనూ మాట్లాడుట, పెదవులద్వారా చదువు నేర్పించేటప్పుడు తప్పకుండా ఇవ్వాలి.

మాతృభాషలో తగినంత ప్రావీణ్యం సంపాదించాలంటే ఒక బాలుడు ఎంత కష్టపడాలో అర్థం చేసుకునే మనుష్యులెందరు వుంటారని నా సంశయం. సాధారణంగా వినగల్గే పిల్లవాడు బడికిరాకముందే కష్టమేమీ లేకుండానే మాట్లాడగల్గుతాడు.

వారేమి మాట్లాడడానికి నేర్చుకుంటున్నారో వినలేని వారికి మాట్లాడటం నేర్పించడమంటే ఎంత వుత్సాహకరంగా వుంటుందో కొద్దిమందికి మాత్రమే తెలుస్తుంది. శబ్దంవల్ల కల్పించబడు కదలికలను వారు స్పర్శద్వారా తెలుసుకుంటారు. నాలుకను సరియైన ఉచ్చారణకు ఎలా త్రిప్పాలో వారు చూచికూడా నేర్చుకుంటారు.

ఇది చాలా సాధారణమైన ఉదాహరణద్వారా చిత్రించబడింది. "ఆమ్" అనేమాట ఉచ్చరించడానికి నేర్పించామనుకోండి. ఒక చిన్న పిల్ల కాళ్ళు ముడుచుకుని నేలమీద కూర్చుండి తన అరచేయిని ఉపాధ్యాయునిగుండెపైనుంచును, టీచరు నోరు పూర్తిగా జాపి, నాలుకను చదునుగావుంచి మాట ఉచ్చరించుటకు మొదలుపెట్టగానే ఆబాలిక కొక విధమైన అనుభవము కల్గును. ఆ వుచ్చారణకు సరియైన అక్షరమును "ఆర్" బోర్డుమీద వ్రాసి నేర్పించుదురు. తరువాత ఆమె తన అరచేతిని తన గుండెలమీదనే ఆన్చి ఇంతకుముందు తా ననుభవించిన అనుభవము కలుగునట్లు నోటిని కదుపుటకు ప్రయత్నించునట్లు చేయుదురు. అదేమాదిరి శబ్దము చేయగల్గినపుడు టీచరుపొందే సంతోషము ఆపిల్లపడే ఆనందము మిక్కిలి గొప్పవి. మాట్లాడు భాషకు సంబంధించిన శబ్దములను ఇదేమాదిరిగా చేయుటను నేర్పింతురు.

టీచరు "మ్"అను శబ్దమును నోరు తెరువకుండనే చేసినప్పుడు తనచేతిని గుప్పిడి మూసి టీచరు దవడలపై ఆన్చి శబ్దతరంగాలను గుర్తించి తిరిగి తను చేయగల్గినప్పుడు, "ఆర్" "మ్" కలిపి "ఆర్మ్" అని చెప్పకలదు. ఐదేండ్ల పిల్లవాడు మామూలుగా మాట్లాడు రెండువేల మాటలలో ఒక్కటిమాత్రమే ఇంతవరకు ఉచ్చరించగల్గింది. ఒకమాటకు ఇంకొకమాటకు సంబంధించునట్లు బోధించుటచే వారి శబ్దజాలము అభివృద్ధిపొందును.

ఈవ్యాసమును చదువుచున్న మీరు ఎదుటివారి పెదవుల కదలికను పరిశీలించ నవసరము లేకుండనే వా



మాటలను విని మాట్లాడగలరు. అతని పెదవులు, నోరు కదలనట్లయితే అతనేమనేదీ మీకుకూడా తెలియదు. శబ్దమును వినలేనివారికి ఎదుటివారి పెదవుల కదలిక ఒక్కటే ఎదుటివారి అభిప్రాయాలని తెలుసుకొనే మార్గం అవుతుంది. బడిని వదలిన తరువాత బయటివారితో మాట్లాడుటకు వీలగునట్లు వారికి పెదవుల కదలిక ద్వారా మాట్లాడుటకు నేర్పబడుచున్నది.

మాట్లాడు భాషను పదేపదే వినుటవల్ల సాధారణ మనిషి ఎదుటివారి భాషను ఎట్లు అర్థం చేసుకోగలుగుతున్నారో, చెవిటివారు ఎదుటివారి పెదవుల కదలికవల్ల తెల్సుకోగలుగుతున్నారు. అందుకనే ఒకేరకమైన ఉచ్చారణను పదేపదే వారు చూచే అవకాశాన్ని కల్గిస్తున్నారు. ఇదేవిధంగా, మాటలు, వాక్యాలు మొదలైనవి నేర్చుకుంటున్నారు. వయసు ముదిరిన తరువాత ప్రారంభించుటకన్న చిన్నవయసులో ప్రారంభించిన ఈశిక్షణ కొంచెము సుఖతరముగా నుండును. దురదృష్టవశాత్తు కొన్నిమాటల ఉచ్చారణ భిన్నముగానున్నను కొన్నిమాటలు స్వచ్ఛముగా నున్నవి.

పెదవుల కదలిక పాఠములను ఎట్లుప్రారంభించుతారో చెప్పి నేను విరమించుకుంటాను. శిశువు తన ముఖము

ముందు ఒక బంతిని పెట్టుకొని ఆదేసమయమున పెదవులను ఒక పద్ధతిలో కదలించును. ఇది చూచుచున్న బాలిక ఆ కదలికలను జాగ్రత్తగా పరిశీలించును. ఇదే విధముగా చాలాసార్లు జరుగును. (సరిగా చెప్పాలంటే టీచరు "బాల్" అనేమాటను చాలాసార్లు ఉచ్చరించు నన్నమాట.) ఇదేవిధంగా ఇంకా కొన్ని వస్తువులతో కూడా ఉచ్చారణలను కొన్ని వారాలు, నెలలపాటు తిరిగి తిరిగి ఉచ్చరింపచేయడంవల్ల ఫలానా వస్తువుపేరు ఫలానా అని వారికి తెలిసిపోతుంది. ఈవిధంగా పెదవుల కదలికను చదువుటయందు క్రమంగా అభివృద్ధి చెందుతారు.

ఇంకా ఎక్కువగా వర్ణించడం అనవసరం.

ప్రస్తుతం ఇండియా మొత్తంమీద నలభైమూడు చెమిటివారి బడులున్నాయి. మూడు లక్షల చెవిటి జనాభాకు సరిపోవాలంటే అధమం ఆరువందల బడులేనా వుండాలి.

పలంకోట బడిలోనే వైటింగు లిస్టులో ఇంకా నూట పధ్నాలుగురు పిల్లలున్నారు. అంటే ఆజిల్లాలోనే ఇంకా ఒక బడి కావాలన్నమాట. ఈవైటింగు లిస్టులో వారికి అవకాశం దొరికేటప్పటికి చాలామంది వయఃపరిమితి దాటిపోతుంది.

మంచి ఫలితాలను పొందాలంటే చెమిటి పిల్లల విద్యారంభం ఐదు సంవత్సరాల వయసులోపునే జరగాలి. కొన్ని దేశాలలో రెండు సంవత్సరాల వయసునుండీ కూడా శిక్షణ ఇవ్వబడుతూంది. మనంకూడా దీన్ని గమ్యం క్రింద పెట్టుకోవాలి. వీటైనన్ని స్థలాలలో ఈ బడులను స్థాపించడానికి మొట్టమొదటి అవుసరం శిక్షితవుపాధ్యాయులు, బడికి తగిన గృహవసతీనూ. టీచర్లు సెకండరీగ్రేడు, కాని పట్టభద్రులుకాని కావాలికాని వారు మాత్రం వుంటే చాలదు. ఈరకం విద్యాబోధనకి చాలా ఓర్పు అవసరం. తన రక్షణలో నున్న పిల్లల విషయంలో ముఖ్యంగా వుండితీరాలి.

చెమిటి పిల్లలు టీచరు నడతను, మాట్లాడే మాటలను బట్టి ఏది మంచి ఏది చెడ్డ అని తెలుసుకోవలసి యుంటుంది. వీరినిబట్టి బయటి ప్రపంచంలోని మనుష్యులను గురించి తెలుసుకుంటారు. వారు వృత్తివిద్యలవల్లనే జీవితావసరాలకు కావలసినవి సంపాదించుకొనగల్గుతారు. గౌరవప్రదమైన పౌరులుగా రాణించగల్గుతారు. మనదేశ ఔన్నత్యాన్ని కాపాడగల్గుతారు.

★

సంక్షేమాభివృద్ధి కేంద్రాలలో సర్వోదయ దినోత్సవము

అనంతపురము.

ది. 30-3-57 న హరిజన, సర్వోదయ దినోత్సవములను జిల్లా ప్రణాళికా నిర్వాహక కేంద్రం వారిచేనడుపబడు ప్రసూతి కేంద్రాలద్వారా జరపాలని అనంతపురం జిల్లాకలెక్టరు గారు జిల్లా ప్రణాళిక నిర్వాహక కేంద్రాలను కోరి అందుకుగాను రు. 1, 500, మంజూరు చేసిరి. దీని నుండి ప్రతి కేంద్రమునకు హరిజన వృద్ధవనితలకు పిల్లలకు ఉచితవస్త్రప్రదానం నిమిత్తం రు. 100 రూపాయలు సర్వోదయ దినోత్సవ ఖర్చుల నిమిత్తం రు. 25 లు యిచ్చిరి. ఈ విధముగా సహాయము పొందినవారు ముఖ్యముగా హరిజనులగుటవల్ల దీని సహాయమున హరిజనోద్ధరణ మాత్రమేగాక యీ జిల్లా ప్రణాళికా నిర్వాహక కేంద్రాలకూ మరింత ప్రజాదరణ పొందగలవు.

ఈ ఉత్సవములను సాధ్యమైనంత చక్కగా నిర్వర్తించుటకు కలెక్టరుగారు ప్రణాళికా కేంద్ర నిర్వాహకులకు ముఖ్య నిర్వాహకులకు సలహాల నిచ్చిరి.

జిల్లా ప్రణాళికా నిర్వాహక సంఘ సభ్యులందరూ కూడా యీ ఉత్సవములను విజయవంతము గావించుటకు శాయశక్తులా ప్రయత్నించారు.

మా తణిఖీ ఉద్యోగి రిపోర్టు:

తిరువల్లా మూగ బధిర పాఠశాల

శ్రీ డి. పాల్. చౌదరి

కేరళ రాష్ట్రంలో తణిఖీ చేయడానికి వెళ్ళినప్పుడు, రాష్ట్రానికంతకీ ఎనలేని శక్తితో అవధ్య బాల బాలికలకు నడపబడుచున్న బడి, తిరువళ్ళాలోని బధిర మూగ పాఠశాల వొక్కటేనని తెలుసుకొన్నాను.

1938 పలిమ్ అనే వూళ్ళో ఐదుగురు పిల్లలతో ఈబడి ప్రారంభింపబడి 1941 లో తిరువల్లాకు మార్చబడింది. 1952 సంవత్సరంనుండి చందాలతోను, విరాళాలతోను, రాష్ట్రప్రభుత్వ సహాయంతోను కట్టబడిన భవనంలో ఈబడి నడుపబడుతోంది.

జాతి మత వ్యత్యాసాలు లేకుండా అన్నిజాతుల మూగ, చెముడు పిల్లలు ఇందులో చేర్చుకోబడతారు. సాధారణంగా పదేండ్ల లోపు పిల్లలే చేర్చుకొనబడి



పదహారు సంవత్సరాలు వచ్చేవరకు వుంచుకొనబడతారు. మొత్తం 84 పిల్లలలోను 56 గురు బాలురు, 28 బాలికలు వున్నారు. హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు మొదలైన జాతులకు చెందిన బాలురున్నారు. బడిలో చేర్చుకొనబడిన పిల్లవాడు ఎనిమిదేండ్లపాటు శిక్షణ పొందుతాడు. చివరికి అర్థం అయ్యేందుకు సరిపోయేటట్లు మాట్లాడగలుగుతాడు. పెదవుల కలయిక మూలంగా వారు ఇతరులు సాధారణంగా మాట్లాడు మాటలను అర్థం చేసుకోగలరు. మాట్లాడటమేగాక వీరికి చదువుట, వ్రాయుట, చిన్న చిన్న లెక్కలు చేయుట, భూగోళ శాస్త్రం, చరిత్ర, ప్రకృతిశాస్త్రం మొదలైనవి కూడా నేర్పబడుతాయి. పిల్లలు తిండిగింజల పంటలను పండించడం, తేనెటీగలను పెంచడం, కోళ్ళ పెంపకం, వంట పనికూడా చెయగలరు. ఉపాధ్యాయుల ఆజమాయిషీక్రింద బడికాలము తర్వాత వీరికి బయట ఆటలు నిర్వహింపబడుతాయి. శిక్షితులైన బాలభట నిర్వాహకులచే నడుపబడుచున్న చిన్న బాలభట వర్గంకూడా వుంది. ఇక్కడ పన్నెండుగురు వుపాధ్యాయు లున్నారు. అందులో ఏడుగురు స్త్రీలు. ఒక వుపాధ్యాయుడు, ఇద్దరు వుపాధ్యాయినులు మూగవారే.

కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ సహాయంతో ఈ బడి, పిల్లలకు రకరకాలైన చేతిపనులలో శిక్షణనిస్తోంది. వారు జీవితంలో ఏదైన వృత్తివిద్యను స్వీకరించేందుకు సహకారం ఈవిధంగా జరుగుతోంది. చాపలు చేయడం, దర్జీపని, వ్యవసాయం, నేత మొదలైనవి ఈ బడిలో చాల బాలికలకు నేర్పబడుతూన్న పనులలో కొన్ని.

వసతిగృహం :

ముగ్గురు తప్ప అందరు పిల్లలు వసతి గృహంలోనే నివసిస్తున్నారు. పిల్లల భోజన వసతులు, మిగిన పిల్లల సంరక్షణ ఒక మేట్రన్‌చే చేయబడుతున్నాయి.

నిర్వాహకవర్గము :

ఏడుగురు మెంబర్లలో ఒకరు మేనేజరుగా గల కమిటీచే ఈసంస్థ నిర్వహింపబడుతూంది. వివిధ సంఘాలు, వివిధ విషయాలను పురస్కరించుకొనే పదహారుగురు సభ్యులు గల ఒక సలహా సంఘం ఈ సంస్థకు సలహాల నందిస్తుంది.


ఆర్థికపరిస్థితి :

చాలామంది పిల్లలు చాలా బీద కుటుంబాలలోంచి రావడంచేత వసతికిగాని విద్యకుగాని ధనం ఖర్చుచెయ్యలేరు. మొత్తం 84 గురిలోను 15 గురు మాత్రం వసతికి, విద్యకు ఏడాదికి రూ 180 చొ॥న చెల్లిస్తున్నారు. 20 మంది సగం జీతం కడుతున్నారు. మిగిలినవారికి అన్నీ ఉచితమే. ఈబడిని నడుపుటకుగాను ప్రతీ ఏడు సరాసరి రూ 14,000 లు చొ॥న ఈ సంస్థ ఖర్చుపెడుతూంది. బడిలోని వివిధ కార్యక్రమాలు విరాళాలవల్ల, పంటల ఫలంవల్ల, రాష్ట్రప్రభుత్వం, మునిసిపాలిటీవారు ఇచ్చే ఆర్థిక సహాయంవల్ల కొనసాగుతున్నాయి.

1955–56 సంవత్సరానికి కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ రు 4,000 లు జారీ చేసింది. ఈ సంస్థ బడిలోని పనిపాటలను అభివృద్ధిచేసి ఇంకా ఎక్కువమంది దురదృష్టవంతులైన పిల్లలకు సహాయకారిగా నుండుటకు ఐదేండ్లపాటు రు 2,500 లు కేటాయించడానికి నిర్ణయించింది.

శత వృద్ధు కార్వే :

[ఏప్రిల్ పద్ధెనిమిది నాడు మహర్షి కార్వే తొంభై తొమ్మిదవ జన్మదినం. ఆయురారోగ్యాలతో మన మధ్య కలకాలం మసలాలని ఆశిస్తూ, వారి ప్రోత్సాహంతో అరవై సంవత్సరాలుగా కృషి చేస్తున్న వివిధ సంస్థలను గురించి కొంచెం తెలుసు కుందాం.]



మహర్షి కార్వే

హైందవ వితంతువుల గృహ సంఘంగా జూన్ నెల 1896 వ సంవత్సరం హింగ్‌నే తన పనిని ప్రారంభించింది. రెండు సంవత్సరాల కాలంపాటు, విరాళాలు సమకూడేవరకూ కొంచెం మంది వితంతువులు మాత్రమే పోషింపబడి స్త్రీల శిక్షణ కాలేజీలోను, ప్రభుత్వోన్నత బాలికా పాఠశాల పూనాలోను చదువు నేర్పబడినారు. పూనా నగరంలో ఒక అద్దెకు తీసుకొన్న ఇంటిలో 1899 వ సంవత్సరం జనవరి ఒకటో తేదీని డాక్టరు కార్వే సరియైన వితంతు గృహం ప్రారంభించారు.

డా॥ కార్వే తన ప్రథమ భార్య గతించిన తరువాత ఒక వితంతువును వివాహమాడి సంఘసంస్కరణంలో ఒకపైన వితంతు వివాహాలను ప్రోత్సహించారు. 1893 లో ఈయనే వితంతు వివాహ సంఘాన్ని స్థాపించారు. కాని వితంతు వివాహాలను ప్రచారం చేయడంకంటే వితంతువులకు విద్యాబోధన ముఖ్యమని ప్రచారం చేయాలని త్వరలోనే తెలుసుకొన్నారు. ఇందు వల్లనే వారికి విద్యాసౌకర్యాలు అందించడానికే "వితంతు గృహం" ప్రారంభించబడింది. అన్ని సంస్థల వలెనే ఈ ప్రత్యేక సంస్థకూడా ప్రథమంలో చాలా కొంచెంగానే పనిచేసింది. మొట్ట మొదట నలుగురు వితంతువులతో ప్రారంభమయి నెమ్మది నెమ్మదిగా ఐదేండ్లలో ఇరవై ఒక్క మంది వితంతువులు ఈ గృహంలో చేరారు. పట్టణానికి దూరంగా పూనాకు నాలుగు మైళ్ళ దూరంలో రావు బహద్దూర్ గణేశ గోవిందగోఖలేగారి వ్యవసాయపు ఎస్టేటు, అందులో వారి పల్లెటి గృహమూ వుండేవి. 1889 లో వచ్చిన వ్యాధి మూలంగాఅనాధ బాలికాశ్రమమ్ (వితంతు గృహం ఆరోజుల్లో పిలువబడే పేరు) ఈ పొలంలోనికి మార్చడానికి అనుమతి దొరికింది. ఆశ్రమాన్ని అచ్చటనే స్థాపించినట్లయితే ఆరు ఎకరాల నేల ఒక గది కట్టడానికి కావలసిన ధనసహాయం రావు బహద్దూరు గోఖలేగారు ఇస్తామని అన్నారు.

తరువాత అక్కడ ఒక గుడిసె వేసి అందులోనే ఈ వితంతు గృహాన్ని నడిపారు. వారు చేసిన ప్రయోగం జయప్రదంగా కొనసాగింది. ఈసంస్థ తొలి దశలో అందులో నివసించే వితంతువులు నీళ్ళు తెచ్చుకొందుకు ముళ్ళు, రాళ్ళతో కూడిన దారిని చాలా దూరం నడిచి వెళ్ళి రావలసి వస్తూండేది. వితంతువులు నడువవలసిన దారిని నడువక ఆర్థికంగా, సాంఘికంగా అనుభవించ వలసిన హిందూ స్త్రీత్వాన్ని ధిక్కరించి కొత్తపంథాను త్రొక్కినందుకు ఆచారవంతులైన ప్రజలు రాళ్ళు విసిరే వారు. ఇందుకు కార్వే మహనీయుడుగాని అందులో నివసించే వారుకాని బెదరలేదు.

ఆరోజుల్లో బ్రహ్మచెముడు దొంకలతో నిండియున్న స్థలమే, అరవైయేళ్ళ తరువాత ఆరువందలమంది నివాసితులతో, స్వంత నీటివసతి, విద్యుద్వసతి, పరిశుభ్రత లతో సర్వస్వతంత్రంగా ప్రజ్వరిల్లుతూన్న ప్రఖ్యాత సంస్థగా రూపొందింది. ఇప్పుడు ఈ సంస్థను పట్టణాన్ని కలుపుతూ బస్సు సర్వీసూ తారు రోడ్డూకూడా వున్నాయి.

క్రమంగా వితంతువులకు శరణాలయంగా స్థాపించ

బడిన ఈ సంస్థ చాలామంది అవివాహితులనుకూడా ఆక ర్షించింది. అందులో వారుకూడా విద్యాభ్యాసం చేసేవారు. ధన సదుపాయంగలవారి బిడ్డలనుకూడ ఖర్చులను భరించి ఇచ్చటకు పంపించేవారు.

అందుచేత అవివాహిత బాలికలకు 'మహిళా విద్యాలయ' అనే ప్రత్యేక సంస్థ స్థాపించబడింది. తమ పిల్లలకు ఇరవై ఏండ్లు వచ్చి, అధమం ఉన్నతపాఠశాల విద్య నేనా పూర్తి చేయనిదే వివాహము చేయమని బాండురాసి ఇచ్చిన తలిదండ్రుల బిడ్డలకు స్కాలర్‌షిప్పులు ఇచ్చేవారు. ఈవిధంగా వివాహ వయస్సును పెంచి బాల వితంతువుల సంఖ్యను తగ్గించడానికి ప్రయత్నంజరిగింది. ఈ మహిళావిద్యాలయా 1912 లో హింగ్‌నేలో కట్టబడిన స్వంత భవనంలోకి తరలించబడింది.

వితంతు శరణాలయం (అనాధ బాలికా ఆశ్రమమ్) మహిళా విద్యాలయా 1915 లో కలిపివేయబడ్డాయి. హిందూస్త్రీల విశ్వవిద్యాలయాన్ని జయప్రదంగా నడిపింపడానికి ఈ హింగ్నే సంస్థ సర్వవిధాలా తోడ్పడింది. విశ్వవిద్యాలయంలోని కళాశాల, పాఠశాలలు (కన్యాశాలలు) హింగ్నే సంస్థయొక్క జీవిత సభ్యులచే నడపబడ్డాయి. బెల్గామ్, షోలాపూర్, ధులియాలలోని బాలికా పాఠశాలల అభివృదికికూడా ఈ జీవిత సభ్యులే తోడ్పడ్డారు.

మార్పుచెందుతూన్న సంఘం క్రొత్త సమస్యలను సమర్పించింది. వితంతువులు పునర్వివాహం చేసుకొందుకు, అనుమతించబడ్డారు. వివాహ వయస్సు క్రమంగా పెరిగింది. వితంతువుల కష్టాలు చాలావరకుగ్గదెక్కాయి. కాని ఇప్పుడు ఇంటిలోనుండి తరిమివేయబడ్డ, లేక భర్త పెట్టే కష్టాలను భరించలేక తానుగానే బయటకువచ్చివేసిన దుఃఖితురాలైన భార్య జీవితం బయటపడింది. వదలివేయబడ్డ భార్యలు, నిరాదరణ చూపబడి లేక అశ్రద్ధ చేయబడి బాధితులైన పెండ్లి కుమార్తెల దుఃఖమయ జీవితాల సంఖ్య నానాటికీ విపరీతంగా పెరిగిపోతోంది. విపరీత స్వభావాన్ని ఎదుర్కొనలేని అసహాయ యువతులు విధిగా ఏదైనా సంస్థలో చేరవలసివస్తోంది. బ్రతుకు భారమైన వందలాది వితంతువులు, వివాహిత స్త్రీలు తామూ తమ కుటుంబాలూ కూడా స్వయంపోషకులుగానూ, కుటుంబాలను పోషించే స్తోమతకలవారిగనూ మంచి పౌరులుగను ఈ హింగ్నేలో తయారగుచున్నారు.

గాంధీజీ అంటరాని తనాన్ని నిర్మూలించడానికి, ప్రారంభించడానికి కొంచెం ముందునుండీ ఈ సంస్థలో హరిజన బాలికలు చేరుతూ వచ్చారు.

యువక నేరస్థుల విషయంలో ఈ సంస్థ చేసిన సంఘసేవ ప్రత్యేకంగా చెప్పుకోతగ్గది.

ఒకప్రక్క ఆరోగ్యకరమైన పరిసరాలలో సేవా, ఆత్మబలుల మధ్య చక్కని విద్యాభ్యాసాన్నర్థించే ధనిక కుటుంబాలనుండివచ్చే బాలికలు నూట ఏభైమందివుంటే, అనాథలు, తప్పుదారి తొక్కినవారు, జూవెనైల్ కోర్టుల ద్వారా వచ్చిన యువకనేరస్తులు ఒకప్రక్క ఇదే సంఖ్యలో నున్నారు.

చాలామంది బాలికలు ప్రాధమిక వుపాధ్యాలుగా శిక్షణ పొందారు. మరి కొందరు ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదివి నర్సింగుమొదలైన పెద్దచదువులకువెళ్ళారు. చాలాకొంచెం మంది వివాహాలు చేసుకొని స్థిరపడ్డారు. ఒక చాలా తెలివైన బాలిక కాలేజీలో చదువుతూంది బి. ఎ. పరీక్షకు వెడుతూంది.

డజన్లకొద్ది బాలికలు దుర్భర జీవితాల నుండి రక్షింపబడి వుపయోగకరమైన విద్యాభ్యాసం ద్వారా సౌఖ్యాన్ని, అభివృద్ధినీ పొందారు.

అరవై సంవత్సరాల క్రిందట 1900 లో మట్టిగుడిశలో ప్రారంభించ బడిన ఈ సంస్థ అన్ని విభాగాలలోను విస్తరించి ప్రస్తుతం ఈ క్రింది విభాగాలను కల్గియుంది. 1.విద్యార్థులనుఎస్.ఎస్.ఎల్.సి.పరీక్షలకు తర్ఫీదుచేస్తున్న మహిళాశ్రమ్ వున్నత పాఠశాల 2. ప్రాధమిక వుపాధ్యాయినులను తయారుచేస్తున్న పార్వతీబాయి అధ్యాపక శాల, 3. ఆనందిబాయి, కార్వే ప్రాధమిక పాఠశాల. పై మూడు బడులలోను మొత్తం ఐదువందలమంది విద్యార్థులు (దరిదాపు 50 మంది వితంతువులు, 65 వివాహితలు, 340 అవివాహితలు 45 గురు బాలురు) వున్నారు. హింగ్నేలో నడువబడుచున్న నాల్గు వసతి గృహాల్లో ఐదు నుండి ఇరవైఐదు ఏండ్ల వయసువారు నివసిస్తున్నారు. వెనుక బడిన జాతుల బాలికలైననూ, వున్నత వంశీకుల బాలికలైనను ఒకే గదులను పంచుకుంటారు.

ఈ విధంగా హింగ్నే స్త్రీ శిక్షణ సంస్థ ప్రముఖమైన సాంఘిక, విద్యాబోధక సంస్థగా అరవై సంవత్సరాల నుండి ప్రజాసేవ చేస్తూంది. దీనిని స్థాపించిన డాక్టరు డి కె. కార్వే మహాశయుడు తొంభైతొమ్మిది సంవత్సరాల వయసుకల్గినా ఎంతో చాకచక్యంతో దీని అభివృద్ధిని గమనిస్తూ వున్నారు. ఇటువంటి స్థాపకుని పొందగల్గిన అదృష్టం ఈ సంస్థకే పట్టిందంటే అతిశయోక్తికాదు.

సహచర్యపు విలువ

మా పల్లెలోని చిన్న చిన్న యిళ్ళలోని ముదుసలులనీ, ఏ సహచర్యంలేని ఏకాకులనీ వెళ్ళి చూడ్డం అంటే నాకు చిన్నతనంలో ఎంతో యిష్టంగావుండేది. వీరెంతో బీదలు. కాని ఎంత అభిమానింప దగినవారని! ఒకనాటి మధ్యాహ్నం నేను నిశ్చయించుకున్నాను. ఆదివారపు మధ్యాహ్నం వెళ్ళి యీ ముసలివారి కోసం గట్టిగా ఏమైన చదవాలని.

ఒక ముసలామె యీ చదువుట వినడం ఎంత యిష్టపడ్డదంటే, తనలాంటి నలుగురైదుగురిని పోగుచేసింది వచ్చి వినమని. నేను పుస్తకాలు జాగ్రత్తగా ఎన్నుకొనేదాన్ని. వారి కేం యిష్టమౌతాయో అని. ఇలా నా మొదటి పుస్తకం - నాల్గు కథల సంపుటి- నాల్గు ఆదివారాల మధ్యాహ్నలు పట్టింది పూర్తి చెయ్యడానికి. తరవాత అడిగాను 'నాల్గింటిలోనూ ఏకథ బాగుంది' అని. నా మొదటి ముసలి స్నేహితురాలు అందరికీ బదులుగా సమాధానం చెప్పింది "మేమందరం చెవిటి వాళ్ళం శ్రీమతీ. మీరు చదివినది మాకు వినిపించదు. అయితేనేం, మీ దగ్గఱ కూర్చుని చదవడం మాకెంతో యిష్టం." నాకెంతో నిరుత్సాహం కల్గింది మొదట. కాని నేనిప్పుడు అర్థం చేసుకోగలను. పొరుగింటికి సరదాగా వచ్చి కూర్చోడం అనే చిన్న మార్పూ, ఎవరో తమకి ఉత్సాహాన్నిచ్చే కాలక్షేపం యిస్తున్నారన్న సరదా, ఆ వినపడని ముదుసలుల కెంతటి వుత్సాహాన్ని యిచ్చిందో అర్థంకాగానే వారంటేనూ, వారికి నే చేసే యీ చిన్న పనంటేనూ నాకూ సరదా వచ్చింది.

వారా కథలు నిజంగా వినకల్గినా, అసలు కథ యిచ్చే ఉత్సాహం కంటే కూడా తమకోసం ఎవరో శ్రద్ధ చూపుతున్నారన్న విషయమే ఎక్కువ ఉత్తేజాన్ని కల్గించేదేమో. ఇప్పుడు నాకే వినపడదు. అందుకే యిలాంటి వాళ్ళదగ్గిరకి ఎవరేనా వచ్చి అరవకుండా ఆదరంగా విసుక్కోకుండా మాట్లాడితే ఎంతహాయిగా వుంటుందో తెలుస్తుంది. మాకూ ఎన్నోనా సరదాలున్నాయి. చదవకలం. రాయకలం. కుట్టుపని చెయ్యకలం. పూలు అల్లకలం. ప్రశాంత సమయంలో దేవుని మాటలు సహితం వినకలం. విని తిరిగి మాట్లాడ కలం. దేవుడెప్పుడూ ప్రస్ఫుటంగా మాట్లాడుతాడు. ఎప్పుడూ విసుగు చెందడు.

—హెలెన్ బెయిలీ హాల్టన్.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

REPORT FOR MARCH 1957

IN-PATIENT MATERNITY

No. of Patients admitted for Deliveries	165
,, ,, Medical cases treated	48
,, ,, Surgical cases treated	1
,, ,, Gyneac and Abortions	29
,, ,, Post Natal	5
,, ,, babies admitted	130
Grand total	378
,, ,, normal Deliveries	124
,, ,, abnormal Deliveries forceps 6	6
Total	130

OUT-PATIENT DEPARTMENT

No. of Surgical cases	49
,, ,, Medical cases	1077
,, ,, Gyneacological cases	152
,, ,, Ante-natal cases	315
,, ,, Post-natal cases	133
,, ,, E.E.N.T. cases	65
Total No. of New patients	1791
Total No. of Old patients.	2383
Grand Total	4174

NURSES' TRAINING CENTRE

The first batch of Auxiliary Nurse Midwives discharged from the institution, numbering 11, are all employed now. The second batch of 30 trainees completed their training in July and will be taking their final examination this month. They will all be immediately taken into service, some in the Community Development Blocks, Andhra Government and the rest in the Welfare Extension Projects, Andhra State. Third batch of 15 trainees are continuing their II year of study in midwifery. They have all finished conducting 25 cases each in the hospital 5 of them have finished their domiciliary midwifery training. All of them are attending lecture between 2 p m to 4 p.m. and conducting their ward work in the hospital. Fourth batch of 15 traines are waiting for their preliminary examination in Nursing & First aid. They have finished their preliminary training period and six months of Nursing in the Government General Hospital. They are having revision classes in First aid and General Nursing. Fifth batch of trainees numbering 30 have finished their preliminary training and are continuing their second month of training in Nursing at the General Hospital.

Mrs. V. LAKSHMI PARVATHI
Secretary and Convenor

Mrs. A. C. KRISHNA RAO
Administrative Secretary

Dr. M. PAVANA BAI
Medical Superintendent

భూమి గుండ్రముగా వుంది

శ్రీమతి రామసీత

"భూమి గుండ్రముగా బంతి ఆకారముగా వున్నది. మానవుడు భూమిమీద ఒకచోట నుంచి బయలుదేరి కొంత కాలము తిరిగి మరల బయలుదేరిన చోటునకే వచ్చిచేరు కుంటాడు. అందువలననే భూమి గుండ్రముగా నున్నదనిచెప్పవచ్చు" అంటూ రామయ్య తన అర్ధగంట పాఠాన్ని ముగించి పిల్లలవంక ఒక సారి తేరిపార చూచాడు.

అది మూడవ తరగతి. దానిలో అంతా పది సంవత్స రాలలోపు పిల్లలే. అంతా తెల్లమొఖంవేసి చూస్తున్నారు. ఒక్కడికీ తను చెప్పింది బోధపడలేదు. ఎలా బోధపడు తుంది? వాళ్ళలేత మనస్సులకు నోటితో చెపితే తెలియదు ఏదన్నా ప్రత్యక్షంగా చేసి చూపెట్టాలి. వాళ్ళలో వాళ్ళు భూమిని గురించీ బంతినిగురించీ చర్చించు కుంటున్నారు చర్చ తీవ్రత హెచ్చింది. పైకప్పులేచి పోయేటట్లు అరు స్తున్నారు. రామయ్య వీళ్ళకు అర్ధమయ్యేలాగ ఎలా చెప్పాలా అని ఆలోచిస్తూ కుర్చీలో చతికిల పడ్డాడు.

"అయ్యా" అంటూ నీగ్రో సుబ్బన్న- ఆస్కూలు ప్యూనుకు పిల్లలు ముద్దుగాపెట్టినపేరు-క్లాసులోకివచ్చాడు. రామయ్య ఒక్కసారి వులిక్కిపడి ఈ ప్రపంచంలోకి వచ్చాడు.

"అయ్యా! హెడ్ మాష్టరుగారు తమర్ని పిలుచుక రమ్మన్నారండీ" అన్నాడు. హెడ్ మాష్టరు పేరు వినే టప్పటికే రామయ్యకు గుండెలలో రాయిపడింది. ఏమి వుపద్రవం ముంచుకొచ్చిందో నని పిల్లలను గోలచేయ కండా వుండమని చెప్పి సుబ్బన్న వెనకాలే వెళ్ళాడు.

హెడ్ మాష్టరుగారు మెత్తని దిండువేసిన కుర్చీలో కూర్చుని ఏవో కాగితాలమీద సంతకాలు పెడుతున్నారు. రామయ్యను చూడగానే మండిపడుతూ "ఏమండీ మీ క్లాసు ఒక్క నిముషం నిశ్శబ్దంగా వుండదే పైకప్పు ఎగిరి పోయేటట్లు అరుస్తున్నారు పిల్లలు. మీరేం చేస్తు న్నారండీ! అసలు మిమ్మలను చూస్తేనే వాళ్ళకు అంత సంతోషం అలుసుకూడా" అంటూ ఆరంభం చేశాడు ఉపోద్ఘాతం.

రామయ్యకు ఈమాదిరి కేకలు కొత్తవిగాదు. రోజూ వినీ వినీ చెవులు మొద్దుబారిపోయినై. దానికి ఏమి సమా ధానం చెప్పాలో గూడ తెలుసు. తలవంచుకుని వూరు కోవటమే సరైన సమాధానం.

"అసలు క్లాసు ఎలానడపాలో మీకుతెలియదు వాళ్ళ నుగోల చేయకుండా వుంచటం మీచేత గానూగాదు...." అంటూ చెప్పుకు పోతున్నాడు. రామయ్య కొయ్యబొమ్మ లాగా అలానే కళ్ళు అప్పచెప్పి చూస్తున్నాడు.

"సరే. మీరు క్లాసును సమర్థంగా నిర్వహించ లేక పోతున్నారు. వట్టి అసమర్థులు. అందువలన మిమ్మలను పనిలోంచి తొలగిస్తున్నా" అంటూ ముగించాడు తన అర్ధ గంట చివాట్లను హెడ్ మాష్టరు.

రామయ్యకు పిడుగు పడ్డట్టయింది ఈ శుభవార్త వినే సరికి. నోట్లోంచి మాట పెగలటంలా. కాస్సేపటికి తెప్ప రిల్లి కోపంతో "అవునండీ నాకు తెలుసు నన్ను మీరు ఏదో ఒక కారణంచూపి పనిలోంచి తీసేస్తారని. మీ మేనమామ కుమారుడు బావమరిదికి ఈ వుద్యోగం యివ్వాలని మీ తహతహ. కాని పాపం అతను మాత్రం ఎంతకాలం వుండగలడా అని నా అనుమానం. రేపు మీ మేనమామ కొడుకుకేరావచ్చు ఈ వుద్యోగానికి అప్పుడు అతనికి గూడా నాకు పట్టినగతే గదా పడుతుంది!"

"ఈ వెధవ కబుర్లన్నీ కట్టిపెట్టి బయటికి నడు" హెడ్ మాష్టరు గర్జించాడు.

"అవును. ఇప్పటికే తమరిలో ఆ వెధవమనస్తత్వమే కొంతవుంది. అందువలననే యిలా మాట్లాడు తున్నారు" అంటూ బయటికి విసురుగా వచ్చేశాడు రామయ్య.

రామయ్య పనిచేస్తున్నది తెనాలిలో ఒక ఎలిమెంటరీ స్కూలులో. స్వగ్రామం బెజవాడ. అక్కడనే అన్నగారు బ్యాంకిలో గుమస్తా వుద్యోగం చేస్తున్నారు. ఆ సాయంత్రమే ఆపదోద్ధారకుడైన అన్నగారింటికి బెజవాడమెయిల్ లో వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. సామానంతా సర్ది పెందరాడే రెండు మెతుకులు ఎంగిలిపడి స్టేషన్ కు వచ్చాడు. సామాను కూలివాడి నెత్తిన ఎత్తి, బెజవాడకు ఒకమెయిలు టిక్కట్టుయివ్వమని బుకింగు క్లార్కుని అడిగాడు. అతడు టిక్కెట్టుఇస్తూ "త్వరగావెళ్ళండి మెయిలు వచ్చి చాలా సేపయింది. ఇంక 3 నిముషాలే ఉంటుంది" అన్నాడు.

రామయ్య గబగబా బండివద్దకు పరుగెత్తాడు. సామానంతా ఎలాగో అతికష్టంమీద ఒక మూడవ తరగతి పెట్టెలోకి విసిరిపారేశాడు. కూలివానికి నాలుగణాలు చేతిలో పెట్టాడు. వాడు అర్ధరూపాయి ఇస్తేగాని వల్లగాదని తకరారు చేశాడు. ఈలోగా బండికదిలింది. రామయ్య బండి ఎక్కుదామంటే కూలివాడు వదలడాయె. ఏలాగో ఆరణాలు విసుక్కుంటూ వాడి మొఖానవేసి తిరిగిచూచేటప్పటికి బండి అప్పుడే రెండు పెట్టెలు దాటిపోయింది. గబగబా అందిన కమ్మీని పట్టుకుని దొరికిన పెట్టెలోకి ఎక్కాడు. అదృష్టవశాత్తు అది ఆడవాళ్ళ పెట్టెకాదు. మొదటి తరగతిపెట్టె. ఇంతలో బండి సిగ్నలు స్తంభాలు దాటింది. అలానే కొంచంసేపు ఫుట్ బోర్డుమీద నిలబడి ఆయాసం తీరిన తరువాత అద్దంలోంచి లోపలికి తొంగి చూచాడు. లోపల భయంగానేవుంది. అందులో ఈమధ్య రైలులో మొదటి తరగతి పెట్టెలలో ఖూనీలు, దొంగతనాలు విపరీతంగా జరుగుతున్నాయి. తన్నుగూడ ఏ దొంగో ననుకుని లోపలివాళ్ళు గొలుసులాగి బండిఆపితే తనగతి ఏంకాను?

ఎనిమిది మంది కూర్చోవలసిన ఆ పెట్టెలో ఒకే ఒక స్థూలకాయుడు విశ్రాంతిగా కూర్చుని వున్నాడు తాపీగా చుట్ట కాలుస్తూ. వయస్సుగూడా 50 దాటి వుండవచ్చు. మనిషి వాలకంచూస్తే పెద్ద వ్యాపారస్థుడులా వున్నాడు.

"అయ్యా" రామయ్య వణుకుతున్నా గొంతుతో పిలిచాడు. "దయచేసి కొంచెం తలుపు తీస్తారా?"

ఆ విగ్రహం చూస్తున్న కాగితాలను ప్రక్కన పెట్టి అద్దంలోంచి రామయ్య మొఖం తీక్షణంగా చూచాడు.

రామయ్య అతని చూపులలోని అర్థాన్ని గ్రహించి "అయ్యా నేను దొంగనుగాను, హంతకుణ్ణిగాను, మోసగాడినిగాను, తొందరలో పొరపాటున ఇక్కడ ఎక్కాను వచ్చే స్టేషన్ లో దిగిపోతా. దయచేసి కొంచెం తలుపు తెరవండి" అన్నాడు అతి వినయంగా.

ఆ స్థూలకాయుడు రామయ్య శరీర సౌష్టవాన్ని తన దాంతో పోల్చి చూసుకుని "నువ్వు అలాంటి పిచ్చిపనులు చేసినా ఒక్క దెబ్బతో సోదిలోకి రాకుండా పోతావు!" అంటూ తలుపు తెరిచాడు. రామయ్య బ్రతుకు జీవుడా అనుకొని లోనికివెళ్ళి ఒకమూలగా వదిగి కూర్చున్నాడు. కూర్చున్నాడేగాని అతనిదృష్టి అంతా సామానుమీదే వుంది. తను ఒకచోట, సామాను వేరొకచోట. మనిషి దగ్గరవుంటేనే సామానులు పోవటం పరిపాటి ఈ రోజులలో. ఇక తను ఒకచోట సామాను ఇంకొకచోట నైతే చెప్పనే అక్కరలేదు.

ఆ కలియుగ భీముడు కాగితాలు చూచుకుంటూ మధ్య మధ్య కిటికీలవంక తీక్షణంగా చూస్తున్నాడు ఏదో దీక్షగా ఆలోచిస్తూ.

"అయ్యా తమరు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నారే" అన్నాడు అతని వాలకాన్ని ఇంతసేపు గమనిస్తూ రామయ్య.

"అవును. దీర్ఘాలోచనే. ఏమి చేయటానికి తోచకుండావుంది. నువ్వు ఏంచేయగలవు?"

"అలా గాదండీ. తమరు మొదట ఆ ఆలోచనఏమిటో శెలవివ్వండి. నా వల్లనయితే తప్పక సహాయ పడతా"

ఆ స్థూలకాయుడు అసలు సంగతి రెండు మూడు వుత్తరాలు అర్జంటుగా రాశి పోస్టు చెయ్యాలిట. "కాని నా రాత బ్రహ్మరాతండీ. చాలా అసహ్యంగా వుంటుంది చిన్న పిల్లలు పిచ్చిగీతలే నయం. వుత్తరాలు చక్కటి అక్షరాలతో రాస్తే చదివేవాడు గూడా చాలా మెచ్చుకుంటాడు. ప్రస్తుతం ఈ రెండు వుత్తరాలు రాయకపోతే వ్యాపారంలో కొన్నివేలు నష్టం వస్తాయి. అందు వలన ఎలారాశి వేసేదా అని చూస్తున్నా. అసలు నా శక్రటరీ వెధవ ఇంతపని చేశాడు. అతను నాతోబాటు మద్రాసు నుంచీ వస్తున్నాడు. దోవలో నెల్లూరులో ముఖ్యబంధువులువున్నారు చూచి వస్తానని అచ్చట దిగాడు. అతనే వుంటే నాకీగొడవలేక పోను. మీకు టైపు చేయటం తెలుసా? టైపు మిషన్ కీ యిచ్చటనే వుంది కొంచెం ఆ రెండు వుత్తరాలూ టైపు చేసి పెడుదురూ" అన్నాడు.

"ఓ. నాకు టైపు చేయటం తెలుసు. నేను ఆంధ్రా గవర్నమెంటు హైయ్యర్ గ్రేడ్ పాసయ్యాను. తమరి శెలవు అయితే టైపు చేస్తాను. ఈ విధంగానైనా తమరి రుణం తీర్చుకుంటా" అంటూ రామయ్య కాగితాలు చేతిలోకి తీసుకున్నాడు.

"అలానా నేను అనుకున్నట్లు నీకు టైపుగూడా తెలుసన్న మాట. మంచిది. ఈ రెండు వుత్తరాలు కాస్త చేసి పెట్టు" అంటూ టైపు మిషను రామయ్యకు అందించాడు

కొంచెం సేపటిలో రామయ్య వుత్తరాలను టైపు చేయటం ముగించి సంతకం కోసం ఆయన ముందు పెట్టాడు. అతి సునాయాసంగా సంతకం పెడుతూ "దయచేసి బెజవాడలో వీటిని మెయిలులో వేయండి" అని త్రిప్పి ఇచ్చాడు.

కొంచెం సేపటికి బండి బెజవాడ చేరింది. రామయ్య అతనివద్ద సెలవు పుచ్చుకుని గబగబా సామాను వున్న పెట్టెవద్దకు పరుగెత్తాడు. అదృష్ట వశాత్తూ ఆ పెట్టెలోని వాళ్ళు అంతా పెద్దమనుష్యు లవటం వలన సామానంతా జాగ్రత్తగానే వుంది. సామానంతా కూలివాడి నెత్తినఎత్తి తను వుత్తరాలు మెయిల్‌లో వేసి బయటకెళ్ళాడు. బయటికి వచ్చి బండి మాట్లాడుతుండగా మరల కనిపించాడు. ఆ స్థూలకాయుడు.

"అయ్యా తమరి వుత్తరాలు పోస్టు చేశానండీ. సామాను దించుకునే తొందరలోవుండి తమరితో మనవి చేయలేదు క్షమించండి"

"మంచిపని చేశావు నీకు అనేకవేల నమస్కారాలు. ఈరోజు అవి పోస్టుచేయకుంటే కొన్నివేలు...."అంటూ మధ్యలోనే ఆపేశాడు మాటలను, బహుశా కొత్తవాడితో వ్యాపార విషయాలు ఎందుకు చెప్పాలిలే అనుకుని.

రామయ్యకు వెంటనే మెరుపులా ఒక ఆలోచన తట్టింది. ఆయన్ను ఏదైనా సహాయం వుద్యోగాన్వేషణలో చేయమని అడుగుదా మనుకున్నాడు. కాని నోటిలోంచి మాటలు పెగిలి రావటంలేదు. ఎలానో ధైర్యం చేసి "అయ్యా ఒక్క చిన్నమనవి. ప్రస్తుతం నేను వుద్యోగం లేకుండా వున్నాను. తమరిదయ వుంటే మీ కంపెనీలో ఏదైనా వకవుద్యోగం చూపించండి"అన్నాడు

"అలానే చూద్దాం. ప్రస్తుతం మాట్లాడటానికి టైము లేదు. ఇదిగో అడ్రసు ఈ అడ్రసుకు సాయంత్రం వచ్చి మాట్లాడండి. చూద్దాం" అన్నాడు ఒక అడ్రసు కార్డు అతని చేతిలో పెడుతూ.

రామయ్య అడ్రసు కార్డు తీసుకుని ఆయనవద్ద శెలవు పుచ్చుకుని నెమ్మదిగా బండిలో అన్నగారింటికి జేరాడు.

ఆరోజు ఆదివారం. అన్నగారు ఇంటివద్దనే వున్నారు జరిగిన దంతా సెలవిచ్చాడు రామయ్య. సరే మన అదృష్టం ఎలావుంటే అలానే జరుగుతుంది. దానికి మనం విచారించి చేయ గలిగింది ఏమీలేదని తమ్ముడికి ధైర్యం చెప్పాడు. రామయ్య భోంచేసిపడుకున్నాడు. సాయంత్రం లేచి వదినగారిచ్చిన కాఫీత్రాగి స్నానంచేసి గుడ్డలేసుకుని ఆ స్థూలకాయుడి దర్శనంకోసం బయలు దేరాడు. టైము సరీగ్గా ఆరు కొట్టింది.

ఆ విగ్రహం ఇంటివద్దనే వుంది. రామయ్యను చూస్తూనే చిరునవ్వు నవ్వి లోనికి ఆహ్వానించాడు. ఇద్దరూ ఆఫీసు గదిలోనికి కెళ్ళి కూర్చున్నారు. ముందుగా రామయ్యే తన దీన చరిత్ర యావత్తూ క్లుప్తంగా వివరించాడు. ఆయన అంతావిని సానుభూతి చూపుతూ "ఏమి చేయమంటారండీ. ఏమి చేద్దామన్నా వీలులేకుండావుంది. ప్రస్తుతం కంపెనీలో ఖాళీలులేవు. మీకొరకై ప్రస్తుతం ఏదన్నా ఒక కొత్త వుద్యోగం సృష్టిద్దామన్నా దానికి ఈగలలాగా ముసురుకుంటారు మా బంధువులు, స్నేహితులు. మావాణ్ణి వెయ్యమంటే మావాణ్ణి వెయ్యమని. కానీ మీరు నాకు కొంత సహాయం చేశారు. దానికి ప్రతిఫలంగా మీకు నేనుగూడా ఏదైనా సహాయం చేయాలని నాకు గట్టిగావుంది. నేను తెనాలిలో ఒకఎలిమెంటరీ స్కూలుకు ప్రెసిడెంటును. అచ్చటగూడా ఖాళీలులేవు అయినా ఒక పంతులుని డిస్మిస్ చేసి మీకు ఆ వుద్యోగం యిస్తా. చేసుకుంటారా?" అన్నాడు.

రామయ్యకు వేరే గత్యంతరంలేక ఆయన సలహాను ఆమోదించాడు. కాని ఆశ్చర్యం ఏమిటంటే రామయ్యను డిస్మిస్ చేసిన ఆ స్కూలుకు ఈయనే ప్రెసిడెంటు. రామయ్యకు తను స్కూలులో ఆఖరు సారిగా చెప్పిన పాఠం "భూమి గుండ్రముగావుంది" జ్ఞాపకానికొచ్చింది. లోలోపలే నవ్వుకున్నాడు. సరే అలానే వేయించండని చెప్పి శెలవు పుచ్చుకుని ఇంటికి వచ్చాడు. ఆ స్థూలకాయుడు ఆరోజే హెడ్ మాష్టరుకు వుత్తరం రాశాడు. ఫలాన రామయ్యని ఆ స్కూలులో పంతులుగా వేసినట్లు వెంటనే అతనిని పనిలోకి తీసుకోమని.

రామయ్య సంతోషంతో ఇంటికి వచ్చి అన్నవదినలకు జరిగిన సంగతినంతా వివరించాడు. గబగబా రెండుమెతుకులు నోట్లో వేసుకుని తిరిగి వెంటనే తెనాలికి బయలు దేరాడు.

మరుసటి రోజు సోమవారం హెడ్ మాష్టరుగారి గదిలోరామయ్య ప్రత్యక్షంఅయి అయ్యా అన్నాడువిజయ గర్వంతో. హెడ్ మాష్టరు రామయ్యని చూస్తూ "నువ్వా మరలవచ్చావా" అన్నాడు తెల్లమొహం వేసి దిగాలుగా చూస్తూ,

"అవునండీ వచ్చా. కాని పాపం మీ మేనమామ కూమారుడు బావమరిదిని డిస్మిస్ చేశారేఅని విచారం" అన్నాడు వెటకారంగా.


"నోరుముయ్యి అసలు నీకు ప్రెసిడెంటు ఎలా తెలుసు?"

"నాకు తెలియక పోవటమేమిటి. నేను ప్రెసిడెంటు మేనమామకు సయాన మనుమణ్ణి" అంటూ హాజరు పట్టీలో సంతకం పెట్టాడు. "అయ్యా మరొక చిన్న విషయంగూడా వుంది తమరితో చెప్పటానికి మరిచా. మాతాత నాకు హెడ్ మాష్టరు వుద్యోగం గూడా ఇస్తానని చెప్పాడు" అంటూ క్లాసుకు బయలు దేరాడు. విజయ గర్వంతో.

పిల్లలగోల విపరీతంగా వుంది. రామయ్య క్లాసులోకి అడుగు పెట్టాడు. ఎక్కడ వాళ్ళు అక్కడే కుక్కిన పేనుల్లా కూర్చున్నారు.

"మొన్న మీకు ఏమి పాఠం చెప్పాను? భూమి గుండ్రంగా వుందని గదా. ఇపుడు ప్రత్యక్షంగా తెలుసుకొండి నేను యిచ్చట నుండి మూడు రోజులక్రితం బయలుదేరి మరల యిచ్చటికేవచ్చా ఎందు వలన? భూమి గుండ్రంగా వుండబట్టే."

పిల్లలకు పాఠం అర్థమయినట్లు సంతోషంతో కేరింతలు కొట్టారు. ★



బాలరాజ్యం

మమకారం

శ్రీ బి. వి. నరసింహారావు, బి.ఏ.. బి.ఇడి.

పిల్లలంటే
పిందెలంటే
నవ్వులొలికే
పువ్వులంటే,
ఎంత మమకారం! ఆహా!
ఏమి చెప్పను; మీనాక్షికి !!!

మీనాక్షి పెరటిలో చెట్టున కాసిన పిందెలవంక అదే పనిగ చూస్తూవుంటుంది. చెట్టునున్న పిందెలకంటే, నేలరాలిన పిందెలనే ఎంతో బెంగతో చూస్తూవుంటుంది.

ఆమెకు తొలికాన్పులో ఒక బిడ్డ పుట్టి పురిటిలోనే పోయాడట: మలికాన్పులో పుట్టిన బిడ్డ ఒక ఏడాదివఱకు పెరిగి పోయాడట. అప్పటినుంచి మీనాక్షి ఆదోలాగ మారిపోయింది.

పెరటిలోవున్న మొక్కల్ని ఎంతో ప్రేమతో పెంచుతూ వుంటుంది. ఏదైన చిన్న మొక్క ఒకటి చచ్చి పోయిందంటే, ఆమె విచారం ఇంతింతని చెప్పడానికి వీలులేదు. మొక్కలన్నీ పూతపెట్టి, కాయలుకాయడం ప్రారంభిస్తే, ఆమె ఆనందానికి అంతుండదు.

ప్రతిరోజు ప్రక్కింటివారి కుక్కపిల్ల ఒకటి భోజనాల వేళకు వస్తూవుంటుంది. దానికి మీనాక్షి యింత తిండి పడవేయడం. అది తిని సంతోషంగా తోకాడించడం. అలవాటైపోయింది.

ఇలా మొక్కలమీద, కుక్కలమీద మమకారం పెంచుకుంటున్న సమయాన, పట్నానికి బదిలీ చేశారన్న పిడుగులాంటి వార్త మీనాక్షికి భర్త వినిపించాడు.

"అయ్యో! అలవాటైన వూరు విడిచిపెట్టి ఎలాగ వెళ్ళిపోవడము?" అనిపించింది మీనాక్షికి. ఆమె భర్తతో అన్నదికదా "ఏమండీ! పక్కింటివారు ఆ కుక్కపిల్లను మనకిస్తామంటున్నారు పెంచుకోవడానికి. దాన్ని మనతో కూడ తీసికెళదాం. మనతోపాటే యింత తింటుంది; ఉంటుంది."

ఆ మాటలకు భర్త కస్సుమని, "వెధవసంత! ఎందుకా కుక్కపిల్ల మనకు? పదిచోట్ల తిరిగేవాళ్ళకి ఒక గుదిబండలాగ! వద్దు!" అని నిష్కర్షగా చెప్పేశాడు. ఇక మీనాక్షి ఏమనలేక కుక్కపిల్లను తలుచుకొని లోపల ఎంతో కుమిలిపోయింది.

పట్నంలో చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నారు. వెళ్ళిన రాత్రి మీనాక్షికి కొత్త యింట్లో నిద్రే పట్టలేదు. తాను పడుకొన్న గది ప్రక్కనే ఒక మాలతి తీగ గుబురుగా ప్రాకి పూలు పూచివుంది. ఆ పూలమీదనుంచి వచ్చే గాలి మీనాక్షికి కొంచెం హాయినిచ్చింది.

మామూలుగా మీనాక్షి కొంచెం ప్రొద్దెక్కి లేవడం అల వాటు. రాత్రి విచ్చిన మాలతి పువ్వులన్నీ తాను నిద్ర నుండి లేచి చూసేసరికి కనబడేవికావు. ఏమయి పోయేవో తెలిసిందికాదు. పనిచేసే పిల్లను పిలిచి, మీనాక్షి, "ఏమే! మాలతిపువ్వులను ఎవరు కోసుకు పోతూవుంటారు?" అని అడిగింది.

"పక్కింటి శాస్తుర్లుగారు కోసుకెళుతూంటారండీ!" అంది పనిపిల్ల.

"చక్కగా చెట్టున పూసిన పువ్వులను ఎందుకు కోసుకువెళ్ళడం? ఈసారి ఆయనగారు పువ్వులుకోయడానికి వచ్చినపుడు నాతో చెప్పు" అని ఏర్పాటుచేసింది మీనాక్షి.

మరునాటి ఉదయం బ్రాహ్మడు పువ్వులు కోయడానికి రావడం తెలుసుకొని, మీనాక్షి "ఏమండీ! చెట్టునున్న పువ్వులు ఎందుకు కోసుకువెళుతుంటారు?" అని అడిగింది.

"అమ్మా! స్వామి పూజకోసం" - అని ఆ బ్రాహ్మడు బదులు చెప్పాడు. మనకోసం యిచ్చిన పువ్వులు భగవంతుడు తనకోసం కావాలంటాడటండీ?" అంది మీనాక్షి.

"బాగుంది మీ వరస. నాకు పెద్ద విషయం చెప్పడానికే పూనుకొన్నారు! ఈ యిల్లు అద్దెకు ఏర్పాటు చేయించి పెట్టింది నేను. ఈ యింటి అజమాయిషీ అంతా నాదే. అడగండి కావాలంటే మీవారిని. మీకీపూల చెట్ల ప్రసక్తేమీ లేదు" అంటూ పూలురాల్చుకొని, సజ్జలో వేసుకొని తన దారిని తాను వుడాయించాడు బ్రాహ్మడు.

మీనాక్షి గుండె గతుక్కుమంది. తీగను నిర్దయగా పట్టుకొని, పూలకోసం బ్రాహ్మడు గట్టిగా వూపుతుంటే మీనాక్షి ఎంతో బాధపడింది. కన్నీళ్ళు తెచ్చుకుంది. పూలు పోగొట్టుకొని అందవిహీనమైపోతున్న మాలతీ తీగను చూడడం మనసొప్పక మీనాక్షి తన మంచం ప్రక్కగదిల్లోకి మార్చుకుంది.

ప్రక్క గది కిటికీలోంచి చూస్తే ఒక జమీందారుగారి నాలుగంతస్తుల పెద్దమేడ, విశాలమైన దొడ్డి కనబడుతుంది. ఆ దొడ్డిలో జమీందారుగారి బుజ్జిబాబుని, పని పిల్లలు ఆడిస్తూవుంటారు. ఆ పిల్లవాడు కేవలం ఒక బంగారు బొమ్మలా ముద్దులు మూట కట్టినట్టుంటాడు. మీనాక్షి మొదటిసారి ఆ పిల్లవాణ్ణి చూసి మైమరచి పోయింది. ఒక్కసారి ఆ బాబుని ఎత్తుకోవాలని, ముద్దులాడాలని ఉబలాటపడింది.

భర్త సాయంకాలం ఆఫీసునుండి రాగానే, మీనాక్షి అతనితో "ఏమండీ! ఆమేడవారి బాబుని చూశారా? ఎంత ముద్దొస్తున్నాడనుకున్నారు! ఎలాగైన ఒకసారి ఆ బాబుని మన యింటికి, అడిగి, తీసుకువద్దురు. ఎత్తుకోవాలనివుంది" అని తన కోరికను వెళ్ళడించింది.

ఆ మాటలు విన్న భర్త "బాగుంది! చాలబాగుంది!! నీ కన్నీ విడ్డూరమైన కోరికలు కలుగుతూవుంటాయి. బోడి గుమాస్తాగాడిని నేను వెళ్ళి, 'అయ్యా! మీ కుర్రవాణ్ణి ఒకసారి యిలా యిప్పించండి. మా ఆవిడ ఎత్తుకుందామని చాలా సర్దాపడుతోంది' అని అడిగిరానా? చాలు, చాలు. ఇలాంటి పిచ్చికోరికలు కాస్త కట్టిపెట్టు" అని గట్టిగానే మందలించాడు.

మీనాక్షి బిక్క చచ్చింది. కిక్కురుమనకుండా వూరుకుంది. కాని లోపలున్న కోరికమాత్రం చావలేదు. "పిల్లల మీద ప్రేమవిషయంలో జమీందారులని, సామాన్యులని తేడాలుంటయ్యా?" అని తనలో తాననుకొంది.

మరునాడు మీనాక్షి ఒక అణా పిప్పరమెంట్లు తెప్పించి, భర్తను ఆఫీసుకు వెళ్ళనిచ్చి, పనిపిల్లద్వారా అవి ఒంటరిగా దొడ్డిలో ఆడుకుంటున్న మేడవారి బాబుకి, యిమ్మని పంపించింది. పిల్ల వెళ్ళి బిళ్ళలు బాబుకిస్తుంటే, చూచి, మీనాక్షి పట్టరాని సంతోషం పొందింది. కన్నుల్లో ఆనందాశ్రులు చిందింది

గుమాస్తాగారు సాయంకాలం ఇంటికి యింత ముఖం చేసుకొనివచ్చారు. భార్యవంక చూసి "ఏమిటీ గొడవ? పనిపిల్లనెవరు పంపించారు జమీందారుగారి ఆవరణలోకి? వాళ్ళ అబ్బాయికి పిప్పరమెంటు బిళ్ళ లిచ్చిరమ్మని పిల్లను పంపించింది నువ్వేనా? దానికి వాళ్ళకెంతో ఆగ్రహం వచ్చింది. ఇలాంటిది తిరిగి జరిగితే పిల్లను పోలీసుల కప్పగిస్తామన్నారు" అని ధుమధుమలాడాడు.

మీనాక్షి కళ్ళు నీళ్ళతో గిర్రున తిరిగాయి. పిల్లవాడి చేతిలోని బిళ్ళలు లాగిపారేసి, పుచ్చుకున్నందుకు వాళ్ళు అతణ్ణి రెండు లెంపకాయలుకూడ వెయ్యడం మీనాక్షి తన కళ్ళారా చూసింది. భర్త వచ్చి తాను చేసినపని చాల తప్పని అన్నప్పుడు ఆమెకు చెప్పలేని బాధ కలిగింది.

"నే నీ వూళ్ళో యింక వుండలేను మరొక వూరికి బదిలీ చేయించుకొండి. పోదాం" అంటూ అక్కడ నిలబడలేక గదిలోకి వెళ్ళిపోయింది మీనాక్షి.

ఎంత మమకారం — ఆహా!
ఏమి చెప్పను — మీనాక్షికి!!
పిల్లలంటే
పిందెలంటే
నవ్వులొలికే
పువ్వులంటే——"

★ ఎవరెట్లాపోతేయేం ★

శ్రీమతి కె. పార్వతీ దేవి

వెంకాయమ్మ : ఓహో ! వదినగారా ! రండి ! రండి ! ఇప్పుడే ఇంత అన్నం తిని మీమాటే అనుకుంటున్నాను. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లు మీరే వచ్చారు.

దుర్గమ్మ : ఆఁ .... అనుకుంటారు. అనుకుంటారు.... అనుకోరుమరీ. నేను కాలుకాలిన పిల్లిలాగా ఎప్పుడూ తిరుగుతాను.

వెం : అదేమిటి దుర్గమ్మొదినా - నాసంగతి ఎరగనట్లంటావు. నీదగ్గరకు వద్దామని అనుకుంటానుగాని - తీరికెప్పుడు చెప్పు....నిద్రలేచింది మొదలు పడుకునే వరకూ ఒకటే చాకిరి.

దు : సరి సరి బాగాచెప్పావొదినా. ఇంతకూ నేనేనా కూర్చుని తినేది. రోలు పోయి మద్దెలతో మొరపెట్టినట్లుంది నీవరస.

వెం : దుర్గమ్మొదినా ! నీ కోడలు మంచిదని విన్నాను. ఆమె అమ్మగారు ఇంత ఉన్నవారటగా. కాస్తో కూస్తో మీచేతి కందిస్తారా ?

దు : ఇదిగో.. నీకు తెలియదేమోకాని వాళ్ళను భాగ్యవంతులంటారేకాని ఇంటిచుట్టూ, ఊరినిండా అప్పులే. పైపై షోకులే. ఇంట్లో చూస్తే ఏమీలేదు. ఇంట్లో ఈగల మోత - బయట పల్లకీల మోత.

వెం : ఇంతేనా...మీ కోడలు మహా యిదిగా చెప్పుకుంటుందేం మరి. మాటల్లో మరచాను. ఇంకా రంగమ్మ రాలేదే....ఆమెకేమిటి? కొడుకు మంచివాడు. కోడలు మంచిది. ఆమె మాట ఇద్దరూ వింటారు. ఇంతకూ ఆమె అదృష్టం బాగుంది. అదిగో మాటలోనే వస్తున్నది.

రంగమ్మ : ఏమిటీ యిద్దరూ ఏమిటోమాట్లాడుతున్నారు? ఎంతయినా వదినా మరదళ్ళుకదూ ! నేనేగా పరాయిదాన్ని. అదే పెద్దలంటారు. పిలవని పేరంటము చెప్పని ఒక్క పొద్దని.

వెం : ఇది మహాబాగుంది. వొస్తూవొస్తూనే వడ్డిస్తున్నావు. దయచేయండి !

రంగ : ఏమమ్మా ! వెంకాయమ్మా ! ఇవ్వాళ ఏమిటి విశేషం—ఇట్లా శుభ్రంచేసి గడపకు పసుపు కుంకుమ పెట్టావు ?

దు : నీకు యింకా తెలియదా రంగమ్మా ! మన వెంకాయమ్మకు కోడలు రాబోతోంది !

రం : వెంకాయమ్మకేమి- కొడుకు మంచివాడు. తెలివిగలవాడు, నాలుగు రాళ్ళు సంపాదించుతాడు. రేపు పదివేల కట్నంతో రాబోతోంది కోడలు.

దు : సరేకాని రంగమ్మా ! మీయింటి ప్రక్క ఉన్న సురేశంగారింట్లో ఏమిటి గోలగా అరుస్తున్నారు !

రం : అది ఒక నాటకంలే దుర్గమ్మా ! ఆ సురేశం లేడూ వాడి కూతురు సరళ....

వెం : ఆఁ....చెప్పు....చెప్పు ....సరళ ఏంచేసింది. ఆ సురేశంగతి అట్లానేకావాలి. మహానీలుగుతున్నాడు. అదేదో కాస్త చెవిన వేస్తూ.

రం : నాకెందుకమ్మా. అక్కడ పడ్డదంటే యిక్కడ పడ్డదంటారు. వినేవాళ్ళు వింటారు. చివరకి నామీదకు వస్తుంది.

దు : నడె నడె చెపుదూ. నీవు చెప్పినావని వాళ్ళనుపోయి అడుగుతామా !

వెం : అదేమిటి రంగమ్మా ! ఎన్నడూ ఎరగనట్లు మాట్లాడుతున్నావు. ఒకరి సంగతి మన కసలే అవసరం లేదుగదా ! ఎందుకంత భయం ?

రం : విన్నది విన్నచోటనే మరచిపోవాలమ్మో. లేకపోతే కొంపలంటుకుంటవి.

వెం : చెప్పమ్మా చెప్పు....ఈనాటికి మమ్ములనుకూడా అనుమానిస్తున్నావు.

రం : ఆఁ....సరళ అత్తవారింటి కెళ్ళింది. అక్కడివాళ్లు కాస్త శుద్ధిగా మడిగట్టుకొని వంట చేసుకుంటారట. ఈమె గారిని వంట చేయమంటే నేనైతే తడిచీర కట్టుకోను. ఇస్త్రీ చీరతో చేస్తానంటుందిట. పైగా శుద్ధిగా ఉండాలికాని, ముండాచీరలెందుకంటుందట.

వెం : అయ్యో అయ్యో అదేమిరాతో. దానిమడి మంట కలవ. అంత రాటుతేలిందమ్మ !

రం : అంతేనా — మామగారు వస్తే మంచం దిగదట.

అత్తగారిని అసలే లక్ష్యపెట్టదు. సినిమాకని షికార్లకని మొగుణ్ణి వెంటేసుకుని తిరుగుతుందిట. ఆ అత్త పాపం చాకిరీ చేయలేక చచ్చిపోతుంది.

దు : ఏమోనమ్మా - మన కాలంలో అలా బయటికి వచ్చేవాళ్ళమా ? ఏదో హరికథా కాలక్షేపానికి పోయే వాళ్ళంకాని- మా మామగారిని, అత్తగారిని దేముళ్ళ లాగా చూచుకున్నాము. ఈపాపిష్టి బుద్ధులు మాకులేవు.

వెం : దానితరువాత చెప్పనీయవే దుర్గమ్మా !

రం : తరువాత ఇక్కడినుండి అక్కచెల్లెళ్ళు తమ్ముళ్ళు మాటి మాటికి పోవటం అక్కడ తిష్ఠవేసుకొని కూర్చోటం. ఈమెగారేమో పిండివంటలు చేసి పెట్టటం. ఎవ రూరుకుంటారు. వాళ్ళమామ ఏదో అంటే ఈమెగారికి ఎక్కడలేని కోపమొచ్చి ఇక్కడ కొచ్చింది. వచ్చిన తెల్లవారే మామవచ్చి మీ యిష్ట మొచ్చినట్లే నడుపుకోండి. రమ్మన్నాడట. ఆసురేశం, వాడి పెళ్ళాం ఆ ముసలాయన్ని నానామాటలన్నారట.

రామం : (ఇంట్లోనుండి వచ్చి) ఏమండీ దుర్గమ్మ గారూ ! మీసంగతి నాకు తెలియదా. మీ మామకు కూడు పెట్టక ఏడిపిస్తే కూతురు దగ్గరకెళ్ళలా ! యిక ఈరంగమ్మగారా-మొగుణ్ణి నేలపెట్టి కాలరాసింది. ఆయన పరువుకు వెరిచే మనిషికాబట్టి ఈమెకాళ్ళను కూడా పట్టాడు. ఈమె తమ్ముడూ చెల్లెలు మొన్నటి దాకా ఇక్కడే మేసిపోయిరే.

రం : ఏమమ్మా వెంకాయమ్మా ! మీయింటి కొచ్చినందు కిదా మర్యాద. మీరామం చాలా గడుసువాడే !

వెం : ఆఁ వాడికేం తెలుసండి పిల్లవాడు ?

రా : ఎందుకు తెలియదూ ! మా అమ్మమాత్రం తక్కువా ! మా మేనత్తలొస్తే పనిచేయకుండా బిర్రబిగుసు కొని పడుకొనేదికదూ !

రం : నిజమేలే. ఎవరెట్లాపోతేయేం. వెళుతున్నాను వెంకాయమ్మా.... రాత్రి పురాణానికి వస్తావా ?

రా : పురాణంలేదు. గిరాణంలేదు. యిదొక వంకపెట్టుకుని అందర్నీ తూరుపారపోస్తారు. మళ్ళీ వచ్చారా.... నేనూరుకోను.

★

రాజీనామా ★

రచన :
'సుజనశ్రీ'

కమల సున్నితమైన వ్రేళ్ళు టైపుమిషనుమీద నాట్యం చేస్తున్నాయి. ఆమె వయస్సు 20 ఏండ్లు ఉంటాయి. వయసుకు తగిన అందం, అంగసౌష్టవం కలది. ఆమె ఆ కంపెనీలో చేరి మూడు మాసాలే అయినా అందరి చేతా మంచి దనిపించుకున్నది. పనిలో చురుకుతనం, నేర్పరితనంతో మేనేజరు మెప్పు సంపాదించింది. కాని ఆమెకున్న ఇబ్బందల్లా ఒక్కటే, ఆమె ఇల్లు షా & కంపెనీకి చాలా దూరంలో వుంది. బస్సులో ఎప్పుడూ రద్దీగా ఉండేది. ఆమె ఉదయం ఏడున్నరకే బస్సు స్టాండుదగ్గర నిలబడ్డ రోజులుగూడ చాల ఉన్నాయి. సాయంత్రం పూట మేనేజర్ శేఖర్ తనకారులో ఆమెను ఇంటిదగ్గర దిగవిడిచి వెళ్తుండేవాడు.

శేఖర్ అవివాహితుడు. వయస్సు 25 ఏండ్లు ఉంటాయి. అందగాడు. మంచీ, మర్యాద తెలిసినవాడు. ఎన్నో రోజుల్నుంచి అతడు కమలను ఆమె ఇంటిదగ్గర విడిచి వెడుతున్నా ఒక్కరోజునన్నా అసభ్యంగా ప్రవర్తించి ఉండలేదు.

ఒకరోజు సాయంత్రం ఇద్దరూ మామూలుగా కారులో వెళుతున్నారు. ఆ సాయంసమయం ఎంతో అందంగానూ, శోభాయమానంగాను ఉంది.

"మనోహరంగా ఉందికదూ ఈ సాయంకాలం!" అన్నాడు శేఖర్. కాని కమల ఏదో ఆలోచనలో ఉండిపోయింది. అందువల్ల శేఖర్ మాటలు ఆమెకు వినిపించలేదు. శేఖర్‌గూడ మళ్ళీ మాట్లాడలేదు. కారు ఆఫీసునుంచి చాలాదూరం వచ్చేసింది. శేఖర్ మౌనాన్ని సహించలేకపోయాడు.

"ఏమిటి కమలా ఆలోచిస్తున్నావ్?

"అబ్బే మరేంలేదండీ! ఏదో ఇంటి విషయం!"

"మన ఇంటిచుట్టూ ఉన్న ప్రకృతి శోభాయమానంగా ఉంది. కాని నీవు దీర్ఘాలోచనలో ఉన్నట్టున్నావు. నేనేమైనా సహాయం చెయ్యదగినదైతే తప్పక చేస్తాను. చెప్పు అదేమిటో?" ఇంతలో కమల యిల్లు వచ్చేసింది.

"థ్యాంక్‌యూ సర్!" అంటూ వెళ్ళిపోయింది.

మర్నాడు సాయంత్రం శేఖర్‌కు కమల అవుపడలేదు. ఆమె అంతకుమునుపే బస్సులో వెళ్లిపోయిందని ప్యూను చెప్పాడు. శేఖర్‌కు విచారం కలిగింది. "బహుశా నేను నిన్న సాయంత్రం అన్న మాటల వల్ల ఆమె బాధపడి, నన్ను చూట్టానికిష్టంలేక వెళ్లి పోయినట్లుంది. రేపు ఆమెకు క్షమాపణ చెప్పుకోవాలి!" అని మనసులో అనుకున్నాడు. ఆ రాత్రి అతనికి సరిగా నిద్ర పట్టలేదు. ఏదో తీరని ఆవేదని అతన్ని బాధించ సాగింది.

మర్నాడు ఆఫీసుకు వెళ్లేసరికి అతని టేబుల్‌మీద కమల పంపిన లీవ్ లెటర్ కనపడింది, శేఖర్ మరీ విచారించాడు.

"బహుశా ఆమెను ప్రేమిస్తున్నానని, నన్ను వివాహమాడటం ఇష్టంలేక ఇలా లివు పెట్టి వేరే ఇంకో ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నదేమో! ఆవేళ ఆమెతో అలా మాట్లాడడం ఎంత పొరపాటయింది. నామూలంగా ఆమె ఉద్యోగం వదలుకుని ఇలా బాధ పడాల్సి వచ్చిందే!" అని అనుకున్నాడు.

ఆ మరుసటిరోజు ఆఫీసు కిటికీలోంచి కమల రాకకోసం నిరీక్షించసాగాడు. కొంచెం సేపటికి కమల గేటుదగ్గర ప్రత్యక్షమయింది. ఆమె ముఖంలో మచ్చుకైనా ఒక విచారరేఖ కనపడలేదు. పైగా రోజూకంటె ఇంకా ఎక్కువగా టాయిలెట్ అయినట్టుగా కనిపించింది ఆమె. శేఖర్ హృదయం పరవళ్ళుత్రొక్కింది ఎందుకో. తర్వాత తనముందున్న కాగితాలు తీసి చూడసాగాడు. ఆఫీసంతా నిశ్శబ్దంగా ఉంది. పది నిమిషాలు గడిచినయ్. కమల టైపుచప్పుడు ఆఫీసులోని నిశ్శబ్దాన్ని తరిమేసింది.

"ప్యూన్!" అన్నాడు శేఖర్.

"సార్!"

"కమలమ్మగార్ని ఇటు పిలు!"

"గుడ్‌మార్నింగ్ సార్!" అంటూ కమల చిఱునవ్వుతూ గదిలో అడుగు పెట్టింది. శేఖర్ తన మనసులో విషయాన్ని చెప్పటానికి సందేహించాడు. ఏదో ఫైలు తీసి అందులో ఉత్తరాల్ని టైపు చెయ్యమని కమలకిచ్చాడు.

ఏడు గంటలకు కుర్చీలోంచి లేచి కారు స్టార్ట్ చేశాడు శేఖర్. కమల గేటుదగ్గర నిలబడి ఉంది. ఆమెను కారులో ఎక్కించుకుని వేగాన్ని హెచ్చించాడు. శేఖర్.

"ఈరోజు సాయంకాలం చూడండి ఎంత మనోహరంగాఉందో!" ఈ తడవ కమల అన్నది. శేఖర్ మూగివానిలా కూర్చుండిపోయాడు. ఆమెకు ఎలా చెప్పాలో

ఆలోచిస్తూ, మళ్ళీ అదే ప్రశ్న వేసింది కమల. శేఖర్ జవాబివ్వలేదు. ఇంతలో కారు ఒక పార్కును సమీపించింది.

"ఈ పార్కులో కాసేపు కూర్చుందామా?" అని అడిగింది కమల. మౌనంగానే కారుని ఒకమూల ఆపాడు శేఖర్. ఇద్దరూ పచ్చగడ్డిమీద కూర్చున్నారు.

"ఈ సాయంకాలం బాగుంది కదూ!" అన్నది కమల మళ్ళీ. శేఖర్ వ్రేళ్ళు నేలమీద గడ్డిని పీకుతున్నాయి. అతని ముఖం వివర్ణమైంది. పెదవులు వణుకుతున్నయ్, ఆమె ముఖంలోకి చూశాడు. ఆమెముఖంలో చిఱునవ్వు తాండవ మాడుతూంది.

"ఆ రోజు నా కోసం ఆగకుండా వెళ్ళిపోయి మన్నాడు లీవుకప్లయి చేశావేం కమలా?" చివరకు ఎలాగో అడగ్గలిగాడు.

"ఆ....అవును! ఆ రోజు మా పిన్నిగారింటికి వెళ్లా లనుకున్నాను. వాళ్ల ఇల్లు ఆఫీసు నుంచి ఇరవై మైళ్లుంది. అంత దూరం తీసుకెళ్లమని మిమ్మల్నడగలేక బస్సులో వెళ్లాను, తీరా వెళ్లేక మా పిన్ని మరునాడు గూడా ఉండమని బలవంతం చెయ్యడం వల్ల ఉండి పోయాను"

"అందుకా?" అని శేఖర్ ఆశ్చర్యంగా ఆమె కళ్ళలోకి చూశాడు ఆమె కళ్లు చిలిపిగా నవ్వినయ్. శేఖర్ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. కమల కిలకిల నవ్వింది.

"కమలా! నువ్వు రేపే నీ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చెయ్యి. లేకపోతే నిన్ను డిస్మిస్ చెయ్యాల్సివస్తుంది."

"ఏమిటీ? మీరంటున్నది నాకర్థంకావటం లేదు!" అన్నది కమల భయాశ్చర్యాలతో.

"అయితే విపులంగా చెబుతాను విను, వచ్చే వారం మన వివాహం జరగాలి. నా భార్య టైపిస్టుగా పని చేస్తున్నదని ఎవ్వరూ చెప్పుకోవటానికి వీల్లేదు. అదీ సంగతి. అర్థం అయిందా ఇప్పుడు!" అన్నాడు శేఖర్.

సందేశము

శ్రీ శిష్టా కోటీశ్వరరావు

చ॥ జిలిబిలి పల్కులన్ జిలిపి
చేష్టల నందము తూఁగియాడఁగాఁ
గలకల లాడుచుం బెరిగి,
గంతులు వేయుచు నాటపాటలన్
వెలుఁగులఁ జిమ్మి, శైశవపు
వెల్లువలోఁ దలమున్కలై చి, విం
తలుపచరించి, కూర్చితే ము
దంబును దల్లికి **బాలికామణీ!**

మ॥ చిఱునవ్వుల్ మొలకెత్తి వెన్నెలరు
చిన్ జిందింప, జూపుల్ మనో
హారముల్ లోఁగొన, దల్లిదండ్రులకు
నత్యంతంబు గారాబుకూ
తురవై విద్యలనేర్చినావు; గుణసిం
ధుత్వంబు సచ్ఛీలమున్
మెఱుఁగుల్ దిద్ది మెలంగినావుగద! తా
ల్మిన్ మేటివై **బాలికా!**

ఉ॥ అన్నలు తమ్ములున్ జదువు
లన్నియు నేర్చుచునుండి రంచు, నీ
కెన్నఁగ స్వేచ్ఛ లేదనుచు
నెంతువు; ధర్మమె? భారతావనిన్
మున్ను శ్రుతిస్మృతుల్ చదివి
మోదమెలార్పరె మానినీమణుల్?
విన్నదనమ్ము వీడుము,
వివేకము శీలముఁ బెంప **సోదరీ!**

తే॥ ఎన్నొ వందలయేండ్లుగా నెదురులేక
తురకలాదిగ రక్కసుల్ దోచుకొనఁగ
నాశమయ్యెను మనదు విజ్ఞానవిభవ
మకట! పురుషుల నిందింపన్యాయమగునె?

సీ॥ వేదవిద్యల యందు వినుతి కెక్కఁగలేదె?
మైత్రేయి గార్గియున్ మహిళలయ్యు,
ఘోరారి సేనతోఁ బోరుసల్పఁగలేదె?
మొనసి సత్యాదులు వనితలయ్యు,
భయదంపుటబ్ధులన్ బయనింపఁగా లేదె?
సంఘమిత్రాదులు సాధులయ్యు,
ప్రజలు మెచ్చఁగ నాంధ్ర రాజ్యమేలఁగలేదె?
రాజ్ఞి రుద్రమదేవి రమణియయ్యు,


గుణము శీలమ్ముఁ బ్రబల శక్తులనుగూడి
రూపు దాల్చిన చందాన రూపు మెఱసి

విక్రమించిరి యానాడు వీరవనిత
లట్టి భారత సంస్కృతి కంజలింతు ॥

ఉ॥ భారత సంస్కృతిం దలచి
పావనశీల విభూతి యాంతగా
చేకిచి యర్హావిద్యలను,
నీతి పథంబున సంచరింపుమో

భారత సోదరీ! కుమత
వాదములన్ విడనాడి జాతికిన్
గౌరవమున్ ఘటింపుము; జ
గంబున నింపుము కీర్తి చంద్రికల్ ॥

★



శ్రీలాల్ - బెనారస్

కృతజ్ఞత

శ్రీలాల్—వీరు బెనారస్ రైల్వే ఉద్యోగస్థులలో ఒకరు. మొన్న మన విద్యార్థినులు పరీక్షకై కాశీ వెళ్ళినప్పుడు వీరెంతో సహాయపడి ఎన్నో సదుపాయములు చేశారు. అసలు వీరు క్రొత్తగా కాశీ వెళ్ళి వారి సహాయము కోరేవారందరికీ సహాయపడి వారికి సదుపాయము లొనగూర్చటము అలవాటు! వారు మా విద్యార్థినులకు చేసిన సహాయమునకు మా సభ తరపున కృతజ్ఞతాభివందనములు.

—కార్యదర్శినులు.
(ఆ. మ. సభ)

ఆంధ్రమహిళా సభ

ఫిబ్రవరి హిందీ పరీక్షలలో


ఈదిగువ విద్యార్థినులు ఉత్తీర్ణులైరి

మధ్యమ

మాలతీఖాండ కే	....	ఫస్టుక్లాసు
ఎస్. ఆర్. ఇందిర	....	సెకండుక్లాసు
ఎమ్. ఎన్. సుమతి	....	సెకండుక్లాసు

ప్రాథమిక

రుక్మిణీరమణి	...	ఫస్టుక్లాసు



పంచామృతము

(కావ్యసంపుటి)

రచయిత్రి: యం. ఆదిలక్ష్మి

వెల: 1. 50

ప్రాప్తిస్థానం: యమ్. ఆదిలక్ష్మి.
15, ముజఫర్ జంగ్ బహదూర్ వీధి.
టిరువళిక్కేని. మద్రాసు 5.

తెలుగు భాషా పరిశోధనలో అమితోత్సాహం కల రచయిత్రి, తన రచనలలో దానిని ప్రకటించడం సహజమే. "అమృతరసమును వర్షించు నాంధ్రసాహిత్యోద్యానములో ప్రసిద్ధులగు మహాకవులు, కవయిత్రులు కవితావల్లరుల బ్రోది చేసిన కావ్య కుసుమ సౌరభములే కవిత్వరచనను పురికొల్పును" అంటూ కవయిత్రి తన భరతవాక్యంలో చెప్పుకొన్నారు. అటువంటి మహోత్తమ రచనలను చదివే అవకాశం, వాటిని చదువుటవల్ల రేగిన భావాలను పద్యరూపంలో పొదిగించాలన్న అభినివేశం ఒకేసారి గుమిగూడి యీకావ్యసంపుటిగా రూపందాల్చాయి రచయిత్రికి గురువర్యులు పండిత కవివతంసులు పరిశోధనాచార్యులు శ్రీ నిత్య స్మరణీయులు అయిన శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు యీ కావ్యసంపుటికి ఆ ముఖము చిత్రించారు. అందు రచయిత్రిపై వారికిగల అభిమానగౌరవాలు విశదం అవుతాయి. ఈ గ్రంథం వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలరు శ్రీ యస్. గోవిందరాజులనాయుడుగారికీ వారి సతీమణికీ కలిసి అంకితం యివ్వబడింది.

తిమ్మక్క, లీలావతి, రుద్రమ, మొల్ల, వెంగమాంబలను గురించిన పద్యాలసంపుటి. యీ కావ్యసంపుటి ఛందోబద్ధ కవిత్వం బహుళప్రచారంలేని యీ రోజులలో యిటువంటి రచనలు మొలచి తిరిగి వాటిపై వుత్సాహం జనింప చేస్తాయేమో చూడాలి. కవితా రచన రీతిలో 'పాత' ననుసరించిన కవయిత్రి ఉపయోగించిన కవి సమయాలు, కల్పనా కూడ పాతవిలాగే అక్కడక్కడ ధ్వనిస్తాయి. మొత్తానికి, కవిత్వం రాయాలన్న వుత్సాహము తెలుగు భాషలో ప్రజ్ఞా కలిగిన రచయిత్రి రచనలలో కూడా కన్పిస్తాయి అవి.

"భాషాభిమానుల" కై రచింపబడిన యీ గ్రంథం రూపాయన్నర పెట్టడంలో ఔచిత్యలోపం జరగలేదు.

—రామలక్ష్మి ఆరుద్ర.

మాలతి

సాంఘిక కథాద్వయసంపుటి. రచన:– శ్రీ పులిపాక జగన్నాథరావు, ఆంగ్ల భాషాశాఖ, హిందూకళాశాల, గుంటూరు: పోకెట్ సైజులో 24 పేజీలుగల యీ పుస్తకంవెల నాలుగణాలు.

ఈ చిన్న సంపుటిలో 'నిర్మల' 'మాలతి' అనే రెండు చిన్న కథలున్నాయి:

వేర్వేరు అంతరాలకి చెందిన ప్రేమికుల గాధలు ఇవి. భాష, భావాలూ సామాన్యులకు అతీతం.

శ్రీరామానుజ కీర్తికౌముది

మొదటిభాగము

సంపాదకులు: ధనకుధరం వరదాచార్యులు.

ప్రకాశకులు: వైద్యవిద్యా సంస్థానము.

ఆలపాడు వయా తెనాలి

వెల 1-4-0

విశిష్టాద్వైత జీవాతువగు శ్రీ భగవద్రామానుజుల సిద్ధాంత కౌముదిని ప్రపంచమున ప్రసరింపచేయుటకు ఉద్దేశింపబడిన ఈ గ్రంథమునందు వేర్వేరు భక్తులచే రచియింపబడిన ఆరు శీర్షికలు కలవు.

శ్రీరామానుజులవారి జీవిత విశేషములతో పాటు భారత దేశమునగల వివిధ మతముల విశిష్టతను గూర్చి, దేశమున వారికిగల ప్రాబల్యమును గూర్చి, విశిష్టాద్వైత మత పరిణామమును గూర్చి ఇందు విపులముగా చర్చింపబడినది. ద్వైతాద్వైతములకు భేదము లేదనియు పూర్వావతారమున శంకరాచార్యులు కావించిన జ్ఞానయోగ ప్రచారములో ఉత్తరావతారవమైన రామానుజాచార్యులు భక్తిమార్గమును, అంతకంటే విలక్షణమైన ప్రపత్తి మార్గమును బోధించెననియు, ఇందు సుబోధకము కావింపబడెను.

శ్రీ రామానుజులు భాష్యకారుడు, మతకర్తయేకాక గొప్ప సంఘ సంస్కర్త అనియు, జాతిమత భేదములను పాటించిన తన ధర్మపత్నిని సైతము త్యజించెననియు ఇందు తెలుప బడినది.

భారత దేశమున ప్రబలిన మన హిందూ మతమందలి వివిధశాఖల సిద్ధాంతమును సంప్రదాయములను తెలుసుకొన గోరినవారి కీ గ్రంథము తప్పక చదువతగినదై యున్నది.

— సుహాసిని.



ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు

దేశభక్తుడు, ధైర్యశాలి, త్యాగశీలి, ప్రజాశ్రేయోభిలాషి, వక్త, వీరుడూ అయిన శ్రీ ప్రకాశం పంతులుగారి అస్తమయానికి ఆంధ్ర మహిళాసభవారు తమ సంతాపాన్ని ప్రకటిస్తున్నారు. పంతులుగారి ఆత్మకు శాంతి కలుగుగాక అని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి సానుభూతిని తెలియపరచుచున్నారు.

అశ్రుతర్పణం

"శ్రీ టి. ప్రకాశంగారి నిర్యాణంతో మన దేశం ఎంతటి త్యాగాన్ని చేయడానికైనా వెనుదీయకుండా స్వాతంత్ర్యంకోసం పోరాడిన మరొక నాయకాగ్రణిని గోల్పోయింది. అనన్య సామాన్యమైన ధైర్యసాహసాలతో అనంతమైన శక్తిసామర్థ్యాలతో ఆయన స్వాతంత్ర్యయోధుడుగా పోరాడారు. తరువాత మంత్రిగా ఎనభై ఏళ్ళకు పైబడి వయస్సువచ్చేవరకు ఆయన దేశ పునర్నిర్మాణానికై నిర్విరామంగా పాటుపడ్డారు. ఆంధ్ర ప్రదేశ్‌కు, శ్రీ ప్రకాశంగారి కుటుంబం వారికి నా హృదయపూర్వకమైన సానుభూతిని అందజేస్తున్నాను.''

—ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్.

"శ్రీ ప్రకాశంగారు నిర్యాణం చెందారని విని చాలా విచారిస్తున్నాను. ఆయన అస్తమించడంతో ప్రజాసేవా రంగంలో చిరకాలం ప్రముఖపాత్రను నిర్వహించిన ఒక ప్రముఖ నాయకుడు వెళ్ళిపోయాడు. ఆయన కుటుంబం వారికి నా సానుభూతిని అందజెయ్యండి."

—ప్రధాని నెహ్రూ.

"శ్రీ ప్రకాశంగారిది సేవకు కష్టాలకు త్యాగానికి అంకితమైన జీవితం. జీవితమంతా వారు ఉత్కృష్ట దేశ భక్తుడని వారు నిరూపించుకున్నారు,

—వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణన్.

"ఆంధ్రులకు నా సంతాపం. ఆంధ్రులు వారి నాయకుని కోల్పోయారు. నలభై సంవత్సరాలుగా ఆయన ఆంధ్రజాతికి జనకుడు. ఆయన నిజంగా సింహమే. ఇదివరలో మా మధ్య కొన్ని విభేదాలు ఉండేవి; ఇక వాటికి చోటులేదు. కాని మేం ఒకరినొకరం ఎంతో ప్రేమించుకొన్నాం. ఆయనను నేను ప్రశంసించాను. నన్నూ ఆయన ప్రశంసించారనే అనుకొంటాను.

"భారతదేశంలో పూర్తి అడవి మృగంగా వ్యవహరించిన బ్రిటిష్ సింహంతో పోరాడడానికి మేం ఇద్దరమూ ఒకమారే రాజకీయ జీవితంలో ప్రవేశించాం. సహాయ నిరాకరణోద్యమంలో మేం ఉభయులమూ కాడికి కట్టిన జోడెద్దుల మాదిరిగా కలిసి పనిచేశాం. దుర్దినాలలోసైతం ఆయన పట్ల ఆదరాభిమానాలనుచూపి, ఆంధ్రులు ప్రతిష్ఠ తెచ్చుకొన్నారు. ఉగ్ర, వేగ, ఉద్రిక్త పూరితమైన ఆయన జీవితం గడచింది. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక ఆయన కష్టమయ జీవితాన్ని, సాహసమయ జీవితాన్ని గడిపారు. ఆయన జీవితంవల్ల ఉత్తేజం పొంది, ఆంధ్రులు భారతదేశానికి మార్గదర్శకులు అగుగాక"

—రాజాజీ.

"శ్రీ ప్రకాశంగారి మరణవార్త విచారాన్ని కలిగించింది. ఆయన జీవితం త్యాగమయం. సేవామయం. ఆంధ్ర ప్రజలపట్ల ఆయనకు వున్నంతటి ప్రేమాభిమానాలు మరొకరిలో కానరావు. అలాంటి ప్రజాపక్షపాతి మరొకరు లేరు. మాతృదేశం మహనీయులతో ఒకడుగా ఆయన ఆంధ్ర ప్రజలకు, దేశప్రజలకు చిరస్మరణీయుడు.''

—శ్రీ ఢేబర్.

"శ్రీ ప్రకాశంగారి మృతివార్త వింటే నాకు ఎంతో దుఃఖం కలిగింది. వారితోకలిసి సేవచేసే మహద్భాగ్యం నాకు ఎన్నిమారులో లభించింది. అతిపేదగా జీవితం ప్రారంభించి, ఆంధ్రదేశంలోకెల్ల అగ్రరాజ నీతిజ్ఞులైనారు. వారి సంకల్పశక్తి, ధైర్యసాహసాలు అచంచలం.

"సైమన్ కమీషన్ రోజులనాటి ఘట్టం ఒకటి నాకు గుర్తువస్తున్నది. ఆ కమీషన్‌ను ప్రతిఘటించి, సైమన్‌ను వెనకదారి పట్టాలని నినాదాలు చెయ్యడానికి మద్రాసులో నాయకులందరూ విముఖులుగా ఉన్నారు. ఆసమయంలో శ్రీ ప్రకాశం ముందుకువచ్చారు. చొక్కా విప్పి, రొమ్ము చూపి, తుపాకులకు ఎదురువెళ్ళారు.

"తన సర్వసంపదల్నీ ధారపోసిన త్యాగధనులలో వారు అగ్రగణ్యులు."

"వారికి వారి స్వగృహంలో ఒక్క రాగిపాత్రయును మిగలలేదని నా అభిప్రాయం."

"తమ సర్వస్వాన్నీ ఆంధ్ర రాష్ట్రంకోసం త్యాగం చేశారు."

"దేశసేవకు త్యాగానికీ వారు ఆంధ్ర దేశానికి, భారత దేశం అంతటికీ ఆదర్శ పురుషుడుగా శాశ్వత కీర్తి ఆర్జించుకున్నారు.

—శ్రీ అనంతశయనం అయ్యంగార్.

"శ్రీ ప్రకాశం నిజంగా ఆంధ్రకేసరి. దేశంలోని సింహాలన్నింటికంటే ఆయన పెద్ద సింహం."

—శ్రీ నిజలింగప్ప.

"శ్రీ ప్రకాశంగారి నిర్యాణంతో ఇండియా, దేశం కోసం తన సర్వస్వాన్ని త్యాగంచేసిన ఒక మహా దేశ భక్తుణ్ణి కోల్పోయింది. ఆయన సుదీర్ఘమైన జీవితకాలం పొడుగునా విశ్రాంతి అంటే ఏమిటో ఎరగకుండా పోరాడిన అసమాన ప్రతాపశాలి అయిన యోధుడు.

—ఆచార్య జె. బి. కృపలానీ.

"ఇండియా ఒక గొప్ప దేశభక్తుణ్ణి ఒక యోధాగ్రగణ్యుణ్ణి కోల్పోయింది. ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం వెనుకంజ అనేది లేకండా నిర్విరామంగా జరిపినపోరాటమే ఆయన ప్రధానంగా చేసినసేవ. ఆంధ్ర కాంగ్రెసు కురువృద్ధులలో ఆయన ఒకరు. ప్రజల ప్రేమ గౌరవాలను పూర్తిగా చూరగొన్న ఆంధ్ర నాయకులలో ఆంధ్రభీష్మ శ్రీ న్యాపతి సుబ్బారావుగారి తరవాత శ్రీ ప్రకాశంగారి పేరే చెప్పాలి. ఆయన లోపాలను నిర్మొహమాటంగా విమర్శించేవాడు. మిత్రులకు ప్రాణాల నర్పించేవాడు. శత్రువులపట్ల ఔదార్యం చూపేవాడు. ఆయన దయార్ద్ర హృదయుడు. స్నేహశీలి. మిత్రులను, అనుయాయులను చేరదీయడంలో ఆయనకు మంచి నేర్పువున్నది.

—డాక్టర్ సి. పి. రామస్వామి అయ్యర్.

"ఇక శ్రీ ప్రకాశంగారిని గురించి, దుఃఖావేగాలను దిగమింగుకొని సంస్మరించడం సాధ్యపడదు. ఆయన మహా నాయకుల కోవకు చెందినవాడు. ఆయన లోటు భర్తీ కావడం అసంభవం."

—శ్రీ రాజమన్నార్.

"ఇప్పటితరం వారి స్మృతిపథంలో శ్రీ ప్రకాశంగారిని మించిన ఆంధ్ర నాయకుడు మరి లేడు. భయమన్న నెట్టిదో ఆయన ఎరుగడు. ఒక్కొకప్పుడాయన తప్పు దారులు తొక్కకపోలేదు; కాని, ప్రమాదం శంకించి తన సంకల్పాన్ని విరమించుకొనడం ఆయన తత్వం లోనే లేదు. ఎంతటి అంతరాయాలనైనా, అచంచల చిత్తంతో ఎదుర్కొనేవాడు; అందుచేతనే ఆయన పరాజయాన్ని అంగీకరించేవాడుకాదు. పై పెచ్చు, ఏ సందర్భంలోనైనా ప్రత్యర్థులచేతనో, ప్రతికూల పరిస్థితుల వల్లనో దెబ్బతిన్నప్పుడే ఆయన తన మహౌదార్యాన్ని ప్రదర్శించేవాడు.

ప్రకాశంగారిని చూచినప్పుడల్లా చర్చిల్ తనకు తలపు కొచ్చేవాడని లోగడ మద్రాసు గవర్నర్‌గా పనిచేసిన సర్ ఆర్చిబాల్డ్‌నై నాతో అనేకమార్లు చెప్పాడు. ఇద్దరివీ సింహంలాంటి ముఖాలు; ఇద్దరి మూర్తులు అత్యంత గంభీరాలు. ఇద్దరూ మేరు సమధీరులు. చర్చిల్‌వలెనే ప్రకాశంకూడా జాతీయ వీరుడుగా పరిగణించబడి ప్రజల ప్రేమాదరాలను అపారంగా చూరగొన్నాడు.

"శ్రీ ప్రకాశం కర్మయోగి. నిత్యసంఘర్షణలకు, పెక్కు ఘనకార్యాలకు కాణాచి పౌరుషోపేతమైన ఆయన జీవితం. మూర్తిమంతమైన ఆయన ధీరోదాత్తతే లక్షలాది ప్రజల భక్త్యనురాగాలను చూరగొన్నది.

—శ్రీ ఖాసా సుబ్బారావు.

"భారతదేశం ముఖ్యంగా ఆంధ్రదేశం-ఒక ఉత్తమ కుమారుని కోల్పోయింది. జన్మతః ఆయన వీరుడు; ఆంధ్రకేసరి అస్తమయంతో ఆంధ్రదేశం దిక్కులేనిదయింది. పూర్తి ఆశావాదిగానే ఆయన జీవితం గడిపారు. పార్టీ ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా ఎలాంటి కష్టాలలోనైనా ఆయన ఆంధ్రుల కోసం పోరాడారు."

—డాక్టర్ విజయ.

పంతులుగారు నిజంగా సింహమే. ఆయన జీవితమంతా కష్టాలు దేశసేవతో నిండిపోయిన ఘటనావళి. ఆయనది అణిగిమణిగి ఉండని సాహసం.

—గవర్నరు శ్రీ బూర్గుల రామకృష్ణరావు.

ప్రకాశంగారు పరిపూర్ణ జీవితాన్ని అనుభవించారు. ఉన్నత జీవితాన్ని చూశారు. అస్తమించారు. దేశం కోసం జీవించిన మహావ్యక్తి.

—శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు.